# వ్యవసాయ పాడి పంటలు

వ్యవసాయ శాఖ

సంపుటి-4 | సంచిక-8 | వ్యవసాయ శాఖ | పేజీలు - 52 | ఆగస్టు-2014

"వ్యవసాయ సూచనలు, సలహాల కోసం www.apagrisnet.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి."




పచ్చిమ గోదావరి జిల్లా రైతులతో ముఖాముఖి
కార్యక్రమాంలో ప్రసంగిస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు




అనంతపురం జిల్లా రైతులు, చేనేత కార్మికులతో
ముఖాముఖి కార్యక్రమాంలో ప్రసంగిస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు



ఇజ్రాయిల్ టీమ్‌తో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు,
వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ కమీషనరు తదితరులు



# పశ్చిమ గోదావరి - దృశ్యమాలిక










# అనంతపురం - దృశ్యమాలిక









వ్యవసాయ పాడి పంటలు

సంపుటి : 4 ఆగస్టు-2014 సంచిక : 8

శ్రీ జయ నామ సంవత్సరం ఆషాడం - శ్రావణం


# విషయసూచిక

వ్యవసాయ సలహాలు, సూచనలకోసం **www.apagrisnet.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించండి!

## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

కె. మధుసూదన రావు ఐ.ఎ.ఎస్.,

వ్యవసాయ కమిషనర్



సంపాదకులు

వి.వి. విజయలక్ష్మి

అదనపు వ్యవసాయ సంచాలకులు

సహాయ సంపాదకులు

- ఎస్.బాలు
- డి. ప్రవీణ్
- వి.నాగ ప్రమీలారాణి

'వ్యవసాయ పాడిపంటలు' మాసపత్రిక
సంవత్సర చందా రూ.120/-లు మాత్రమే
డి.డి. రూపంలో Asst. Director of Agriculture (Printing)
పేరున, హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి.


**Mail ID :** padipantaluap@gmail.com

**రచనలు పంపాల్సిన చిరునామా**

సహాయ వ్యవసాయ సంచాలకులు (ముద్రణ)
వ్యవసాయ కమిషనరు వారి కార్యాలయం
సమేతి, వాటర్‌ట్యాంక్ దగ్గర, మలక్‌పేట్, హైదరాబాద్ - 500036.
ఫోన్ : 040-


**పత్రికలో ప్రకటనల ధరలు**

| | |
|---|---|
| 4వ కవర్ పేజీ (బ్యాక్ కవర్) | రూ. 25,000-00 |
| 2, 3 కవర్ పేజీ | రూ. 20,000-00 |
| లోపలి పేజీ (ఫుల్) | రూ. 15,000-00 |
| లోపలి పేజీ (హాఫ్) | రూ. 10,000-00 |
| లోపలి పేజీ (1/4) | రూ. 5,000-00 |


**Printed & Published by :**
K. Madhusudhana Rao, I.A.S.,
On behalf of Commissioner & Director of Agriculture
at Commissioner & Director of Agriculture
Government of Andhra Pradesh
Opp. L.B. Stadium, Basheerbagh, Hyderabad-500 001.

**And Printed at :**
M/s.Card Box Company Offset Printers, 10-2-289/120/7,
Vijayanagar Colony, Hyderabad-500 057 (AP).


**గౌరవనీయులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు అనంతపురం జిల్లా రైతులతో ముఖాముఖి 8**




1. రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు....4
2. సంపాదకీయం ....5
3. ఆగస్టు మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు....6
4. వాతావరణం - పంటల పరిస్థితి....7
5. ముఖ్యమంత్రి పశ్చిమ గోదావరి జిల్లా, అనంతపురం రైతులతో ముఖాముఖి....8
6. జాతీయ పంటలబీమా పథకము....9
7. ఖరీఫ్ - 2014 లో ఎమ్.ఎన్.ఎ.ఐ.ఎస్ ....10
8. వర్షాధార వ్యవసాయ యాజమాన్యం....11
9. పద సాగు విజ్ఞానం-45 (సమాధానాలు), ఖరీఫ్ కందిలో సస్యరక్షణ....13
10. నేలను కప్పి ఉంచే పంటలు - ప్రయోజనాలు ....14
11. పత్తిలో కాండనికి మందుపూత....16
12. అక్షర సేద్యం -43 (సమాధానాలు)....15
13. బెండ సాగులో పాటించాల్సిన మెళకువలు....17
14. శీఘ్రమేవ 'మార్పు' ప్రాప్తిరస్తు-46....19
15. పాట : డ్రమ్ సీడర్ పద్ధతి - పేరడీ సాంగ్ ....22
16. విజయగాథ : డ్రమ్‌సీడర్‌తో వరిసాగుపై విజయగాథ....23
17. పుచ్చ, ఖర్బూజ పంటల సాగు వివరాలు....24
18. విజయగాథ : శ్రీవరిసాగు - అధిక దిగుబడి సాధించిన మహిళారైతు ....27
19. విజయగాథ : హైబ్రిడ్ వరి సాగు చేసిన రైతు విజయగాథ....28
20. మినుములో పల్లాకు తెగులు - యాజమాన్యం....29
21. సేంద్రియ వ్యవసాయంతో లాభాల బాటలో మెదక్ జిల్లా రైతు ....30
22. గుంటూరు జిల్లాలో 'వెబ్ కాస్టింగ్' - ఓ నివేదిక....31
23. యాంత్రీకరణ ద్వారా "శ్రీ" వరి సాగు....32
24. నువ్వుల పంటలో ఎరువుల, నీటి యాజమాన్యం....33
25. పద సాగు విజ్ఞానం-47....34
26. మొక్కజొన్న సాగులో మెళకువలు....36
27. వర్మీకల్చర్ వలన లాభాలు....38
28. నేల సూర్యరశ్మీకరణ (సాయిల్ సోలరైజేషన్)....38
29. అక్షరసేద్యం-44....39
30. పాడి పసిడి : పాలకు అధిక ధర పొందాలంటే....41
31. రైతులప్రశ్నలు - శాస్త్రవేత్తల సమాధానాలు....42
32. ఫోన్-ఇన్-లైవ్....44
33. జిల్లా అనుబంధం....45


ఏడు దశాబ్దాలుగా (జూలై 1993న 50 ఏళ్ళ ప్రత్యేక సంచిక వచ్చింది) రైతాంగానికి సలహాలు, సూచనలు ఇస్తూ, ఎప్పటికప్పుడు వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, అభివృద్ధి గురించి తెలియజేస్తూ, ప్రభుత్వ పథకాలు, రాయితీలను గురించి సమాచారం అందిస్తూ రైతాంగానికి కరదీపికగా వస్తున్న 'వ్యవసాయ పాడి పంటలు' పత్రికను చదువుదాం. రైతులందరిచేత చదివిద్దాం! - సం.



## రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు

| క్ర. సంఖ్య | జిల్లాలు | వర్షపాత వివరములు (మి.మీ.లలో) 01-06-2014 నుండి 30-07-2014 వరకు | |
|---|---|---|---|
| | | సాధారణ | నమోదు |
| 1. | శ్రీకాకుళం | 317.3 | 320.8 |
| 2. | విజయనగరం | 302.2 | 248.9 |
| 3. | విశాఖపట్టణం | 319.8 | 224.2 |
| 4. | తూర్పు గోదావరి | 346.0 | 194.6 |
| 5. | పశ్చిమ గోదావరి | 353.9 | 267.4 |
| 6. | కృష్ణా | 304.2 | 245.4 |
| 7. | గుంటూరు | 226.7 | 144.3 |
| 8. | ప్రకాశం | 146.4 | 107.4 |
| 9. | నెల్లూరు | 141.4 | 76.1 |
| 10. | కర్నూలు | 193.7 | 177.0 |
| 11. | అనంతపురం | 130.6 | 87.4 |
| 12. | కడప | 163.5 | 86.6 |
| 13. | చిత్తూరు | 177.5 | 138.0 |



## రాష్ట్రంలో సాగైన పంటల విస్తీర్ణం

(హెక్టార్లలో)

| క్ర. సంఖ్య | జిల్లాలు | పంటల సాగు విస్తీర్ణం 02-07-2014 వరకు | |
|---|---|---|---|
| | | సాధారణ | విస్తీర్ణం |
| 1. | శ్రీకాకుళం | 93939 | 97759 |
| 2. | విజయనగరం | 97045 | 53160 |
| 3. | విశాఖపట్టణం | 107494 | 78019 |
| 4. | తూర్పు గోదావరి | 120878 | 95622 |
| 5. | పశ్చిమ గోదావరి | 116268 | 89924 |
| 6. | కృష్ణా | 147504 | 77669 |
| 7. | గుంటూరు | 147171 | 80277 |
| 8. | ప్రకాశం | 76693 | 40563 |
| 9. | నెల్లూరు | 72288 | 64508 |
| 10. | కర్నూలు | 239070 | 341889 |
| 11. | అనంతపురం | 523411 | 559599 |
| 12. | కడప | 74599 | 25399 |
| 13. | చిత్తూరు | 172228 | 155831 |

# సంపాదకీయం

## నీటిని పొదుపుగా వాడే సాగుపద్ధతులు ఆచరిద్దాం!

.వ్యవసాయప్రదాయకమైన మన రాష్ట్రంలో ప్రజల ఆహార అవసరాలకు అతి ప్రధానమైనది వరి. ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాల్లో విస్తారంగా వరిని కాలువలు, చెరువులు, బావుల ఆధారంగా సాగు చేస్తున్నారు. వ్యవసాయసాగు విస్తీర్ణం రోజురోజుకూ తగ్గుతుండగా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది నిర్వివాదాంశం.


ప్రకృతివైపరీత్యాలైన వర్షాభావ పరిస్థితుల కారణంగా రిజర్వాయర్లలో నీటిమట్టం తగ్గి, భూగర్భ జలాలు అడుగంటిన పరిస్థితుల్లో వరిసాగు కాలువలు, చెరువులు, బావులక్రింద ప్రశ్నార్థకంగా మారింది.

ఈ తరుణంలో తక్కువ సమయంలో,తక్కువ నీటి వినియోగం, అలాగే తక్కువ పెట్టుబడులతో వరిలో అధిక దిగుబడులు సాధించడం మన ప్రధాన లక్ష్యం.

తక్కువ విత్తనమోతాదు వినియోగించడం, నీరు, డీజిల్/విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయడంతోపాటు సంప్రదాయ వరిసాగు దిగుబడులతో పోల్చినపుడు హెక్టారుకు కనీసం 1 టన్ను అధిక దిగుబడులు పొందే అవకాశం శ్రీవరిసాగు ప్రధాన ప్రత్యేకతలు.

ఈ లక్ష్యసాధనలో భాగంగా మన రైతాంగం స్వల్పకాలిక రకాలసాగు, వరి నేరుగా డ్రమ్‌సీడర్ ద్వారా విత్తుట, శ్రీవరిసాగు ఆచరించుట ఎంతైనా అవసరం.

కావున రైతులందరూ ముఖ్యంగా బావులు, చెరువులు, అలాగే కాలువల క్రింద డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తుట, శ్రీవరిసాగు ఆచరించి తక్కువ నీటివనరులతో తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో అధిక దిగుబడులు సాధించాలని ఆశిద్దాం.



# ఆగస్టు మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ

**వరి :** జూలై మొదటి వారంలో నార్లు పోసిఉంటే ఆగస్టు మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. నాట్లు దగ్గర దగ్గరగా కుదురుకు రెండు మూడు మొక్కల చొప్పున పైపైన నాటుకోవాలి. ఆఖరి దమ్ములో హెక్టారుకు చౌడు నేలలకు 75 కిలోలు, సాధారణ నేలలకు 50 కిలోల జింకు సల్ఫేటును వేయాలి. నాటే ముందు హెక్టారుకు ఆయా ప్రాంతాలకు సిఫారసు చేసిన ఎరువుల్లో మొదటి దఫాగా నత్రజని మూడవ వంతు, పూర్తి భాస్వరం, పొటాష్ ఎరువులను వేయాలి. తేలిక నేలలయితే పొటాష్ ఎరువు సగభాగం మాత్రమే వేయాలి.

రసాయనాల్లో కలుపు నివారణ చేపట్టవలసిఉంటే నాటిన 3 నుండి 5 రోజులలోపు హెక్టారుకు 10కిలోలు 2,4-డి గుళికలు 10 కిలోలు బ్యుటాక్లోర్ గుళికలు 50 కిలోలు పొడి ఇసుకతో కలిపి చల్లాలి. అంతరకృషి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

**జొన్న :** మాఘీ జొన్న పొలం తయారీకి ఈ మాసం అనుకూలం. ఆగస్టు రెండవ పక్షం నుండి విత్తుకోవచ్చు.

**మొక్కజొన్న :** నత్రజని ఎరువును రెండవ దఫా మోకాలు ఎత్తు ఉన్నప్పుడు (30-35 రోజులకు), మూడవ దఫాగా 50-55 రోజులకు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి.

**వేరుశనగ :** పూత దశలో ఉన్న పైరుకు హెక్టారుకు 500 కిలోల జిప్సం మొక్కలకు దగ్గరగా వేసి మట్టిని ఎగవేయాలి. ఆకుముడత పురుగు బారినుండి పైరును రక్షించడానికి క్వినాల్‌ఫాస్ 25 శాతం ఇ.సి. మందును 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. జూలై మాసంలో విత్తిన పైరుకు అంతరకృషి చేయాలి. తిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రాములు డైథేన్ ఎం-45 లేదా 1 గ్రాము కార్బండజిమ్ లీటరు నీటికి చొప్పున ఏదైనా ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**ఆముదం :** ఈ నెల మొదటి వారంలోగా విత్తుకోవాలి. వాలుకు అడ్డంగా 60-65 రోజులకు హెక్టారుకు 40 కిలోల యూరియాను నేలలో తేమ బాగా ఉన్నప్పుడు వేయాలి. చివరి అంతరకృషి తర్వాత 4-5 సాళ్ళకు ఒక లోతు సాలు నాగలితో ఏర్పాటు చేయాలి. జూలై మాసంలో విత్తిన పైరుకు విత్తిన 30-35 రోజులకు అంతరకృషి చేసి పిదప హెక్టారుకు 40 కిలోల యూరియాను వేయాలి.

**పొద్దుతిరుగుడు :** బరువైన నేలల్లో, నల్లరేగడి నేలల్లో ఈ మాసం మూడవ వారంలోగా విత్తుకోవాలి. విత్తేటప్పుడు హెక్టారుకు 30 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి.

**మిరప :** నాట్లు వేయడానికి అనుకూలం. వర్షాధారపు పంటకు చివరి దుక్కిలో నాటడానికి ముందు హెక్టారుకు 30కిలోలనత్రజని, 40 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.

**పత్తి :** విత్తిన 25 నుండి 30 రోజులకు మొదటి దఫా నత్రజనిని, 45 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి. రసం పీల్చే పురుగుల నుండి రక్షణకై మోనోక్రోటోఫాస్ లేదా మిథైల్‌డెమటాన్-నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోప్రిడ్-నీరు 1:20 నిష్పత్తిలో కలిపిన ద్రావణాన్ని 20, 40, 60 రోజుల్లో మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూయాలి. ఈ పద్ధతి వల్ల పురుగు మందు ఖర్చు తగ్గడమే కాకుండా వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది.

**పెసర :** చిత్తపురుగులు పైరును లేత దశలో ఆకులపై ఆశించి రంధ్రాలు చేస్తాయి. నివారణకు 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ లేదా 2 మి.లీ. ఎండోసల్ఫాన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామరపురుగులు కూడా పైరు తొలిదశలో లేత ఆకులపై ఆశించి రసాన్ని పీలుస్తాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.





# వాతావరణం - పంటల పరిస్థితి

డా.జి.శ్రీనివాస్, సంచాలకులు, డా.ఆర్.సునీతా దేవి, శాస్త్రవేత్త, ఎస్.జి. మహదేవప్ప, శాస్త్రవేత్త
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ పరిశోధనా సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్.
ఫోన్ నెం.: 040-24016901

భారత వాతావరణ విభాగం ఢిల్లీ వారి సమాచారం ప్రకారం సాధారణంగా కేరళలో నైరుతి రుతుపవనాలు జూన్ 1వ తేదీన ప్రవేశిస్తాయి. కాని ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు కేరళలో జూన్ 6వ తేదీన ప్రవేశించాయి. అనగా 5 రోజులు ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు భారత ఉపఖండంలోకి ప్రవేశించాయి రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ 19న కొన్ని ప్రాంతాలకు ప్రవేశించి జూన్ 20వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. అనగా దాదాపు 12 రోజులు ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి.

రాష్ట్రంలో 1.6.14 నుండి 23.7.14 వరకు కురిసిన వర్షపాత వివరాలను జిల్లాలవారీగా గమనిస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 206 మి.మీ.కుగాను 130 మి.మీ. అంటే 37 శాతం తక్కువ వర్షాలు కురిసాయి.

రాష్ట్రంలో 1.6.1-4 నుండి 23.7.14 వరకు కురిసిన వర్షపాత వివరాలను జిల్లాలవారీగా గమనిస్తే శ్రీకాకుళం, విజయనగరం, అనంతపూర్, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కడప, నెల్లూరు, ప్రకాశం, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సాధారణం కంటే అతితక్కువ వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలో 23.7.14 వరకు ఖరీఫ్ పంటకాలానికి విస్తీర్ణం గమనిస్తే సాధారణ విస్తీర్ణంలో వరి (13 శాతం), జొన్న (6 శాతం), సజ్జ (27 శాతం), మొక్కజొన్న (51 శాతం), రాగులు (25 శాతం), ఇతర చిరుధాన్యాలు (36 శాతం), కంది (25 శాతం), పెసలు (20 శాతం), మినుములు (14 శాతం), ఉలవలు (1 శాతం), ఇతర పప్పుదినుసులు (35 శాతం), వేరుశనగ (37 శాతం), నువ్వులు (54 శాతం), ఆముదం (16 శాతం), ప్రొద్దుతిరుగుడు (8 శాతం), సోయాచిక్కుడు (5 శాతం), పత్తి (64 శాతం), గోగు (31 శాతం), మిరప (2 శాతం), చెరకు (85 శాతం), ఉల్లి (55 శాతం), పసుపు (21 శాతం) సాగు చేశారు.


ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఇప్పటివరకు ఆహార పంటలు 33.08 శాతం, పప్పుదినుసులు 23 శాతం, నూనెగింజల పంటలు 35.3 శాతం మొత్తం మీద 30 శాతం వరకు పంటలు సాగుచేశారు. ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 41.71 లక్షల హెక్టార్లకు గాను ఇంతవరకు 16.27 లక్షల హెక్టార్లలో వివిధ పంటలను సాగుచేశారు.

భారత వాతావరణ విభాగం (ఐఎండి, న్యూఢిల్లీ) వారు అందించిన ముందస్తు వాతావరణ సమాచారం ప్రకారం ఈ సంవత్సరం దేశంలో జులై నెలలో 93%, ఆగస్ట్ నెలలో 96% వరకు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. అలాగే దక్షిణ భారతదేశంలో నైరుతి రుతుపవనాల ప్రభావం వలన ఈ సంవత్సరం జూన్ నుండి సెప్టెంబర్ వరకు 93% వరకు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి.

### వాతావరణాధారమైన వ్యవసాయ సలహాలు :

- ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో ఆగస్ట్ మొదటి పక్షం వరకు వర్షాధారపు పంటలైన కంది, పశుగ్రాస, జొన్న, సజ్జ, కొర్ర, రాగి, మినుములు, పెసలు,పిల్లిపెసర, పొద్దుతిరుగుడు, ఉలవలు మొదలగు పంటలను ప్రత్యామ్నాయ పంటలుగా విత్తుకోవాలి.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకొని వర్షాధారపు పంటలైన పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, సోయాచిక్కుడు పంటలను విత్తుకోవడం త్వరగా పూర్తిచేసుకోవాలి.

## గౌరవనీయులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు పశ్చిమ గోదావరి జిల్లా రైతులతో ముఖాముఖి



ది. 16.07.2014న పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి డివిజన్ కామవరపుకోటనందు జరిగిన రైతుసదస్సులో గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారాయ చంద్రబాబునాయుడుగారు, వ్యవసాయశాఖ మంత్రి శ్రీ పత్తిపాటి పుల్లారావుగారు, దేవాదాయశాఖ మంత్రి శ్రీ పైడికొండల మాణిక్యాలరావుగారు, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి, శ్రీమతి పీతల సుజాతగారు, హోం మంత్రి శ్రీ నిమ్మకాయల చినరాజప్పగారు మరియు జిల్లాకు చెందిన శాసనసభ్యులు పాల్గొనినారు.

జిల్లాలోని అన్ని మండలాలనుండి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుల వారి పర్యవేక్షణలో రైతుశిక్షణా కేంద్రమువారు వ్యవసాయ అనుబంధశాఖలను సంప్రదించి వివిధ శాఖలవారి కార్యక్రమముల ఫోటోల ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగినది.

వ్యవసాయ శాఖతోపాటు, వివిధ శాఖలవారు నిర్వహించు కార్యక్రమాలు, పథకముల గురించి వివరించే స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.

కౌలు రైతులకు రుణము రూ. 1,50,000.00లు చెక్కును స్టాల్ వద్ద గౌరవ ముఖ్యమంత్రి వర్యుల చేతులమీదుగా అందించడం జరిగింది మరియు అన్ని స్టాల్స్‌ను వారు ఆసక్తిగా పరిశీలించినారు.

తదుపరి జరిగిన రైతు సదస్సులో ముందుగా జిల్లారైతులు తమ అనుభవాలను గౌరవ ముఖ్యమంత్రివర్యుల సమక్షంలో వివరించడం జరిగింది. వారితో ముఖాముఖి చర్చలలో ముఖ్యవిషయాలు ఏమనగా –

గ్రామీణ విత్తనోత్పత్తి పథకముద్వారా విత్తనముల లభ్యత,సేంద్రియ వ్యవసాయము మరియు గో ఆధారిత వ్యవసాయం

మెట్టసాగులో సాధక బాధకాలు, అనుభవాలు, ప్రభుత్వ ప్రోత్సాహకం, వ్యవసాయ యాంత్రీకరణ, ట్రాన్స్‌ప్లాంటర్స్‌పై రాయితీ పెంపు మరియు ప్రభుత్వ ప్రోత్సాహకం, సూక్ష్మపోషక లోపాలు, సవరణ మరియు ప్రోత్సాహకాలు, కౌలు రైతులకు ఋణాలు

పై విషయాలపై రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తదుపరి గౌరవ ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ వరి, పామాయిల్ వంటి పంటలకు గిట్టుబాటు అయ్యే విధానాలు పరిశీలిస్తామన్నారు. శాస్త్రసాంకేతిక అభివృద్ధిని వ్యవసాయానికి ఎక్కువగా అనుసంధానం చేయాల్సి వుందన్నారు. పంటపొలాల్లోని సమస్యలను ఫోటో తీసి పంపుట ద్వారా మేలైన సలహాలు పొందవచ్చన్నారు.

కౌలు రైతులు మరియు భూయజమానుల మధ్య అపోహలు తొలగించి, కౌలుదారులకు, సొంతదారులను పరిరక్షించే విధంగా చట్టంలో మార్పులు తీసుకువస్తామన్నారు. రుణమాఫీ కి సంబంధించిన చర్యలు చేపట్టామన్నారు. వ్యవసాయధారిత పరిశ్రమలు నెలకొల్పడం, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయుట.

వ్యవసాయం యాంత్రీకరణను ఉపయోగించుకొని లబ్ధిపొందాలన్నారు. పామాయిల్, ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించి నీటిని పొదుపు చేసే విధానాలు (వాటర్ కన్జర్వేషన్) మరియు భూసారాన్నే మరియు నీటిని సంరక్షించాలన్నారు.

తదుపరి గౌ॥ వ్యవసాయ శాఖామాత్యులు మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల కార్డులు, నీటి వినియోగము, మరియు సూక్ష్మపోషకాల లోపాలన సరిచేయవలసిన ఆవశ్యకత గురించి తెలియజేశారు.

తదుపరి గౌ. శ్రీ వ్యవసాయశాఖ కమిషనరు మరియు సంచాలకులు శ్రీ కె. మధుసూదన్‌రావుగారు ప్రస్తుతం వ్యవసాయ కాలమాన పరిస్థితులు వాతావరణం, పంటల పరిస్థితులు, వివరించి, ప్రత్యామ్నాయ పంటలు పండించుట, ఆవశ్యకత, విత్తన సరఫరా, ఎరువుల లభ్యత వంటి విషయాలు తెలియజేశారు.

వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు వివరించారు. పవర్ టెల్లర్, రోటవేటర్ వాడకం ఆవశ్యకత వివరించారు. పనిముట్లకు మెయింటెనెన్స్‌కొరకు సర్వీసు స్టేషన్ల గూర్చి తెలియజేశారు. ఎస్ఎంఎస్ఆర్టై, ఎటిఎంఎ పథకముల గూర్చి తెలియజేశారు.

## గౌరవనీయులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు అనంతపురం రైతులతో ముఖాముఖి

తేది: 25.07.2014న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముదిగుబ్బ మండలం, గ్రామంలలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో తమ ఆలోచనలను రైతులతో పంచుకున్నారు.

ఈ కార్యక్రమం సందర్భంగా వ్యవసాయశాఖ, అనుబంధశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన గౌరవ ముఖ్యమంత్రి సందర్శించారు. కౌలు రైతులకు రుణము రూ. 1,50,000.00లు చెక్కును స్టాల్ వద్ద గౌరవ ముఖ్యమంత్రి వర్యుల చేతులమీదుగా అందించడం జరిగింది మరియు అన్ని స్టాల్స్‌ను వారు ఆసక్తిగా పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు, అనంతపురం జిల్లా మంత్రులు శ్రీమతి పరిటాల సునీత, శ్రీరఘునాథరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ కాలువ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికసంఖ్యలో



తరలివచ్చిన రైతులనుద్దేశించి మాట్లాడుతూ, అనంతపురం జిల్లా రైతుల కష్టాలు తమకు తెలుసని ప్రభుత్వం జిల్లాలో రూ.7600 కోట్లు రుణమాఫీ చేస్తుందని, అలాగే ఒక కుటుంబానికి రూ. 1.50 లక్షలు, 1 లక్ష వరకు డ్వాక్రా రుణాలు మాఫీచేస్తున్నట్లు ప్రకటించారు.

అనంతపురం జిల్లాలో భూగర్భజలాలను పెంచడానికి, వర్షపునీటిని నిలువ చేయడానికి అవసరం అయిన అన్ని సాయిల్ కన్జర్వేషన్ చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని రైతులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గారు మాట్లాడుతూ భూసారపరీక్ష ఆవశ్యకత, రైతులకు గిట్టుబాటు ధర, బిందు మరియు తుంపర సేద్యం వలన లాభాలు, 250 కోట్లతో గోడౌను కట్టడం, రైతు బజార్లను పునరుద్ధరించడం మొదలగు విషయాలు చర్చించారు.

తదుపరి గౌ. శ్రీ వ్యవసాయశాఖ కమిషనరు మరియు సంచాలకులు శ్రీ కె. మధుసూదన్‌రావుగారు ప్రస్తుతం వ్యవసాయ కాలమాన పరిస్థితులు వాతావరణం, పంటల పరిస్థితులు, వివరించి, ప్రత్యామ్నాయ పంటలు పండించుట, ఆవశ్యకత, విత్తన సరఫరా, ఎరువుల లభ్యత వంటి విషయాలు తెలియజేశారు.

వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు వివరించారు. పవర్ టెల్లర్, రోటవేటర్ వాడకం ఆవశ్యకత వివరించారు. పనిముట్లకు మెయింటెనెన్స్‌కొరకు సర్వీసు స్టేషన్ల గూర్చి తెలియజేశారు. ఎస్ఎంఎస్ఆర్తై, ఎటిఎమ్ఎ పథకముల గూర్చి తెలియజేశారు.

అనంతపురం జిల్లాకు సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, రైతులు మాట్లాడుతూ రుణమాఫీ ప్రకటించినందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదములు తెలుపుతూ ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## జాతీయ పంటలబీమా పథకము

కేంద్రప్రభుత్వం జాతీయ వ్యవసాయ బీమా పథకం(**NASI**) స్థానంలో నూతనంగా ప్రతిపాదించిన "జాతీయ పంటల బీమా (**NCIP**) పథకం క్రింద సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకము మరియు వాతావరణ ఆధారిత పంటలబీమా పథకాలను ఖరీఫ్ – 2014 పంటకాలంనకు రైతులకు మరింత లాభం చేకూర్చే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసారు.

**సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకం :**

ఖరీఫ్ – 2013లో తూర్పు పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల లాగా ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ పథకాన్ని ఖరీఫ్-2014లో రాష్ట్రంలోని 13 జిల్లాలలో అమలు చేయబడుతుంది.

ఈ పథకం వలన రైతుకు అదనంగా చేకూరే ప్రయోజనాలు

1. పంటకోత అనంతరం పంట కల్లంలో వుండగా జరిగే నష్టానికి కూడా పంటకోసిన నాటి నుండి 14 రోజుల వరకు బీమా వర్తింపు.

2. అనావృష్టి మొదలగు ప్రతి కూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంట విత్తు, నాట్లు వేయలేక పోయిన సందర్భంలో కూడా సాగు ఖర్చులో 25 శాతం వరకు బీమా పరిహారం చెల్లింపబడుతుంది.

3. జిల్లాలోని ముఖ్యమైన ఒక పంటకు గ్రామం యూనిట్‌గా అమలు చేయబడుతుంది.

4. పంటకాలం మధ్యలో యేదేని ప్రకృతి వైపరీత్యం వలన పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లినట్లైతే భీమా చేసిన రైతుకు తక్షణ సాయంగా రాబోయె పరిహారంలో 25 శాతం లెక్కించి ముందస్తుగా రైతుబ్యాంకు ఖాతాలో జమచేసి మిగిలిన పరిహారం పంటకోత ప్రయోగాలు దిగుబడి అంచనాలు పూర్తి అయిన పిదప రైతుకు చెల్లిస్తారు.

5. కనిష్ట హామీ దిగుబడి శాతాన్ని కూడా 60 నుండి 80 శాతానికి పెంచారు.

ఈ పథకంలో సన్నకారు, చిన్నకారు రైతులతో నిమిత్తం లేకుండా అందరు రైతులకు 40 నుండి 75 శాతం ప్రీమియంలో రాయితీ కల్పించబడింది.

ఖరీఫ్-2014లో జిల్లాల వారిగా ప్రతిపాదించిన పంటలు. టేబుల్ -1 జతపరచటమైనది.

**వాతావరణ ఆధారిత పంటల బీమా పథకము :**

రైతులకు మరింత ప్రయోజనము చేకూర్చుటకు మొదటి సారిగా మన రాష్ట్రంలో గుంటూరు జిల్లాలో ఎర్ర మిరప పంటను ఎంపిక చేసి ఖరీఫ్-2009లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకము ప్రయోగాత్మకంగా అమలు చేయబడింది. ఈ పథకంలో పంటల దిగుబడి ఆధారంగా కాకుండా వాతావరణ అంశాలైన వర్షపాతం ఉష్ణోగ్రత గాలిలో తేమ, గాలి ఉధృతి మొదలగు అంశాలలో వచ్చే వ్యత్యాసముల ఆధారంగా బీమా పరిహారం లెక్కించబడుతుంది. అత్యల్ప వర్షపాత ప్రాంతాలకు గాలి ఉధృతి వల్ల నష్టపోయే ఉద్యానవన పంటలైన మామిడి, బత్తాయి, అరటి మొదలైన పండ్ల తోటలకు ఈ పథకం మరింత ప్రయోజన కారిగా ఉంటుంది.

ఈ పథకం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మరింత

విస్తృత పరుస్తూ ఎంపిక చేసిన ఇతర జిల్లాలలో వేరుశనగ, ప్రత్తి, మామిడి, జీడి మామిడి మొదలగు పంటలను ఈ పథకం క్రింద ప్రతిపాదించి ప్రయోగాత్మకంగా అమలు చేయబడుచున్నది.

ఈ పథకం సన్నకారు, చిన్నకారు రైతులతో నిమిత్తం లేకుండా అందరు రైతులకు 25 నుండి 50 శాతం ప్రీమియంలో రాయితీ కల్పించబడింది.

టేబుల్-2 జతపరచగమైనది.

రైతులు ప్రీమియం చెల్లించుటకు గడువు **తేది 15-9-2014** కావున రాష్ట్రంలోని రైతులందరూ పైన ప్రతిపాదించిన పంటలకు బీమా చేసుకొని ఏదేని ప్రకృతి వైపరీత్యం వలన పంట నష్టపోయిన సందర్భంలో పంట బీమా పరిహారం పొంద వచ్చును.

## ఖరీఫ్ - 2014 లో ఎమ్.ఎన్.ఎ.ఐ.ఎస్ క్రింద ప్రతిపాదించిన జిల్లాలు మరియు పంటలు

| క్రమ సంఖ్య | జిల్లాలు | పంటలు |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం | వరి, సజ్జ, వేరుశనగ(యు.ఐ), చెరకు(పి), చెరకు(ఆర్) |
| 2. | విజయనగరం | వరి, సజ్జ, మొక్కజొన్న, వేరుశనగ(యు.ఐ), చెరకు(పి), చెరకు(ఆర్), పత్తి(యు.ఐ) |
| 3. | విశాఖపట్నం | వరి, సజ్జ, మొక్కజొన్న, కంది, వేరుశనగ(యు.ఐ), చెరకు(పి), చెరకు(ఆర్) |
| 4. | తూర్పు గోదావరి | వరి, సజ్జ, పత్తి(యు.ఐ), చెరకు(పి), చెరకు(ఆర్) |
| 5. | పశ్చిమ గోదావరి | వరి, చెరకు(పి), చెరకు(ఆర్) |
| 6. | కృష్ణా | వరి, మొక్కజొన్న, బొబ్బర్లు,కంది, వేరుశనగ(యు.ఐ), చెరకు(పి),చెరకు(ఆర్), పత్తి(యు.ఐ) |
| 7. | గుంటూరు | వరి, మినుము, ఆముదం, కంది, చెరకు(పి),చెరకు(ఆర్), పసుపు |
| 8. | ప్రకాశం | వరి, సజ్జ, మొక్కజొన్న, కంది, ఆముదం, మిరప(ఐ), మిరప(యు.ఐ) |
| 9. | నెల్లూరు | వరి, సజ్జ, వేరుశనగ(యు.ఐ), చెరకు(పి), చెరకు(ఆర్) |
| 10. | వై.ఎస్.ఆర్ (కడప) | వరి, జొన్న, సజ్జ, కంది, ప్రత్తి(ఐ), ప్రత్తి(యు.ఐ), పొద్దుతిరుగుడు, పసుపు, చెరకు(పి), చెరకు(ఆర్) |
| 11. | కర్నూలు | వరి, జొన్న, సజ్జ, కంది, ప్రత్తి(ఐ), ప్రత్తి(యు.ఐ), పొద్దుతిరుగుడు, ఆముదం, మిరప(ఐ), మిరప(యు.ఐ) చెరకు(పి), చెరకు(ఆర్) |
| 12. | అనంతపురం | వరి, జొన్న, సజ్జ,మొక్కజొన్న, కంది, పొద్దుతిరుగుడు, మిరప(ఐ), ప్రత్తి(యు.ఐ), |
| 13. | చిత్తూరు | వరి, జొన్న, సజ్జ, కంది, చెరకు(పి), చెరకు(ఆర్) |

| జిల్లాలు | పంటలు |
|---|---|
| కర్నూలు, అనంతపురం, కడప, చిత్తురు | వేరుశనగ |
| గుంటూరు, ప్రకాశం | ప్రత్తి |
| గుంటూరు | మిరప |
| పశ్చిమ గోదావరి | పామ్ ఆయిల్ గింజలు |
| కడప | నిమ్మ |
| చిత్తురు | టమాట |

# వర్షాధార వ్యవసాయ యాజమాన్యం

జి. వినయ్ కుమార్ (రిసెర్చ్ అసోసియేట్), జి. సాంబశివ (యంగ్‌ప్రొఫెషనల్)
కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థానం – హైదరాబాద్

వ్యవసాయ రంగంలో ప్రస్తుతం పెరుగుతున్న ఆహారపు అవసరాలను తీర్చడంలో వర్షాధార వ్యవసాయ సాగును విస్మరించలేము. వ్యవసాయ సాగుభూమిలో 67 శాతం వర్షాధారం పైనే ఆధారపడి ఉన్నది. సాలుసరి తిండిగింజలు 42 శాతం దీనినుండే లభ్యమవుతున్నాయి. వరి తరువాత ప్రధాన ఆహారపు పంటలైన జొన్నలు, సజ్జలు, అపరాలు, వేరుశనగ ఇతర నూనె గింజ పంటలు 90 శాతం వరకు వర్షాధారమే.

వ్యవసాయ సాగుభూమి సింహభాగం ఆక్రమించింది, ఆహారధాన్యాల ఉత్పత్తిలో కూడా ప్రధాన భూమిక పోషిస్తున్న వర్షాధార వ్యవసాయం భౌగోళికంగా, యాజమాన్యం పరంగా పలు సమస్యలను ఎదుర్కొంటోంది.

❖ వర్షాధార వ్యవసాయం పూర్తిగా వర్షపాతం పైన ఆధారపడి ఉండడం వలన అనిశ్చిత వర్షపాతం, సమయానుకూలంగా లభించిన వాననీటి లభ్యత ప్రధాన సమస్యగా పరిగణించవచ్చును.

❖ వర్షపాతం పొందిన తరువాత దానిని పంటల యాజమాన్యం అనుసరించి వినియోగం చేయడానికి సరియైన నీటి నిలువ చేసే పద్ధతులు అవలంబించకపోవడం.

❖ నేలలోని తేమను పట్టి ఉంచి సమర్ధవంతంగా వినియోగించే వెసులుబాటు లేకపోవడం.

❖ నేలసారం, తేమశాతం అనుసరించి తదనుగుణంగా వ్యవసాయ యాజమాన్యం చేపట్టలేకపోవడం.

❖ సమయానుకులంగా వ్యవసాయ పనులు చేపట్టక అందుబాటులో ఉన్న వాననీటిని వృథా చేయడం. పంటల అవసరాలకు మించి వాననీటిని ఎక్కువగా వాడుక చేయడం.

❖ నేలసారంను పెంచడానికి అవసరమైనంత ఎరువులు లేదా యాజమాన్యపు పనులు పునరుద్ధరణ చేయకపోవడం.

వర్షాధార భూములలో ఇప్పటికి అందుబాటులోకి రాని సాంకేతిక పరిజ్ఞానం.

❖ స్థిరమైన ఆయం, ఆర్థిక స్తోమత లేమి మొదలగు కారణాల వలన రైతాంగం పూర్తిస్థాయిలో వర్షాధార వ్యవసాయం పైన దృష్టి సారిచలేకపోవడం.

వర్షాధార వ్యవసాయం పేర్కొన్న సమస్యల వలన పంటల ఉత్పత్తి, ఉత్పాదకతలు గణనీయంగా తగ్గుతున్నాయి. అయితే ఈ సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు ఆచరిస్తే వర్షాధార వ్యవసాయం మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

### వర్షాధార వ్యవసాయం – యాజమాన్య పద్ధతులు :

❖ వాన నీటిని పరిరక్షించి దానిని మరింత సమర్ధవంతంగా వ్యవసాయ అవసరాలకు వినియోగించడం అనేది వర్షాధార వ్యవసాయంలో అతి ప్రధాన అంశం. దీని కొరకు పలు నీటి సంరక్షణ పద్ధతులు అవలంబించాలి.

ఎ) రైతులస్థాయిలోనే వ్యవసాయ భూములకు సరిపడ నీటిని పరిరక్షించడానికి వీలుగా వర్షాలు కురిసే సమయంలో ప్రవాహపు నీటికి అడ్డంగా వాలు కట్టలు, కాంటూర్ గట్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వాననీటిని నిలువ చేసే అవకాశం ఉంటుంది. అయితే ఈ పనులన్నింటిని క్షేత్రస్థాయిలోనే రైతులందరూ సామాజిక బాధ్యతగానే చేపడితే ఎక్కువ పరీవాహక ప్రాంతాంలో వాననీటి సంరక్షణకు వీలు కలుగుతుంది.

బి) వర్షాధార భూములు, మెట్టప్రాంతాలలో వాటర్‌షెడ్ పథకం అనునది సుపరిచితమే. విస్తృత స్థాయిలో వాననీటిని సంరక్షించి పంటకాలంలో ఎక్కువ సాగుభూమికి నీరు సదుపాయం కల్పించే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న పథకమే వాటర్‌షెడ్. దీని నిర్మాణంలో ప్రభుత్వం, ప్రజలు మరింత చొరవగా పాల్గొంటే వృథాపోతున్న వర్షపు నీటిని మరింత సమర్ధవంతంగా పరిరక్షించవచ్చును.

❖ వర్షాధార ప్రాంతాలకు అనువైన పంటలను, పంట రకాలను ఎంచుకొవడం కూడా ప్రధానమే. వర్షాభావ పరిస్థితులలో సైతం నీటి ఎద్దడిని తట్టుకొని స్థిరమైన దిగుబడులు ఇవ్వగలిగే జొన్నలు, సజ్జలు, రాగులు, ఆముదం, పొద్దుతిరుగుడు, కంది వంటి పంటలను సాగులోకి తీసుకురావాలి.

❖ నేలలో తేమశాతం తక్కువగా ఉండడం వలన సరియగు సమయంలో నేలలు దున్నడం, తక్కువ సమయంలో విత్తనాలు చల్లు కొని వ్యవసాయ పనిముట్లను వినియోగించాలి.

❖ వర్షాధార భూములలో నేలసారంను పెంచడానికి ప్రాథమికంగా నేలకు నత్రజని, భాస్వరం, పోటాషియం ఎరువులను అందించాలి. వీటితో పాటుగా సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులను అందించడానికి వీలుగా ప్రధాన పంటలతో పాటుగా లెగ్యూమ్ జాతి పంటల సాగును ప్రోత్సహించాలి. పచ్చిరొట్ట పైర్ల సాగుకూడా ఆచరణీయమే.

❖ పంటల యాజమాన్యంలో భాగంగా పంటల ఎంపిక, పంటల క్రమం, పంటల సాంద్రతను అవలంభించాలి. దీనితో పాటు పంటల యాజమాన్యం కూడా పరిగణలోకి తీసుకొవాలి.

ఎ) సరైన సమయంలో పంటలను విత్తుకొవడం వలన నేలలోని తేమను సమర్ధవంతంగా వినియోగించడమే కాకుండా చీడపీడల నుండి పంటలు రక్షించబడతాయి.

బి) నీటి ఎద్దడి ప్రధాన సమస్యగా గల ఈ భూములలో పంటల సాంద్రతను కూడా పాటించాలి

సి) స్వల్పకాలంలో ఫలసాయం అందించే పంటల సాగు పైన దృష్టిసారించాలి

డి) అంతర పంటలు, మిశ్రమ పంటలసాగులో ఆదనపు ఆదాయానికి అవకాశం ఉంటుంది

ఇ) సరియగు సమయంలో కలుపు నివారణ చర్యలు చేపట్టడం వలన ప్రధాన పంటలకు అవసరమైనంత నీరు లభ్యమవుతుంది.

❖ పంటలసాగు సమయంలో చీడపీడల సమస్య విస్మరించలేనిది. పంటల యాజమాన్యంలో చీడపీడల నుండి పంటల రక్షణకు పురుగుమందుల వాడకం వ్యవసాయ వ్యయాన్ని పెంచడమే కాకుండా పంటలకు మేలు చేసే మిత్ర పురుగులకు నష్టం కలిగిస్తాయి. ఈ నష్టాన్ని ఆరికట్టడానికి సమగ్ర చీడపీడల యాజమాన్యం చేపట్టాలి

❖ వర్షాధార వ్యవసాయంలో ప్రధాన పంటలు ఒక్కటే ఆధాయానికి బరొసా ఇవ్వలేవు. అందుచేత వీటికి అనుబంధంగా స్థిరమైన ఆదాయం ఇవ్వగలిగే ఉద్యానవన పంటలు, ఇంధన అవసరాలు తీర్చు కలపనిచ్చే చెట్లు, పశుగ్రాసాలు సాగు కూడా చేపట్టాలి.

❖ వ్యవసాయంతో పాటుగా పశువుల పెంపకం, పెరటికొళ్ళ పెంపకం వంటి సమగ్ర వ్యవసాయ విధానాలు ఆచరిస్తే మంచి ఫలితాలు పోందవచ్చును.

❖ వర్షాధార వ్యవసాయంలో నీటిని సమర్థవంతంగా వినియోగించడానికి అభివృద్ధి పరచబడిన తుంపర సేద్యం, బిందుసేద్యం వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగం ఆర్థిక స్థితిని అనుసరించి అవలంబించగలిగితే పంటల సాగు సులభమవుతుంది.

❖ వర్షాధార వ్యవసాయ యాజమాన్య పద్ధతులు ఆచరించదగిన విధంగా అందరికి అమోదయొగ్యమైనదే. రైతాంగం ఈ విషయాలపై దృష్టి సారించి అచరిస్తే అనుకున్న ఫలితాలను పొందవచ్చును.

# ఖరీఫ్ కందిలో సస్యరక్షణ

డి. నిరంజన్, వ్యవసాయాధికారి, రైతుశిక్షణా కేంద్రం, నంద్యాల, కర్నూలు జిల్లా.



మన రాష్ట్రం, కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగుచేసే పప్పుజాతి పంటల్లో ముఖ్యమైన కందిని దాదాపు గణనీయమైన హెక్టార్లలో పండిస్తున్నారు. ఇది దీర్ఘకాలిక పంట అయినందున, పూత, కాయ దశలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉండుటవలన సగటు ఉత్పాదకత తక్కువగా ఉంది. కందిని ఆశించే ముఖ్యమైన చీడపీడలు

### కాయతొలిచే పురుగు :

ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలుచేసి, గింజలు తింటూ, ఒక కాయ నుండి మరో కాయకు ఆశిస్తుంది.

### సమగ్ర నివారణ చర్యలు

- పైరు విత్తిన 90-100 రోజుల్లో చిగుళ్లను ఒక అడుగుమేర కత్తిరించాలి.
- ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలను అమర్చుకోవాలి.
- 5 శాతం వేప గింజల కషాయం, ఎకరాకు 200 లీటర్ల ఎన్.పి.వి. ద్రావణాన్ని పిచికారీచేయాలి.

### ఆకుచుట్టు పురుగు

ఈ పురుగు ఆకుల అంచులను, కండె పత్రహరితాన్ని గోకి నష్టపరుస్తుంది. నివారణకు లీటరు నీటికి ఎసిపేట్ 1 గ్రాము లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

**మారుకా మచ్చల పురుగు :** ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశించి ఎక్కువనష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగాచేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలకు రంధ్రాలు చేసి లోపలి గింజలను తినటంవల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది.

**నివారణ :** థయోడికార్బ్ 1గ్రాము లేదా నోవాల్యురాన్ 0.75 మిల్లీ మీటరు లేదా ఫ్లూబెండయామైడ్ 0.3 మిల్లీ లీటరుతో పాటుగా డైక్లోరోవాస్ 1 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి మందులు మార్చి వారం రోజులకొకసారి పిచికారీ చేయాలి.

## పద సాగు విజ్ఞానం-46

(సమాధానాలు)

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 గ్రా | | 2 ఒ | క | టి | న్న | ర | | 3 కా | | | | 4 ఐ |
| మ | | క | | | | | 5 | లి | | | | దు |
| వి | | టి | | | | | | క్సి | | | | వం |
| త్త | | | | 6 మె | ట్రి | బు | జి | న్ | | | | ద |
| న | | | | | | | | | 7 ధ | ని | యా | లు |
| 8 ప | రా | ద్ | | | | | | | | | | |
| థ | | | 9 కా | ట | న్ | పి | క | ర్ | | 10 ఎ | | |
| కం | | | ర్బం | | | | | | | న | | |
| | | | డ | | | | 11 త | ప్పు | | భై | | |
| | 12 ఇ | మ | జి | తా | ఫి | ర్ | | 13 ఒ | | ఐ | | 14 స్ట్రె |
| | | | మ్ | | | | | | 15 ఐ | దు | | బే |
| | | | | | | | | | | | | ల |
| | 15 లే | జ | ర్ | గై | డె | డ్ | లాం | 17 డ్ | లె | వ | ల | ర్ |

# నేలను కప్పి ఉంచే పంటలు - ప్రయోజనాలు

జి.వినయ్ కుమార్, వై. సైదులు, డా.। టి.వి. శ్రీధర్,డి. సుధారాణి, డా.।. వై. వర ప్రసాద్
డా.।. కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు, కృష్ణా జిల్లా

వ్యవసాయ భూమిలో ప్రధాన పంటలు సాగు చేయలేని పరిస్థితులు పప్పుజాతి పంటలైన బొబ్బర్లు, సోయాబీన్ లతో పాటుగా జనుము, దురదగొండి, సజ్జలు, రాగి, కొర్రలు వంటి పంటలను సాగు చేస్తే అవి నేలను పట్టి ఉంచి నేలల సహజ సంరక్షణకు తోడ్పడతాయి. నేలల సంరక్షణతో పాటుగా పలు ప్రయోజనాలు కలిగించే ఈ పంటలను " నేలను కప్పి ఉంచే పంటలు ( కవర్‌క్రాప్స్)" అంటారు.

నేలను కప్పి ఉంచే పంటలుగా పప్పుజాతి ( లెగ్యూమ్స్) పంటలు , నీటి ఎద్దడిని తట్టుకునే పంటలు, కొన్ని రకాల గడ్డి జాతులను సాగుచేయవచ్చు. ఈ పంటలను ఏక పంటలుగా లేదా మిశ్రమ పంటలుగా సాగుచేయడం ద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చును.

### భూసార పరిరక్షణ :

నేలపైన విస్తారంగా పరచుకొని, గుబురుగా పెరిగే బొబ్బర్లు, దురదగొండి పంటలను సాగుచేయడం ద్వారా అవి నేలను అల్లుకోని గట్టిగా పట్టి ఉంచుతాయి. దీని వలన వర్షాకాలంలో విస్తారంగా కురిసే వర్షాలకు నేల కొతకు గురి కాకుండా సంరక్షిస్తాయి. వేసవి కాలంలో వీచే బలమైన గాలుల వలన నేలపై ఉండే సారవంతమైన పొర కొట్టుకొని పోకుండా అడ్డుకుంటాయి.

నేలసారం సంరక్షించడంతో పాటుగా నేలలోని తేమను కూడా ఈ పంటలు పట్టి ఉంచుతాయి. దీని వలన తరువాత సాగుచేసే ప్రధాన పంటలకు తగినంత తేమ అందుబాటులో ఉంటుంది.






### కలుపు మొక్కల నియంత్రణ :

నేలను కప్పి ఉంచే పంటలో విస్తారంగా పెరగడం వలన వ్యవసాయ భూమి లో సహజంగా పెరిగే కలుపు మొక్కలకు సూర్యరశ్మి, తేమ లభించకుండా ఈ పంటలు అడ్డుకొని వాటి పెరుగుదలను నియంత్రిస్తాయి. కలుపు మొక్కలపై ఈ పంటలు చూపే అలోపతి ప్రభావం చేత కలుపు అదుపులో ఉంచబడుతుంది.

### నత్రజని స్థాపన :

నేలను కప్పి ఉంచే పంటలుగా లెగ్యూమ్ పంటలను సాగుచేయడం వలన ఈ మొక్కలు వేరుబుడిపెలు ఉండే నత్రజని స్థాపక బాక్టీరియా వాతావరణంలోని నత్రజనిని సేకరించి నేలకు అందిస్తాయి. ఫలితంగా నేలలో నత్రజని నిల్వలు పెరిగి అవి తరువాత కాలంలో సాగుచేసే ప్రధాన పంటలకు అందచేయబడతాయి. దీని వలన నేలలో నత్రజని సహజంగా స్థిరీకరించబడి రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చు.

### చీడపీడల నియంత్రణ :

ప్రధాన పంటలను ఆశించే పలు హానికర కీటకాలను నేలను కప్పి ఉంచే పంటలు ఆకర్షించడం ద్వారా కీటకాల వలన కలిగే పంట నష్టం ను తగ్గిస్తాయి. ఈ పంటలు కొన్ని రకాల ఉపయోగకర కీటకాలకు ఆవాసంగా ఉండి హానికర కీటకాల ఉధృతిని అదుపులో ఉంచడంలో సహకరిస్తాయి.

ప్రధాన పంటలకు వ్యాధులను కలిగించే కొన్ని రకాల వ్యాధి జనకాలు నేలలో ఉంటాయి. నేలను కప్పి ఉంచే పంటలు ఈ భూజనిత వ్యాధిజనకాలకు పైన చూపే అలోపతి ప్రభావం వలన వ్యాధితీవ్రత ప్రధాన పంటల పై తగ్గుతుంది.

**సేంద్రీయ ఎరువుగా :**

వ్యవసాయ భూములను దమ్ము చేసేటప్పుడు ఈ నేలను కప్పి ఉంచే పంటలకు కూడా దమ్ము చేయడం వలన ఈ పంటలు నేలలో కలిసి వాటిలోని పోషకాలు నేలకు చేరుతాయి. ఫలితంగా నేలకు సహజసిద్ధంగా సేంద్రీయపదార్థం అందించబడుతుంది. ఈ సేంద్రీయ ఎరువులు వినియోగం వలన రసాయనిక ఎరువుల వాడకం తగ్గించబడి పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తాయి.

**పశుగ్రాసాలుగా :**

నేలను కప్పి ఉంచే పంటలుగా గడ్డి జాతి పంటలను సాగు చేయడం ద్వారా నేలను సంరక్షణతో పాటు పశువులకు పశుగ్రాసాలుకూడా అందించవచ్చు.నేలపై పరచుకొని గుబురుగా పెరిగే లక్షణాలు గల గినియా గడ్డి, నేపియర్ గడ్డి వంటి రకాలను సాగుచేస్తే ఇవి నిర్దిష్ట విరామ సమయాలలో పశుసంపదకు సరిపడినంత పశుగ్రాసాన్ని అందిస్తాయి.

**అదనపు ఆదాయం :**

ప్రధాన పంటలకు విరామ సమయంలో నేలను కప్పి ఉంచే పంటల సాగు వలన అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా ఉన్నాయి

❖ పప్పుజాతి పంటలను సాగుచేయడం వలన నత్రజని స్థాపన, బొబ్బర్లు, సోయాబిన్ వంటి పంటల నుండి ఆదాయం లభిస్తుంది.

❖ కలుపు మందుల వినియోగం తగ్గించడమే కాకుండా కలుపు తీత ఖర్చును కూడా ఈ పంటలు కొంత మేరకు మిగుల్చుతాయి.

❖ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం అదుపులో ఉంచి వ్యవసాయ వ్యయంను నియంత్రించడంలో సహకరిస్తాయి.

❖ సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడి పర్యావరణహితంగా తోడ్పడతాయి.

❖ పశుసంపదకు అవసరమగు పశుగ్రాసాలను అందించడం ద్వారా పశుగ్రాసాల కొనుగోలు ఖర్చును తగ్గిస్తాయి.

నేలను కప్పి ఉంచే పంటల వలన కలిగే పలు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రైతాంగం ఈ పంటల సాగును అవలంబిస్తే నేలల సంరక్షణతో పాటుగా మరిన్ని లాభాలను పొందవచ్చును.

## అక్షర సేద్యం – 43 (సమాధానాలు)

ఎం.వి. శ్రీకాంత్, వ్యవసాయాధికారి, రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు

**మొదటి అంచె : (10 ప్రశ్నలు)**

1. స రై న మొక్కల సాంద్రత పాటించండి
2. నే ల ఉ సిరి ఒక క లు పుమొక్క
3. పొ లా ల కుచె రు వు మట్టి తోలండి
4. ఏ ప్రిల్
5. వర్మీ వా ష్
6. ఒ క టి న్న ర
7. ఒ ప్పు
8. అమృ త కా డ
9. అగ్గి తె గు లు
10. శత్రుపురు గు

**రెండవ అంచె :** (రంగు గడులలోని 17 అక్షరాలు)

రై, నే, ఉ, లు, పొ, ల, రు, ఏ, వా, క, న్న, ప్పు, త, డ, తె, లు, గు

1. రైతన్న
2. ఏరువాక
3. ఉప్పునేలలు
4. పొడతెగులు

**మూడవ అంచె :**

1. నేలలు
2. తప్పు.

# పత్తిలో కాండనికి మందుపూత

ఎ. ఆనంద్ కుమార్, శాస్త్రవేత్త ( సస్యరక్షణ)
డా.।.పి.ఎల్.ఆర్.జె. ప్రవీణ, కో-ఆర్డినేటర్, ఏరువాక కేంద్రం, కాకినాడ, తూ।.గో।. జిల్లా



ప్రస్తుతం పత్తిలో బి.టి రకాలు సాగు చేస్తున్నందున, కాయ తొలిచే పురుగుల బెడద తగ్గినప్పటికి, రసం పీల్చే పురుగుల తీవ్రత ఎక్కువై పత్తి దిగుబడికి ఎక్కువ నష్టం కలుగజేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు గాను రైతు సోదరులు సస్యరక్షణ పై ఎక్కువగా ఖర్చులు తగ్గించుకొనేందుకు వీలుగా కాండం పై మందు పూసే పరికరాన్ని ఏరువాక కేంద్రం, కాకినాడ లో పనిచేస్తున్న సస్యరక్షణ శాస్త్రవేత్త ఎ. ఆనంద్ కుమార్ స్థానిక వనరులను వినియోగించుకుని తయారు చేసినారు. ఖరీఫ్, 2013 సీజన్‌లో తాను రూపొందించిన పరికరాన్ని మరింత అభివృద్ధి పరచి ప్రస్తుత సీజన్‌లో (ఖరీఫ్,2014) పత్తి రైతులు వినియోగించుకునేందుకు సిద్ధం చేశారు. ఈ పరికరాన్ని **ANGRAU - Stem Applicator** (అంగ్రూ-స్టెమ్ అప్లికేటర్)గా వ్యవహరిస్తున్నారు.

ఈ పరికరం తయారీకి సుమారూ 125-150/- ఖర్చు అవుతుందని తెలియజేస్తున్నారు.

### ఉపయోగించే విధానం :

ఈ పరికరాన్ని ఉపయోగించి బి.టి పత్తిలో తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, పేనుబంక మరియు పిండినల్లి(నాంజేడు) పురుగులను ఎటువంటి పురుగు మందుల పిచికారీ లేకుండా 70-75 రోజుల వరకు అదుపు చేయవచ్చును.

కాండం మీద పూత పూసే పద్ధతిని 3 పర్యాయాలు చేపట్టాలి. పత్తి విత్తిన 30 మరియు 45 రోజులకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో (1పాళ్ళు మందు, 4 పాళ్ళు నీరు) కలిపిన ద్రావణం వాడాలి. పత్తి విత్తిన 60 రోజులకు ఇమిడాక్లోప్రిడ్, నీరు 1:20 నిష్పత్తిలో(1 పాళ్ళ మందు, 20 పాళ్ళ నీరు) కలిపిన ద్రావణం వినియోగించాలి.




### లాభాలు :

1. ఈ పరికరం వినియోగం తక్కువ శ్రమతో కూడుకుని ఉండుట వలన చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగం.

2. రసం పీల్చే పురుగుల నియంత్రణకై వినియోగించే పురుగు మందుల పరిమాణాన్ని, ఎక్కువసార్లు పురుగు మందుల పిచికారీ తగ్గించవచ్చును. తద్వారా సస్యరక్షణకై చేసే ఖర్చును తగ్గించవచ్చును.

3. పంట తొలి దశలో (విత్తిన 70-75 రోజుల వరకు) పురుగు మందుల వాడకం తక్కువగా ఉండటం వలన మిత్ర పురుగుల సంతతి పెరిగి తర్వాత దశలో ఆశించే పురుగులను అదుపు చేయడంలో సహకరిస్తాయి.

ప్రస్తుత సీజన్‌లో ఈ పరికరం పై క్షేత్రస్థాయిలో ఎక్కువ మంది రైతులకు అవగాహన కల్పించేందుకు గాను విద్యార్థులు, 'ఆత్మ' క్షేత్రస్థాయి సిబ్బంది సహకారాలతో తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కువ పద్ధతి ప్రదర్శనలు (**Method demonstration** ) ఏర్పాటు చేస్తామని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డా.।. ప్రవీణ తెలియజేస్తున్నారు.

# బెండ సాగులో పాటించాల్సిన మెళకువలు

జి. విద్య, పరిశోధన విద్యార్థిని, ఎం. పద్మ ప్రధాన శాస్త్రవేత్త,
కూరగాయల పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన రాష్ట్రంలో బెండ అన్ని జిల్లాల్లో పండిస్తారు. సుమారుగా 72,077 హెక్టార్ల విస్తీర్ణంలో 10,81,155 మిలియన్ టన్నుల ఉత్పత్తితో సాగు చేయబడుతున్నది.

**వాతావరణం :** వేడి వాతావరణం అనుకూలం. అతి చల్లని వాతావరణం పంట పెరుగుదలకు ప్రతికూలం. అందువలన పంట వర్షాకాలం, వేసవికాలంలో పండించటానికి అనుకూలమైనది.

**నేలలు :** సారవంతమైన నీరు ఇంకెడి తేలికపాటి నేలలు, మురుగు నీరు పోయే సౌకర్యంగల తేలికపాటి నల్లరేగడి నేలలు అనుకూలం.

**రకాలు :** పర్భని క్రాంతి, అర్క అనామిక, అర్క అభయ, సంకరజాతి రకాలు – వర్ష, విజయ్, విశాల్, నాథ్‌శోభ, మహికో హైబ్రిడ్ నెం. 6,7,8,10, ప్రియ, సుప్రియ, ఐశ్వర్య, మిస్టిక్, యుస్ 7109, తులసి రకాలను, ఎగుమతికి అనువైన పంజాబ్ పద్మిని, వర్ష, విశాల్, నాథ్‌శోభ రకాలను కూడా సాగు చేయవచ్చు.

**విత్తే సమయం :** వర్షాకాలపు పంటను జూన్‌నుండి జులై వరకు, వేసవి పంటను జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి చివరి వరకు విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు :** ఎకరాకు వర్షాకాలపు పంటకు 4–6 కిలోలు, వేసవి పంటకు 7–8 కిలోలు, సంకరజాతి రకాలైతే 2–2.5 కిలోల విత్తనం కావాలి.

**విత్తనశుద్ధి :** కిలో విత్తనానికి 5 గ్రా॥ ఇమిడాక్లోప్రిడ్‌తో తర్వాత 4 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**నేలతయారీ విత్తటం :** నేలను 4–5 సార్లు బాగా దున్నాలి. వర్షాకాలపు పంటను 60 సెంమీ. ఎడంతో బోదెల మీద 30 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. వేసవికాలపు పంటను, నేలను మళ్లుగా చేసి వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 15–20 సెం.మీ. దూరం ఉండేట్లు విత్తుకోవాలి. విత్తిన వెంటనే నీరు పెట్టి తర్వాత 4–5 రోజులు రెండవ తడి నీరు ఇవ్వాలి. పాదుకు ఒక మొక్క ఉంచి మిగిలినవి తీసేయాలి.

**ఎరువులు :** చివరి దుక్కిలో 6–8 టన్నుల పశువుల ఎరువును వేసి బాగా కలియదున్నాలి. 24 కిలోల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరిదుక్కిలో వేయాలి. 48 కిలోలనిచ్చే నత్రజని ఎరువును 3 సమభాగాలుగా చేసి 1/3వ వంతు ఆఖరి దుక్కిలో, మిగిలిన 2/3 వంతును 2 భాగాలుగా విత్తిన 30వ, 45వ రోజున వేయాలి. సంకరజాతిరకాలకు ఎరువుల మోతాదు సుమారు 50 శాతం పెంచాలి.

**కలుపు నివారణ, అంతరకృషి :** పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.2 లీ చొప్పున విత్తిన వెంటనేగాని మరుసటిరోజునగాని పిచికారీ చేయాలి. విత్తిన 25, 30 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి. వర్షాకాలంలో మట్టిని ఎగదోసి బోదెలు సరిచేయాలి.

పంటపూత దశలో లీటరు నీటికి 10 గ్రా॥ యూరియా కలిపి పిచికారీ చేయడం ద్వారా 20–25% నత్రజని ఆదాతోబాటు అధిక దిగుబడిని పొందవచ్చు. అలాగే లీటరు నీటికి 5 గ్రా॥ సూక్ష్మపోషక పదార్థాల మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయడం ద్వారా కూడా అధికదిగుబడిని పొందవచ్చు.

**నీటియాజమాన్యం :** వర్షాకాలపు పంటకు సకాలంలో వర్షాలు రాకపోతే 7–8రోజులకు ఒకసారి నీరుపెట్టాలి. వేసవి పంటకు ప్రతి 4–5 రోజులకొకసారి నీరు పెట్టాలి.

**సస్యరక్షణ – పురుగులు – మొవ్వ, కాయతొలిచే పురుగు :** ఈ పురుగు నాటిన 30 రోజులనుండి కోతదశ వరకు ఆశిస్తుంది. మొక్క పురుగులు – మొవ్వ, కాయతొలిచే పురుగు : ఈ పురుగు నాటిన 30 రోజులనుండి కోతదశ వరకు ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, పూత, కోత దశలో కాయలను తొలిచి నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతంనుండి ఒక అంగుళం కిందకు తుంచాలి. లీటరు నీటికి కార్బరిల్ 3 గ్రా॥ లేదా క్వినాల్‌ఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి. పంట కాపుకు రానిదశలో థయోడికార్బ్ 1 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**దీపపుపురుగు :** ఆకుపచ్చ రంగులో ఉండే చిన్న, పెద్ద పురుగులు ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చి పంటకు నష్టాన్ని కలుజేస్తాయి. ఆకులు పైకి ముడుచుకొని పోయి, పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి మిథైల్ డెమెటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఫిప్రొనిల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

**ఎర్రనల్లి :** పంట చివరిదశలో చిన్న, సన్నని ఎర్రపురుగులు ఆకుల అడుగుభాగాన చేరి, ఎక్కువ సంఖ్యలో రసాన్ని పీల్చివేయటంవల్ల ఆకులు తెల్లగా పాలిపోయి, పండుబారుతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రా లేదా డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెల్లదోమ :** పంటలో పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చివేయడంవల్ల ఆకులు పసుపురంగులోకి మారతాయి. ఇవి శంఖురోగాన్ని వ్యాప్తిచెందిస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. తెల్లదోమ దాడి ఎక్కువైనపుడు ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పొలంలో అక్కడక్కడ పసుపురంగు డబ్బాలకు గ్రీజు కానీ, ఆముదంగాని పూసి తెల్లదోమను ఆకర్షింపచేసి నాశనం చేయాలి.

**తెగుళ్ళు:**

**బూడిద తెగులు :** ఆకులపైన, అడుగుభాగాన బూడిద వంటి పొడితో కప్పబడి ఉంటాయి. తేమ తక్కువగా ఉండే పొడి వాతావరణంలో తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకులు పచ్చబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకపు పొడి లేదా 1 మి.లీ. డైనోకాప్ లేదా 2 మి.లీ. హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలి.

**శంఖు/పల్లాకు తెగులు (వైవిఎంవి) :** తెగులు సోకిన ఆకుల ఈనెలు పసుపురంగుకి మారి, కాయలు గిడసబారి, తెల్లగా మారిపోతాయి. దీని నివారణకు తెగులును తట్టుకొనే అర్క అనామిక, అర్క అభయ్ రకాలను విత్తుకోవాలి. లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయటం ద్వారా తెగులును వ్యాప్తిచేసే తెల్లదోమను అరికట్టవచ్చు. వర్షాకాల పంటను జులై 15కు ముందుగా విత్తటంద్వారా ఈ తెగులును కొంతవరకు నివారించవచ్చు.

**ఎండు తెగులు :** మొలకదశలో మొక్కలు మొత్తం కొద్ది సమయంలోనే చనిపోతాయి. దీని నివారణకు విత్తనశుద్ధి చేసుకోవాలి. అలాగే మొక్కల మొదళ్ళ వద్ద కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా। లీటరు నీటికి కలిపిన ద్రావణాన్నిపోయాలి. వేపపిండిని ఎకరానికి 100 కిలోల చొప్పున దుక్కిలో వేయాలి. పంట మార్పిడి పాటించాలి.

బెండను అదేపనిగా ఒకేచోట పండిస్తూ వెళితే పురుగులు, రోగాలు పల్లాకు తెగులు అధికంగా వ్యాప్తిచెంది దిగుబడులు తగ్గిపోతాయి. అందుకని పంటమార్పిడి పద్ధతిని పాటించాలి. కిందివిధంగా అనుసరించాలి.

**పంటల వరుసక్రమం – బెండ, ఆలుగడ్డ, టమోటా :**

బెండ, పాలకూర, పుచ్చకాయ, బెండ, ముల్లంగి, కాలీఫ్లవర్, కీరదోస, బెండ, టమోటా, తోటకూర, బెండ, ఆలుగడ్డ, సజ్జక్రమంలో పంటమార్పిడిని పాటించాలి.

**కోతకోయటం :** విత్తిన 45–50 రోజులకు మొదటికోత వస్తుంది. తప్పనిసరిగా ప్రతి 2–3 రోజులకొకసారి కోత కోయాలి.

**దిగుబడి :** ఎకరాకు వర్షాకాలపు పంటకు 3–4 టన్నులు, వేసవి పంటకు 2–2.5 రోజుల కొకసారి దిగుబడి వస్తుంది.

**బెండలో సమగ్ర సస్యరక్షణ :** కాయతొలుచు పురుగుల ఉనికిని గమనించేందుకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 4 చొప్పున అమర్చుకోవాలి.

ఎకరాకు 20,000 చొప్పున ట్రైకోగ్రామా బదనికలను పూతదశలో వారానికి ఒకసారి చొప్పున 4 సార్లు విడుదల చేయాలి. విడుదల సమయంలో పురుగుమందులు వాకూడదు. పైవిధంగా మెళకువలను పాటించి, బెండను వేసవిలో సాగు చేయవచ్చును.

# శీఘ్రమేవ 'మార్పు' ప్రాప్తిరస్తు - 46

## వాన నీటిని దాచుకుందాం...

- ఎం.వి.శ్రీకాంత్
వ్యవసాయాధికారి,
రైతు శిక్షణా కేంద్రం
చిత్తూరు



కాంతన్న ఓ వర్షాధార చిన్నకారు రైతు...అతన్ని కలవడానికి పక్క మండలం నుంచి స్నేహితుడు రంగన్న వచ్చాడు...దిగులుగా ఉన్న కాంతన్నను చూసి ఇలా అడుగుతున్నాడు...

రంగన్న : ఏం కాంతన్న...ఎందుకలా ఉన్నావు? ఆ కళ్ళలో నీళ్ళేంటి?

కాంతన్న : నా కనీళ్ళు చూసైనా ఆ ఆకాశం ఏడుస్తుందేమోనని ఆశ...(వర్షం కురిపిస్తుందని...)

రంగన్న : నీ కళ్ళల్లో "దిగులు మబ్బులు" ఉన్నాయి కానీ, ఆకాశంలో ఒక్క కారుమబ్బైనా ఉందా?

కాంతన్న : ఇక కనీళ్ళతోనే సేద్యం...

రంగన్న : 'దీపముండగానే చక్కబెట్టుకోవాలి' అన్న సామెత వినలేదా?

కాంతన్న : వర్షాధార సేద్యపు బతుకులు గాలిలో దీపంలా మారుతున్నాయి...

రంగన్న : అంత నిరాశవద్దు కాంతన్న... నేనూ నీలాగే వర్షాధార రైతును... బతకడం లేదా?

కాంతన్న : అంటే... మీకు వర్షాలు బాగా పడుతున్నాయా?

రంగన్న : పడేటప్పుడు పడతాయి... కానీ ముందుజాగ్రత్తగా తొలకరిలో పడ్డ వర్షపునీటిని భద్రంగా దాచుకుంటున్నాను ... నీలా కనీళ్ళను దాచుకోవడం లేదు...

కాంతన్న : కాస్త అర్థమయ్యేలా చెప్పు...

రంగన్న : వ్యవసాయంలో ముందుచూపు అవసరమంటున్నా...

కాంతన్న : ఊళ్లో చెరువునిండి ఎన్నో ఏళ్ళు అవుతోంది... నిండని చెరువుతో కరువు నిండుగా పండుతోంది... మా కన్నీళ్ళన్నీ ఆవిరై మబ్బుల్లా మారి వర్షంలా కురిస్తే ఎంత బాగుండునో కదా. సేద్యం శాపంలా మారుతోంది...

రంగన్న : మా ఊళ్ళోకూడా చెరువులు సరిగా నిండటం లేదు... కానీ మా చేలల్లో చిన్న నీటికుంటలు కళకళలాడుతుంటాయి...

కాంతన్న : నీటి కుంటలా

రంగన్న : ముందు ఆ కన్నీరు తుడుచుకో... ఇది విను... మన దేశంలో ఎక్కువ మంది వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు...60 శాతం వరకు సాగు వానల కిందే నడుస్తోంది...ఈ వాననీరే తాగునీటికి,సాగునీటికి ఆధారమవుతోంది. ..

కాంతన్న : నిజమే కదా...

రంగన్న : పడే వర్షంలో 40 శాతం వరకూ వర్షపు నీరు పొలం బయటికి వృధాగా పోతుంది... వెళ్తూ వెళ్తూ నేలపై పొరలోని మట్టిని 'తోడుగా' తీసుకెళ్ళిపోతుంది... ఫలితంగా నేలకోత జరుగుతుంది. 40 శాతం ఇలా పోతే... కాదు కాదు మనమే పోనిస్తే ఇంకెంత వర్షపు నీరుంది?

కాంతన్న : అరవై శాతం...

రంగన్న : ఆ అరవై లో 41 శాతం నీరు పంటభూముల నుండీ, వృక్షాల నుండీ ఆవిరిరూపంలో వెళ్ళిపోతుంది...10 శాతం నీరు మాత్రమే మన పంటపొలాల్లో పట్టి ఉంచబడి ఉంటుంది ...ఆ మధ్య ఒక శాస్త్రవేత్త చెబితే విన్నాను.

కాంతన్న : అంటే దాదాపు 90 శాతం వర్షపునీరు మనకు అందని ద్రాక్షేనా?

రంగన్న : అవును కాంతన్న... పడే వర్షంలో ఇంతవరకు 10-15% మాత్రమే మనం

ఉపయోగించుకుంటున్నాము. దీనిని మరో 10% పెంచగలిగితే సాగుతో పాటూ మన తాగునీటి సమస్యలు కూడా తీరుతాయని ఆ శాస్త్రవేత్త చెప్పారు...

కాంతన్న : ఓహో... అలాగా...

రంగన్న : ఆకలి లేనప్పుడు విస్తరినిండా వడ్డించుకొని కూర్చుంటే ఏంలాభం? అలాగే ఆకలేసినప్పుడు ఖాళీ విస్తరి ముందుంటే ఏం ఫలితం? ఇదీ మన వర్షాధార రైతుల పరిస్థితి...

కాంతన్న : అంటే ?

రంగన్న : మనకు వర్షాధారంగా రెండు సమస్యలున్నాయి... పంట మొదట్లో తక్కువ రోజుల్లోనే అధిక వర్షాలు కురవడమే, పంట విత్తిన తరువాత కీలక దశలో, చివరి దశలో 10-35 రోజుల బెట్ట పరిస్థితి ఉండటం... నిండు విస్తరి, ఖాళీ విస్తరి లాంటి పరిస్థితి...

కాంతన్న : ఇది మా ఊళ్ళోనూ ఉన్న పరిస్థితి...

రంగన్న : పంట తొలిదశలో అధిక వర్షాలు పడినా ఎక్కువ నీరు పొలంబయటికి వృథాగా పోతుంది... వృథాగా పోయే నీటిని మనం నిల్వచేసుకొంటే పంటకాలంలో బెట్ట పరిస్థితి వచ్చినప్పుడు ఆ నీటిని వాడుకొని గట్టెక్కవచ్చు...మంచి దిగుబడిని గట్టుదాటించవచ్చు.

కాంతన్న : ఎలా దాచుకోవాలి?

రంగన్న : నీటికుంటలను ఏర్పాటుచేసుకోవాలి... ఆంగ్లంలో 'ఫారంపాండ్' అంటారు...ఈ గుంతల్లో నీరు చేరేలా చేస్తే, నీ కళ్ళ గుంతల్లో కన్నీరు తగ్గించవచ్చు. నీటి గుంటల కోసం మన చేనులో కొంతభాగాన్ని కేటాయించాలి. 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతుతో గుంట తవ్వాలి... అంటే 250 ఘనపు మీటర్ల గుంట అన్నమాట...

కాంతన్న : ఏమాత్రం పొలానికి సరిపోతుంది ఈ గుంట...

రంగన్న : ఈ పరిమాణపు నీటికుంట దాదాపు రెండున్నర ఎకరాల పొలానికి కీలక దశలలో నీటిని అందించటానికి ఉపయోగపడతాయి..

కాంతన్న : ఆలోచన బాగానే ఉంది...

రంగన్న : పొలంలో ఏటవాలుకు దిగువభాగంలో నీటి కుంట ఏర్పాటు చేసువాలి.

కాంతన్న : అంటే అక్కడ ఆ భాగంలో మనం పంటకోల్పోయినట్టు కదా.

రంగన్న : అవును... పెద్దరైతులకు నీటికుంటల వల్ల కలిగే లాభం ముందు ఇది చిన్న విషయం...

కాంతన్న : మరి నాలాంటి వారి పరిస్థితి ఏంటి రంగన్న? ఉన్నదే రెండెకరాలు...

రంగన్న : నిజమే...నీలాంటి ఆలోచనే చాలామందికి ఉంటుంది. భూమిని కేటాయించడం ఇష్టం ఉండదు...అలాంటప్పుడు 'కమ్యూనిటి బేస్‌డ్ ఫారంపాడ్' ఏర్పాటు చేసుకొని బాగుపడాలి...

కాంతన్న : అదేంటి ?

రంగన్న : మా ఊళ్లో నివశించే 5-10 మంది రైతులు సామూహికంగా ఏటవాలుకు దిగువభాగంలో పెద్ద నీటికుంటను ఏర్పాటు చేసుకున్నట్లయితే వర్షాలకు కుంటనిండుతుంది... ఆ నీటిని వారిలో ఎవరికి అవసరమైతే వారు ఒప్పందం/అవగాహన మీద పంటకాలంలో పంటలకు, పశువులకు ఉపయోగించుకోటానికి వీలుంటుంది... సమిష్టిగా వాడుకోవడం వల్ల అందరూ లబ్ధిపొందుతారు.

కాంతన్న : నీటికుంట ఏర్పాటుకు ఖర్చు మాటేమిటి ?

రంగన్న : ఈ ఖర్చు అనేది కుంట పరిమాణం, కుంటకు వాడే లైనింగ్ మెటీరియల్ రకాన్ని బట్టి మారుతుంది... సాధారణంగా 10×10×2.5 మీటర్ల పరిమాణంలో మట్టి, సిమెంట్ మిశ్రమంతో లైనింగ్ చేస్తే

దాదాపు 20,000 దాకా ఖర్చవుతుంది. మట్టి 6 పాలు, సిమెంట్ ఒక పాళ్ళు కలపాలి.

కాంతన్న : ఈ లైనింగ్ దేనికోసం రంగన్నా ?

రంగన్న : వర్షపునీరు కుంటలో చేరాక దిగువభాగం నుంచి, పక్కనుంచి వృథాగా పోకుండా కాపాడటం కోసం... కొంత మంది కడపబండలు వాడుతున్నారు...అయితే ఖర్చు ఎక్కువ మరో విషయం కాంతన్న. ఆర్థికంగా ఉండేవారు 'ప్లాస్టిక్ లైనింగ్ షీట్' వాడుతున్నారు... ఇది ఇంకా ఖర్చుతో కూడినది... కానీ మన్నిక ఎక్కువ... ఒక చదరపు మీటరు విస్తీర్ణానికి సుమారు 900 రూపాయలు ఖర్చు అవుతుంది.

కాంతన్న : అమ్మో ఖర్చు ఎక్కువ...

రంగన్న : కాస్త ఖర్చును భరిస్తే ఎక్కువకాలం మన్నిక పొందవచ్చు. కుంటలో నీరు పక్కలకు వృథాగా పోకుండా (సీపేజ్ లాస్) చూడదచ్చు. పైగా ఎక్కువకాలం నీరు నిల్వ ఉంటుంది...

కాంతన్న : ఎక్కువ కాలమంటే... ఎంతకాలం ?

రంగన్న : వర్షాకాలంలో పడ్డనీరు వేసవి కాలం వరకూ నిల్వ ఉంటుంది... అంటే సంవత్సరం కాలం పాటూ వాడుకొనే వీలుంటుంది.

కాంతన్న : అంతకాలం ఉంటే నీరు ఆవిరైపోదా ?

రంగన్న : తప్పకుండా అవుతుంది

కాంతన్న : మరి ఆవిరి కాకుండా ఆపలేమా ?

రంగన్న : ఆవిరవ్వడం ఆపడం అంత సులభంకాదు... కష్టంతో కూడినపని... మనం చేయగలిగేది సీపేజ్ లాస్ జరగకుండా ఆపడం మాత్రమే ... అంటే కుంటలోని నీరు పక్కలకు లీక్ అవకుండా ఆపడం...కానీ ఆవిరి తగ్గించటానికి ఓ పద్ధతుందని శాస్త్రవేత్త చెప్పారు...

కాంతన్న : ఏంటది (ఆసక్తిగా)...?

రంగన్న : 'కెవోలిన్ 5% పోడిని నీటిమీద పిచికారీ చేయాలి...దీనిలో కొద్ది వరకు నీరు ఆవిరి కాకుండా కాపాడవచ్చట...

కాంతన్న : ఆ పొడిని చల్లి,ఆ నీటిని పంటలకు ఉపయోగిస్తే పంటలకు నష్టం ఉండదా ?

రంగన్న : ఊహూ... ఎలాంటి నష్టం ఉండదట... పైగా అ నీటిని పశువులకు తాగించినా ఎలాంటి ప్రమాదం ఉండదట...

కాంతన్న : నాకో ఆలోచన రంగన్నా...కుంటచుట్టూ చెట్లు పెంచితే లాభమేకదా.

రంగన్న : మంచి ఆలోచన...చల్లని వాతావరణం ఉంటుంది...ఎండనేరుగా పడకుండా ఉంటుంది...కాస్త ఆవిరి అవడాన్ని తగ్గించే వీలుంది. ఓ సారి మా ఊరికి వచ్చి మా నీటికుంటలను గమనించు...దాని లాభం తప్పక అర్థమవుతుంది

కాంతన్న : తప్పకుండా రంగన్న... బాగుపడే అవకాశముంటే దాన్ని వదులుకోను.

రైతు సోదరులారా .క్లిష్ట పరిస్థితుల్లో పంటలను కాపాడుకొనే 'వరం' నీటికుంట...మెట్ట వ్యవసాయంలో చాలా ముఖ్యం... ఎక్కువ విస్తీర్ణంలో కుంట ఉన్నప్పుడు, అలాగే నీరు ఎక్కువకాలం నిల్వ ఉండే పరిస్థితుల్లో చేపలు, రొయ్యల పెంపకం కూడా చేపట్టవచ్చు. కుంటచుట్టూ పశుగ్రాసం పెంచటానికి వీలవుతుంది... పండ్లు, కలప చెట్లు ఉన్నవారు బిందెల ద్వారా నీరు పోయడానికి వీలవుతుంది...అన్నింటికీ మించి ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగటానికి ఉపయోగపడుతుంది.

వ్యవసాయానికి అవసరమైన వనరుల్లో నీరు ప్రధానమైనది...తొలకరిలో కురిసే వర్షాలను ఏ విధంగా నిల్వ చేసుకొని తిరిగి పంటలకు వాడాలనేదానికి ఒక మార్గం "నీటికుంటలు" ...మరి మీ పొలాలలో వాటికి చోటు కల్పించండి...మీ కన్నీళ్ళకి శెలవిప్పించండి.

# డ్రమ్‌సీడర్ పద్ధతి........ పేరడీ సాంగ్

( అభినందన సినిమాలోని 'అదే నీవు... అదే నేను' పాట )

ఎం.వి. శ్రీకాంత్
వ్యవసాయ అధికారి
రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు

కాంతన్న వరినాట్లకు బాధపడుతూ ఇలా పాడుతున్నాడు...

**పల్లవి**

అదే నారు ... అదే తీరు
అదే పోరు నాట్లకు........ (2)
కూలీలే కరువులే ... నారీమో ముదిరెలే...      || అదే నారు...అదే తీరు ||

**చరణం 1**

నారువయసు ఒకనెల అంట ... వేసిన విత్తనం ఒక మూట...
నారుమడికి ఖర్చు రెండువేలు ... నాట్లకోసం మరో మూడువేలు...
కూలీలనే రమ్మంటే ... మరో వారమంటారే...
ఎంతో భారము ... వరి సేద్యము........(2)
ఎన్నినాళ్ళు ఈ నాట్లబాధను మోయను...      || అదే నారు...అదే తీరు ||

( పాటవింటున్న సీతక్క ఇలా అంటోంది ... 'అయ్యో కాంతన్నా... ఇంకా ఆ పాత పాటే పాడుతున్నావా...ఇప్పుడందరూ వరిలో ఈ కొత్తపాటే పాడుతున్నారు...విను '...)

**చరణం 2**




నారుమడితో పనిలేదంట ... గింజ ఖర్చు సగమేనంట
పరికరంతో పని సులువంట ... ఇద్దరుంటే ఇక చాలంట
కోనోవీడర్ వాడుతూ ... ఆరుతడిగా నీరిస్తే...

అధిక పిలకలు ... అధిక కంకులు....
అధిక దిగుబడి.... అధిక రాబడి....
పొదుపు నీటితో మరొక ఎకరం సాధ్యమూ...

నారే లేదు... నాటే లేదు...
డమ్రసీడరునే వాడితే...
కూలీలే రాకున్నా ...వరిసాగు ఆగునా...      || నారే లేదు... నాటే లేదు... ||

విజయగాథ

# డ్రమ్‌సీడర్‌తో వరిసాగుపై విజయగాథ

పంట : వరి; గ్రామం: జర్జాపుపేట; మండలం : నెల్లిమర్ల; సీజన్ : ఖరీఫ్ – 2013; సబ్‌డివిజన్ – చీపురుపల్లి.

నెల్లిమర్ల మండలం, జర్జాపుపేట గ్రామంలో ఖరీఫ్ – 2013 'జాతీయ ఆహార భద్రతా మిషన్' పథకంద్వారా డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేశారు. ఈ పద్ధతిని ఆచరించిన రైతు అనుభవాలను తన మాటలలో...

నేను మద్దిలప్రసాద్, జర్జాపుపేట గ్రామనివాసిని. నేను గత 10 సంవత్సరాలనుండి జర్జాపుపేట గ్రామంలో నా 4 ఎకరాల పొలాన్ని సాగు చేస్తున్నాను. అయితే ఇప్పటివరకు నేను వరిలో సాధారణమైన నాటుపద్ధతిని ఆచరించాను. అయితే ఈ సంవత్సరం అనగా ఖరీఫ్ – 2013, నెల్లిమర్ల మండల వ్యవసాయాధికారి, ఎం. సూరినాయుడు గారి సలహామేరకు జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం ద్వారా డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేశాను.

అయితే సాధారణ పద్ధతిలో వరి వేయడంకన్నా, విత్తనం డ్రమ్‌సీడర్ విధానంద్వారా వరినాట్లు వేయుటకు ఎకరానికి విత్తనం 12–15 కేజీల వరకు సరిపడింది. దీనివల్ల విత్తనం ఖర్చు సగం వరకు తగ్గింది. అంతేకాకుండా సూడోమోనాస్ అనే విత్తనశుద్ధి మందును 8 గ్రా॥ ఒక కేజీ విత్తనానికి విత్తనశుద్ధి చేయడంద్వారా చాలావరకు తెగుళ్ళు రాకుండా ముందుగానే జాగ్రత్త తీసుకున్నాను. దీనివల్ల పురుగుమందు ఖర్చు కూడా చాలావరకు తగ్గింది.

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడడంద్వారా ఎరువు ఖర్చు కూడా సాధారణ పద్ధతి కన్నా రూ.1000 వరకు తగ్గింది. అంతేకాకుండా డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తనాలు 1 నుండి 2 గింజలు మాత్రమే సమానదూరంలో పడడంద్వారా మొక్కలకు గాలి, వెలుతురూ బాగా తగిలి మొక్క ఏపుగా పెరిగి, ఎక్కువ పిలకలు వేయడం జరిగింది. దీని కారణంగా ఎకరానికి 4 బస్తాల దిగుబడి ఎక్కువ రావడమేకాకుండా 10 రోజులు ముందుగానే పంట చేతికి వచ్చింది.

| క్ర.సం. | విషయం | సాధారణ పద్ధతి (ఖర్చు రూ) | డ్రమ్‌సీడర్ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తనఖర్చు | 750 | 325 |
| 2. | విత్తనశుద్ధి | – | 25 |
| 3. | దుక్కి+దమ్ము ఆకు | 1500 | 1500 |
| 4. | ఆకు తీయడం+ఉడుపు | 2000 | 650 |
| 5. | కలుపు తీయడం | 1000 | 500 |
| 6. | కోత+గడ్డిమోత | 3000 | 3000 |
| 7. | ఎరువు | 3000 | 2000 |
| 8. | నూర్పు | 1000 | 1000 |
| 9. | ఇతరాలు | 1000 | 1000 |
| 10. | పురుగుమందు | 1000 | 500 |
| | మొత్తం ఖర్చు | 14,250/- | 11,000/- |

దిగుబడి : సాధారణపద్ధతిలో 28 బస్తాలు = 28×1000

(ఎకరానికి దిగుబడి రూ.లలో) 28,000

డ్రమ్ సీడర్ పద్ధతిలో 32 బస్తాలు 32×1000

(ఎకరానికి దిగుబడి రూ.లలో) 32,000

ఈ సంవత్సరం వ్యవసాయ అధికారుల సలహాల మేరకు డ్రమ్‌సీడర్ విధానంద్వారా వరి నాటడంవల్ల సుమారుగా 1 రూ. పెట్టుబడికి రూ. 2.90పై వరకు లాభం పొందాను. అంతేకాకుండా సాధారణ పద్ధతికన్నా డ్రమ్‌సీడర్ విధానంద్వారా సుమారుగా ఎకరానికి రూ. 7,000/- నుండి రూ. 8,000/- వరకు లాభాన్ని పొందాను. అందువల్ల ఈ సంవత్సరం నుండి నా 4 ఎకరాల పొలంను డ్రమ్‌సీడర్ విధానంద్వారా వేయుటకు నిర్ణయించుకున్నాను.

ఈ విధానాన్ని మేము ఆచరించేలా చేసిన వ్యవసాయశాఖకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

# పుచ్చ, ఖర్బూజ పంటల సాగు వివరాలు

డా. ఎం.విజయ, ప్రధాన శాస్త్రవేత్త, డా.కృష్ణ, శాస్త్రవేత్త, డా.పి.మాధవి లత, శాస్త్రవేత్త, డా.ఎం.పద్మ, శాస్త్రవేత్త,
కూరగాయల పరిశోధనా స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్



పుచ్చ, ఖర్బూజా ఎక్కువగా తీగజాతి కూరగాయ పంటలను పోలి ఉంటాయి. ఇవి ముఖ్యంగా ఉష్ణ మండలపు పంటలు. అందువల్ల ఇవి ఆఫ్రికాకు చెందిన పంటలయినప్పటికీ మిగిలిన అన్ని ఉష్ణ దేశాలలోనూ సాగు చేయబడుతున్నాయి. ఈ పంటలు తక్కువ ఉష్ణోగ్రతను తట్టుకోలేవు. బాగా పక్వానికి వచ్చిన పండ్లలో విటమిన్ 'సి', విటమిన్ 'ఎ' ఉండడమే కాక ఎక్కువ శాతం ఇనుము కూడాకలిగి ఉంటాయి. ఈ పండ్లలో దాహాన్ని తీర్చే గుణం ఎక్కువగా ఉంటుంది.

**వాతావరణం :** తేమ తక్కువగా ఉండే పొడి వాతావరణం ఈ పంటలకు చాలా అవసరం. గింజలు మొలకెత్తే సమయంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే మొలకశాతం బాగాతగ్గి పోతుంది. పండ్లు పక్వానికి వచ్చే సమయంలో ఉష్ణోగ్రత ఉంటే కాయలు బాగాతియ్యగా తయారవుతాయి. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తెగుళ్ళు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. ముఖ్యంగా కాయ పెరిగే టప్పుడు మబ్బుపట్టి వర్షం కురిసినట్లయితే పంట ఎదుగటం సరిగా ఉండక పోవడమే కాక కాయ నాణ్యత కూడా లోపిస్తుంది. మన రాష్ట్రంలో ఈ పంటలను తోట పంటలుగానూ, నదుల యొక్క ఇసుక దిన్నెలలోనూ సాగుచేస్తున్నారు.

**నేలలు :** ఈ పంటలను అన్ని రకాల నేలలలోనూ సాగు చేసుకోవచ్చు. ఇసుక నేలల నుండి తేలిక పాటి బంకమన్ను కలిగిన నేలలు వరకూ ఈ పంటలను పండించవచ్చు. ఎక్కువ క్షార లేక ఆమ్ల గుణాలున్న నేలల్లో ఎదుగుదల సరిగ్గా ఉండదు. ఈ రకమైన నేలలలో సాగు చేస్తే ఆకులు పసుపు వర్ణానికి మారిపోతాయి. ఉదజని సూచిక 6.0 నుండి 6.7 ఉన్న నేలలు సాగుకు అవుకూలమైనవి. మురుగు నీటి వసతి కూడా ఉండడం తప్పనిసరి.

**విత్తే సమయం :** ఈ పంటలను జనవరి-ఫిబ్రవరి నేలల్లో విత్తుకొన్నట్లయితే ఏప్రిల్ - మే నెలల్లో కాపుకు వస్తాయి. జూన్ - జూలై నెలల్లో కూడా విత్తుకొని వర్షాధారంగా సాగుచేయవచ్చు. అయితే వేసవిలో వచ్చిన కాపుకు మంచి ధర పలుకుతుంది.

**నేల తయారీ, విత్తేవిధానం - ఎరువులు :** పొలాన్ని 3-4 సార్లు బాగా దున్ని తయారు చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో హెక్టారుకు 30 టన్నుల పశువుల ఎరువును వేయాలి. 60 సెం.మీ. వెడల్పుగల కాలువలను తయారు చేసుకోవాలి. అయితే ఈ కాలువల మధ్య 3 మీటర్లు ఎడం ఉండేలా చూసుకోవాలి. కాలువకు ఒక వైపు 50 సెం.మీ. ఎడంతో విత్తనాలను విత్తుకోవాలి. ఈ పద్ధతిలో హెక్టారుకు 1.25 నుండి 1.5 కిలోల విత్తనం సరిపోతుంది. హెక్టారుకు 60 కిలోల నత్రజని, 80-100 కిలోల భాస్వరం, 60 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను వాడుకోవాలి. నత్రజని ఎరువును సగం నాటేటప్పుడు, మిగిలిన సగం నాటిన 25 రోజుల తర్వాత వేయాలి.

డిసెంబర్ - జనవరి నెలల్లో చలి ఎక్కువగా ఉన్నప్పుడు గింజలు సరిగా మొలకెత్తవు. అందువలన విత్తనాలను 6"×4" సైజు పాలిథీన్ సంచులలో (ఒక భాగం చొప్పున ఇసుక, ఎరువు, 2 భాగాలు మట్టి బాగా కలిపి నింపినవి) విత్తుకోవాలి. విత్తుకొనే ముందు రాత్రంతా విత్తనాలను నీళ్ళలో నానబెట్టాలి. ఒక్కొక్క సంచికి 2 లేక 3 విత్తనాలు చొప్పున విత్తుకోవాలి. గింజలు మొలకెత్తే వరకూ నీరు పోస్తుండాలి. మొలకెత్తిన తర్వాత 2-3 ఆకుల దశలో ముందుగా తయారు చేసుకొన్న కాలువలలో నాటుకోవాలి. నాటుకొనే ముందు సంచుల అడుగున బ్లేడుతో కత్తిరించి భూమిలో పాదులు ఏర్పరిచి నాటుకోవాలి. దీనివలన పొలంలో కావలసిన మొక్కల సంఖ్యను పొందవచ్చు.

వర్షాకాలంలో అంటే జూన్ - జులై నెలల్లో విత్తుకొన్నప్పుడు వర్షాధారంగా సాగుచేయవచ్చు. ఈ పద్ధతిలో జూన్ నెలలో వర్షాలు పడిన వెంటనే విత్తనం నాటుకోవాలి. జనవరి - ఫిబ్రవరి నెలల్లో విత్తుకొన్నప్పుడు గింజలు మొలకెత్తిన తర్వాత కాలువలలో నీరు పారించి తడులు ఇవ్వవలసి ఉంటుంది. పది రోజులకు ఒకసారి నీరు పారిస్తే సరిపోతుంది. నీరు పారించేటప్పుడు కాలువల

మధ్య ఉండే ఖాళీ ప్రదేశం తడవకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే ఈ ఖాళీ ప్రదేశంలో తీగలు ప్రాకుతాయి. కనుక తీగలపై ఏర్పడిన కాయలు నేలను తాకి ఉండడం వల్ల నేల తడిచినట్లయితే కాయలు కుళ్ళి పాడయ్యే అవకాశం ఉంది.

**కోత, దిగుబడి :** పుచ్చ పంట పక్వానికి వచ్చినప్పుడు కాయ మొదట్లో ఉన్న తీగ ఎండిపోతుంది. కాయ నేలకు తగిలే భాగం పసుపు రంగుకు మారుతుంది. కాయను చేత్తో తట్టినపుడు డొల్ల శబ్దం వస్తుంది.

కర్బూజా పండు పక్వానికి వచ్చినపుడు తొడిమ భాగం చుట్టూ సన్నటి చారలు ఏర్పడతాయి. పూర్తిపక్వ దశలో పండు మొత్తం తొడిమ నుండి వేరుపడుతుంది.

పుచ్చ పండు ఎకరాకు 20-25 టన్నుల దిగుబడినిస్తుంది.

పుచ్చ పండు ఎకరాకు 20-25 టన్నుల దిగుబడినిస్తుంది. కర్బూజా దిగుబడి ఎకరాకు 10-12 టన్నుల వరకు వస్తుంది.

ఈ పంటలకు మొక్కల ప్రథమ దశలో, కాయ ఎదిగే దశలో నీటి అవసరం ఎక్కువ. కాయ పక్వానికి వచ్చినప్పుడు ఎక్కువ నీరు కట్టినట్లయితే కాయలు పగిలిపోయే అవకాశం ఉంది. అదీ కాక కాయ నాణ్యత కూడా తగ్గిపోతుంది.

**అంతర కృషి :** కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. పెండిమిథాలిన్ మందును లీటరు నీటికి 6 గ్రాముల చొప్పున కలిపి గింజలను నాటిన ఒకరోజు తర్వాత పిచికారీ చేయాలి. దీనివలన పొలంలో కలుపు మొదటి 60 రోజుల వరకూ నివారించబడుతుంది. 2-3 నీటి తడులు ఇచ్చిన తర్వాత ఒకటి రెండు సార్లు మట్టిని తేలికగా గుల్లబరిస్తే మొక్కలు బలంగా పెరుగుతాయి. ఆ తర్వాత మొక్కలు 2 లేక 4 ఆకుల దశలో ఉన్నప్పుడు 3 లేదా 4 మి.గ్రా బోరాక్స్ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేస్తే కాయల శాతం పెరుగుతుంది. పుచ్చ పంటలో పూతకు ముందు తీగ చివర్లు త్రుంచివేస్తే పక్క తీగలు అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది. పుచ్చకాయ రంగు బాగా రావడానికి కాయలను 4-5రోజులకు ఒకసారి తిప్పుతూ ఉండాలి. అదే ఖర్బూజా పంటలో అయితే తీగ మొదట్లో నుండి వచ్చే పక్క తీగలను తీసివేసి ఒక్కో మొక్కకు 2-3 తీగలనే పెరగనివ్వాలి. దీనివలన కాయసైజు పెరిగి దిగుబడి పెరుగుతుంది.

## తెగుళ్ళు - యాజమాన్యం

**బూడిద తెగులు :** ఈ తెగులు సోకినప్పుడు ఆకుల పైభాగాన, అడుగు భాగాన కూడా తెల్లని బూడిద రంగు మచ్చలు ఏర్పడి, ఆకు అంతా తెల్లని బూడిద వంటి పదార్థంతో కప్పబడి

ఉంటుంది. ఇది తీగపై కూడా కన్పిస్తుంది. దీనివలన ఆకులు పసుపు రంగుకు మారి, వడలినట్లు కన్పిస్తాయి. పసుపురంగుకు మారిన ఆకులు రాలిపోతాయి. తీగలు సరిగా ఎదగక, గిడసబారి చిన్న సైజులో ఉంటాయి.

**నివారణ :** పొలాన్ని శుభ్రంగా ఉంచడం చాలా అవసరం. తెగులుసోకిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేసి దూరంగా తీసుకెళ్ళి తగులబెట్టాలి. కారాథేన్ లీటరు నీటికి ఒక మి.లీ. లేదా ట్రయిడామెఫాన్ లీటరు నీటికి 0.5 మి.లీ. చొప్పున కలిపి పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. ఈ విధంగా వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు చేయాలి.

**బూజు తెగులు :** ఈ తెగులు సోకినపుడు ఆకుల అడుగుభాగాన తెల్లని బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకుల పైభాగాన మాత్రం పుసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. దీనివలన కాయల నాణ్యత లోపిస్తుంది.

**నివారణ :** పొలంలో తెగులు సోకిన పాదులను గమనించి తెగులు సోకిన ఆకులను ఎప్పటికప్పుడు ఏరి దురంగా తీసికెళ్ళి తగుల బెట్టాలి. అలియేట్ 1 గ్రాము గానీ లేదా కర్జెట్ ఎం.జెడ్-2 గ్రాములు కానీ లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేయాలి. వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

**పల్లాకు తెగులు :** ఈ తెగులు ఒక రకమైన వైరస్ వలన సోకుతుంది. దీని వలన ఆకుల ఈనెలు మాత్రం పుసుపురంగుకు మారి పోతాయి. ఆకుల మీద బుడిపెల వలె ఏర్పడతాయి. తెగులు సోకిన పాదులు పూత పూయవు. కాయలు కూడా ఏర్పడవు.

**నివారణ :** ఈ తెగులు సోకినప్పుడు ఆ పైరు నుండి విత్తనాన్ని సేకరించరాదు. పాదులలోనూ, పైరుచుట్టూ కూడా కలుపు మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచడం చాలా అవసరం. ఈ తెగులు పేనుబంక ద్వారా వ్యాపిస్తుంది కనుక పేనుబంకను నివారించడానికి రోగార్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి. దీనివలన పేనుబంక ఉధృతి తగ్గి తెగులు వ్యాప్తి తగ్గుతుంది.

**ఫ్యూజేరియం వేరు కుళ్ళు తెగులు :** దీన్ని ఎండ తెగులు అని కూడా అంటారు. ఈ తెగులు భూమిలో ఉండే ఫ్యూజేరియం అనే శిలీంధ్రం వలన సోకుతుంది. తెగులు సోకిన తీగలు వడలి పోయి అకస్మాత్తుగా ఎండిపోతాయి. ఆకులు వాడిపోతాయి.

**నివారణ :** ఈ శిలీంధ్రం భూమిలో ఉంటుంది. కనుక పంట మార్పిడి పద్ధతి పాటించాలి. పంటకు ముందు భూమిలో వేపపిండి వేసి కలియదున్నాలి. అలాగే పంటకు ముందు భూమిలో వేపపిండి వేసికలియదున్నాలి. అలాగే పంట వేయక ముందు పచ్చిరొట్ట పంటలను పండించి భూమిలో కలియదున్నాలి. పంట వేసిన తర్వాత ట్రైకోడర్మా కల్చర్‌ను పశువుల ఎరువుతో పాటు కలిపి వృద్ధిచేసి పాదులలో వేయాలి. దీనికి 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితోపాటు 2-3 కిలోల కల్చర్‌ను కలిపి 15-20 రోజులు నీడలో ఉంచి నీళ్ళు చిలకరిస్తూ ఉండాలి. అవుపేడ కల్చర్ ఎరువులో బూజులాగా అభివృద్ధి అయిన తర్వాత పాదులలో వేయడానికి వాడుకోవచ్చు. కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందు ద్రావణాన్ని (లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలపాలి) పాదులలో వ్యవధి ఇస్తూ 2-3 సార్లు ఇలా చేసిన ఫలితం

ఉంటుంది.

**బాక్టీరియా ఆకుమచ్చ తెగులు :** ఈ తెగులు సోకినపుడు ఆకుల మీద, తీగమీద, కాయలమీద మచ్చలు ఏర్పడతాయి. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు కాయలపైన బాక్టీరియా వలన జిగురు ఏర్పడుతుంది. ఈ జిగురు ఎండినప్పుడు గట్టిబడి రాలిపోతుంది. ఈ తెగులు విత్తనం ద్వారా వ్యాపిస్తుంది. అయితే వర్షపు చినుకులు పడినప్పుడు ఈ తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

**నివారణ :** విత్తనాన్ని తెగులు సోకని పైరు నుండి సేకరించాలి. తెగులు సోకిన ఆకులను ఏరి దూరంగా తీసుకెళ్ళి కాల్చి వేయాలి. పాదులపై రాగిధాతు సంబంధిత మందులను లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి వారం రోజుల వ్యవధి ఇస్తూ 2-3 సార్లు పిచికారీ చేయాలి.

**కాయకుళ్ళు తెగులు :** ఈ తెగులు భూమిలో ఉండే పిథియం అనే శిలీంధ్రం వలనే ఆశిస్తుంది. పాదులను నేలపై పాకించి నప్పుడే ఇది ఎక్కువగా ఆశిస్తుంది. భూమిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు సోకే అవకాశం ఎక్కువ. తేమ ఉన్న నేలను కాయలు తాకినప్పుడు వాటిపై తెల్లని బూజు వంటి పదార్థం కప్పబడి ఉంటుంది. కాయలు కుళ్ళి మెత్తగా తయారవుతాయి.

**నివారణ :** కాయలు నేలను తాకకుండా ఉండేలా చూడాలి. దీనికి పాదులను పందిళ్ళపై పాకించాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి తీగ మొత్తం కాయలతో సహా బాగా తడిచేలా పిచికారీ చేయాలి. వారం రోజుల వ్యవధితో 2-3 సార్లు ఈ మందును వాడాలి.

**పురుగులు - నివారణ :** మొక్క మొలవగానే చీడపీడలు ఆశిస్తాయి కనుక విత్తనంతో పాటు గుళిక మందులు వేయాలి. హెక్టారుకు 20 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను దుక్కిలోనే విత్తనంతోపాటు వేయాలి. ఇది నెల రోజుల వరకు మొక్కలను కాపాడుతుంది.

**తామర పురుగులు :** చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తూ ఉంటాయి. ఇవి చిగుళ్ళను, లేత ఆకులను ఆశిస్తాయి.

**నివారణ :** ఈ పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున ఫిప్రోనిల్ కానీ లేదా డైమెథోయేట్ కానీ లేదా ఇమిడాక్లోప్రిడ్ మందును 10 లీటర్ల నీటికి 3 మి.లీ. చొప్పున కలిపి కానీ వారంరోజుల వ్యవధి ఇస్తూ 2-3 సార్లు పిచికారీ చేయాలి. ఈ విధంగా చేయడంవలన ఈ పురుగులు వ్యాప్తిచేసే వైరస్ తెగులు కూడా తగ్గిపోతుంది.

**ఎర్ర పెంకు పురుగులు :** ఈ పురుగులు పచ్చ మొక్కల్ని తొలిదశలో ఎక్కువగా ఆశిస్తాయి. ఇవి ఆకులను తినేస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి గ్రాము చొప్పున కార్బరిల్ మందును కలిపి పిచికారీ చేయాలి

**కాయతొలిచే ఈగ / పండు ఈగ :** చిన్న ఈగలు కాయలపై గుడ్లు పెడతాయి. గుడ్లు నుండి వచ్చిన గొంగళి పురుగులు కాయలకు రంధ్రం చేసి గుజ్జు తినడం వలన కాయలు కుళ్ళిపోతాయి. దీని నివారణకు 100 మి.లీ. మలాథియాన్ + 100 గ్రాముల బెల్లం 100 లీటర్ల నీటిలో కలిపి మట్టి చిప్పలలో వేసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఇది తల్లి ఈగలకు విషపు ఎరగా పనిచేస్తుంది. ఈ మందు ద్రావణాన్ని కాయల మీద, పిందెల మీద కూడా పిచికారీ చేయాలి.

# శ్రీవరిసాగు - అధిక దిగుబడి సాధించిన మహిళారైతు విజయగాథ

ఎస్. నాగిరెడ్డి (బి.టి.ఎం. ఆత్మ) ఎం. సౌజన్యదేవి, ఎస్.ఎం.ఎస్. పుత్తూరు బ్లాక్, చిత్తూరు జిల్లా.

ప్రస్తుత వ్యవసాయ విధానంలో రైతులు విచక్షణారహితంగా పైరుకు అవసరానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువుల వినియోగానికి అలవాటుపడ్డారు. దీనివలన పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా పంటలకు చీడపీడలు అధికంగా ఆశించడం, తిరిగి వాటి నివారణకు క్రిమిసంహారక మందులు విచక్షణారహితంగా వాడటంవలన మనం పండించిన పంటల్లో పురుగుమందుల అవశేషాలు చేరి ఇటు మానవాళికి, అటు నేల ఆరోగ్యానికి హాని కలుగజేస్తున్నాయి.



చిత్తూరు జిల్లా, నారాయణవనం మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహిళారైతు టి. ధనలక్ష్మి వ్యవసాయ, "ఆత్మ" అధికారులు అందించిన సహకారంతో తనకు ఉన్న ఎకరం పొలంలో "శ్రీ వరిసాగు ప్రదర్శనా క్షేత్రం" ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఈ ప్రదర్శనా క్షేత్రంలో రసాయన ఎరువులు మితంగా వాడి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించి మంచి దిగుబడి సాధించారు. మిగతా విషయాలు ధనలక్ష్మిగారి మాటల్లో తెలుసుకుందాం.

వ్యవసాయ, "ఆత్మ" అధికారులు మా గ్రామాన్ని సందర్శించినరపుడు శ్రీవరిసాగు విధానం గురించి వివరంగా తెలియజేశారు. వారి సహకారంతో రసాయన ఎరువులు తక్కువగా వాడి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించి, ఒక ఎకరం విస్తీర్ణంలో శ్రీవరిసాగు చేయడానికి అంగీకరించాను. ఎడిటి-37 అనే వరిరకాన్ని ఒక సెంటు విస్తీర్ణంలో కార్బండిజం మందు ద్రావణంతో విత్తనశుద్ధి చేసి 21.12.2013వ తేదీ నారు పోశాను. పొలాన్ని దమ్ముచేసి 12వ రోజు వరుసల్లో మొక్కకు మొక్కకు 10 అంగుళాల ఎడంతో కుదురుకు ఒక మొక్క చొప్పున మా ఇంటి మనుషులమే జాగ్రత్తగా నాటుకున్నాము. దమ్ములో ఎలాంటి రసాయన ఎరువులు వేయకుండా దిబ్బ ఎరువు 2 ట్రాక్టర్లు, కంపోస్టు ఎరువు వినియోగించాము. పైరు పెరిగేదశలో ద్రవ జీవామృతం, బ్రహ్మాస్త్రం, చీడపీడలు రాకుండా నీమాస్త్రం, కషాయాలను స్వయంగా తయారుచేసి వాడాం. యూరియా మాత్రం పిలకలు కట్టే దశలో, చిరుపొట్ట దశలో 40 కిలోల చొప్పున 5 కిలోలకు ఒక కిలో వేపపిండి కలిపి పైరుకు వినియోగించాం. ఇతర రసాయన ఎరువులు ఏ దశలోనూ పైరుకు వాడలేదు. కలుపు నివారణకై కోనో వీడర్‌ను 3 సార్లు లాగించాం. పిలకలు కట్టేదశ పూర్తయ్యేసరికి కుదురుకు 55 నుండి 70 పిలకలు వరకు వచ్చాయి. చీడపీడల నివారణకు ఎలాంటి పురుగు మందులు వాడలేదు. 30.03.2014న పంటకోసి నూర్పిడి చేయగా 39 బస్తాలు దిగుబడి వచ్చినది. బస్తా ఒక్కొంటికి రూ. 890/- ప్రకారం విక్రయించగా రూ. 35,155లు ఆదాయం వచ్చింది. విత్తనం నుండి కోత వరకు ఇతర కూలీలను వినియోగించక కేవలం ఇంటి మనుషులమే పొలం పనులు చేయడంవలన పెట్టుబడి ఖర్చులు కూడా రూ..4000ల వరకు మిగిలాయి.

విజయగాథ

# హైబ్రిడ్ వరి సాగు చేసిన రైతు విజయగాథ

రైతు పేరు: బూర్లె సత్యం; తండ్రిపేరు : అప్పల స్వామి; గ్రామం: కొండగండ్రేడు; మండలం : గుర్ల

గుర్ల మండలం కొండగండ్రేడు గ్రామంలో ఖరీఫ్ 2013-14లో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రాయితీపై హైబ్రిడ్ వరి రకం - ఎరైజ్ - 6444 గోల్డ్ విత్తనాలను 25 హెక్టార్లలో ఇచ్చారు. మరియు ఈ పథకంలో రైతులను ప్రోత్సహించడానికి ఒక హెక్టారుకు 100 కిలోల డి.ఎ.పి, 50 కిలోల యూరియా, 50 కిలోల పొటాష్, 50 కిలోల జింక్ సల్ఫేట్ పూర్తి రాయితీపై సరఫరా చేశారు. ఈ హైబ్రిడ్ వరి విత్తనాలు వాడటం వలన దిగుబడి బాగా పెరిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొండగండ్రేడు గ్రామ రైతు బూర్లె సత్యం అనుభవాలు ఆయన మాటల్లో...



బూర్లె సత్యం అను నేను, కొండగండ్రేడు గ్రామం, గుర్ల మండలం రైతును. నేను గత ఖరీఫ్ సీజన్‌లో



వ్యవసాయ అధికారి, వారి సిబ్బంది సూచనలు, ప్రోత్సాహంతో హైబ్రిడ్ వరిసాగు చేయడానికి నిర్ణయించుకున్నాను. ప్రభుత్వం రాయితీపై అందించిన ఎరైజ్ - 6444 గోల్డ్ విత్తనాలను ఎకరానికి 6 కిలోలు విక్రయించాను. విత్తనాలకి కార్బండజిమ్ అనే మందుతో వారి ఆధ్వర్యంలో విత్తనశుద్ధి చేశాను. బాగా దున్నిన నారుమడిలో విత్తనాలు కొంచెం దూరం దూరంగా వెదజల్లాను.

నారుమడి పదిరోజుల వయస్సు ఉన్నపుడు కార్బోఫ్యూరాన్ - 34 గుళిక ఒక కిలో వేశాను, దీనివలన పంట ఊడిచిన నెల రోజుల వరకు ఆరోగ్యంగా ఉంది. 16 రోజుల వయసు ఉన్న నారుమడిని ప్రధానపొలంలో ఉడవటం జరిగింది.

వ్యవసాయ అధికారి వారి సలహాల మేరకు ఆఖరి దమ్ములో ఎకరానికి 50 కిలోల డిఎపి, 20 కిలోల పొటాష్ వేశాను. ఊడిచేటప్పుడు ఒక్కొక్క పుల్ల ఊడిచాను. ఊడిచిన మూడవ రోజు ఆక్సిడయార్జిల్ అనే మందు నీళ్లలో కలిపి, పది గమేలాల ఇసుకకి పట్టించి, చేనులో వెదజల్లాను. దీనివలన కలుపు చాలావరకు అదుపులో ఉంది. తరువాత కేవలం ఒక్కసారి ఆరుగురు మనుషులతో కలుపు తీయించాను.

తరువాత ఉడిచిన 30 రోజులకు 25 కిలోల యూరియా వేశాను. మరలా చిరుపొట్ట దశలో 25 కిలోల యూరియాతోపాటు, 20 కిలోల పొటాష్ వేశాను. దమ్ములో జింక్‌సల్ఫేట్ 20 కిలోలు వేసితిని దీనివలన పైరు చాలా ఆరోగ్యంగా పెరిగింది. ఈవిధంగా ఎరువులు పరిమితంగా వాడటంవలన చీడపీడలు ఆశించలేదు. అంతేకాకుండా ఉడిచిన 25 రోజులకు వేపనూనె ద్రావకం పిచికారీ చేశాను. దీనివలన పురుగుమందులు పిచికారి చేయవలసిన అవసరం రాలేదు.

ఈవిధంగా హైబ్రిడ్ వరిసాగు చేయడంవలన విత్తనఖర్చు మోతాదు కేవలం 5-6 కిలోలు మాత్రమే ఎకరానికి సరిపోయింది. ఎరువులు ఖర్చు తగ్గటమే కాకుండా, పురుగులు తెగుళ్ళు ఆశించకుండా పైరు ఆరోగ్యకరంగా పెరిగింది. సాధారణ పద్ధతికన్నా దుబ్బులు బాగా ఎక్కువ పిలకలు తొడిగాయి. దీనివలన నాకు సాధారణ పద్ధతి కన్నా సుమారు ఎనిమిది బస్తాలు ధాన్యం అధికంగా వచ్చాయి.

| సాధారణ పద్ధతిలో అయ్యే ఖర్చు | | | | హైబ్రిడ్ వరి పద్ధతి - ఖర్చు | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | రూ. | 600/- | 1. | విత్తన ఖర్చు | రూ. | 1380/- |
| 2. | విత్తన శుద్ధి | | లేదు | 2. | విత్తన శుద్ధి | రూ. | 25/- |
| 3. | నారుమడి ఖర్చు | రూ. | 500/- | 3. | నారుమడి ఖర్చు | రూ. | 500/- |
| 4. | నారుమడి శుద్ధి | | లేదు | 4. | నారుమడి శుద్ధి | రూ. | 200/- |
| 5. | నారు తీత, ఉడుపు | రూ. | 1800/- | 5. | నారు తీత, ఉడుపు | రూ. | 2000/- |
| 6. | కలుపు నివారణ | రూ. | 1800/- | 6. | కలుపు నివారణ | రూ. | 800/- |
| 7. | ఎరువుల ఖర్చు | రూ. | 3000/- | 7. | ఎరువుల ఖర్చు | రూ. | 2460/- |
| 8. | సస్యరక్షణ ఖర్చు | రూ. | 1000/- | 8. | సస్యరక్షణ ఖర్చు | రూ. | 200/- |
| 9. | కోత, నూర్పిడి | రూ. | 5000/- | 9. | కోత, నూర్పిడి | రూ. | 5000/- |
| 10. | మొత్తం సేద్యపు ఖర్చు | రూ. | 15,700/- | 10. | మొత్తం సేద్యపు ఖర్చు | రూ. | 14,565/- |
| | దిగుబడి ఎకరానికి | | 16.8 క్వింటాళ్ళు | | దిగుబడి ఎకరానికి | | 21.6 క్వింటాళ్ళు |
| | క్వింటాకు లభించిన ధర | రూ. | 1300/- | | క్వింటాకు లభించిన ధర | రూ. | 1300/- |
| | మొత్తం లభించిన ధర | రూ. | 21,840/- | | మొత్తం లభించిన ధర | రూ. | 28,080/- |
| | నికర ఆదాయము | రూ. | 6140/- | | నికర ఆదాయం | రూ. | 13,515/- |
| | సి.బి. రేషిలో | | 1:1.39 | | సి.బి. రేషిలో | | 1:1:9 |

ఈ హైబ్రిడ్ వరి పద్ధతి సాగు చేయటం వలన సాగు ఖర్చు తగ్గటమే కాకుండా సుమారు 5.0 క్వింటాళ్ళ దిగుబడి అధికంగా పొందాను. మొత్తము నాకు సాధారణ పద్ధతికన్నా సుమారు ఎకరానికి రూ.7,000/- అధికంగాపొందాను. ఈ పద్ధతి నాకు చాలా సంతృప్తికరంగా ఉంది. రానున్న ఖరీఫ్ సీజన్‌లో నాకు ఉన్న 3.0 ఎకరాలలో ఈ వరి రకాన్నే వేయటానికి నిర్ణయించుకున్నాను.

## మినుములో పల్లాకు తెగులు - యాజమాన్యం

- బి.వి.నాగేంద్రప్రసాద్, వ్యవసాయాధికారి, రైతుశిక్షణా కేంద్రం, నంద్యాల, కర్నూలు.

మన రాష్ట్రంలో మినుమును తొలకరిలోను, రబీలో, వేసవిలో వరి కోతల తర్వాత పండిస్తారు.

పల్లాకు తెగులు (ఎల్లో మొజాయిక్) : ఇది జెమిని వైరస్ జాతివలన వచ్చే తెగులు. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాయల మీద పసుపు పచ్చ మచ్చలు ఏర్పాడతాయి. తొలిదశలో ఈ వైరస్ తెగులు ఆశించినట్లైతే పైరు గిడసబారిపోయి పూత పూయక ఎండిపోతుంది. ఈ వైరస్ తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

యాజమాన్యం

- తెగులు తట్టుకొనే ఎల్.బి.జి.-752, టి-9, సి-31 రకాలను సాగుచేయాలి.
- ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 5 గ్రాములు కె.జి. విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి.
- పైరుకు చుట్టూ నాలుగు వరుసలు మొక్కజొన్న లేదా జొన్న విత్తుకోవాలి.
- పొలం గట్లపైన, రోడ్డు పక్కన వైరస్ ఆశించిన కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి.
- తెగులు సోకిన మొక్కలను తొలిదశలోనే పీకి నాశనం చేయాలి.
- పొలంలో అక్కడక్కడా జిగురు పూసిన పసుపు పళ్ళాలను ఉంచినట్లయితే తెల్లదోమ ఉనికిని, ఉధృతిని అంచనా వేసుకోవచ్చు.
- విత్తిన 15 లేక 20 రోజులకు ఒకసారి వేపనూనె 5 మి.లీ. ఒక లీటరుకు కలిపి లేక 5 శాతం వేప గింజల కషాయం కాని పిచికారీ చేయాలి.
- తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేక మోనోక్రోటోపాస్ 2 మి.లీ.లేక అసిఫేట్ 1.0 గ్రాము లేక మెటాసిస్టాక్స్ 2.0 మి.లీ. లేక ఎసిటమిప్రిడ్ 0.2 గ్రాములలో ఏదేని ఒక దానిని ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి మందును మార్చి పదిరోజులు వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలి.

# సేంద్రీయ వ్యవసాయంతో లాభాల బాటలో మెదక్ జిల్లా రైతు

శోభారాణి, వ్యవసాయ సహాయ సంచాలకులు, రైతు శిక్షణా కేంద్రం, సంగారెడ్డి, మెదక్ జిల్లా.

సాధారణ పంటలు పండిస్తూ అసాధారణ లాభాలు గడిస్తున్న మెదక్ జిల్లా మాచవరం గ్రామానికి చెందిన జాలాది శ్రీనివాసరావు తనకున్న 22 ఎకరాల భూమిలో 10 ఎకరాలను ఖచ్చితంగా సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు.

సహజంగానే సేంద్రీయ వ్యవసాయంపై మక్కువ పెంచుకొని వ్యవసాయ శాఖవారి సాంకేతిక సలహా పాటిస్తూ ఆహారధాన్యపు పంటలను పండిస్తున్నారు.

రైతు శిక్షణా కేంద్రం-సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో జరుగుతున్న సేంద్రీయ వ్యవసాయం స్కీమ్‌లో భాగమై వారిచే శిక్షణ పొందుతూ తను పండించే సేంద్రీయ ఉత్పత్తులపై సర్టిఫికేట్‌ను కూడా పొందియున్నారు.

**రైతు పాటించిన పద్ధతులు అతని మాటలలో:**

- సాంకేతిక సలహాలకు వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదిస్తాను.
- సేంద్రీయ వ్యవసాయం పై ఎన్నో అవగాహన సదస్సులకు హాజరై ఆ పద్ధతులు పాటిస్తాను.
- ప్రతి సంవత్సరం జరుగు హార్టి ఎక్స్‌పోర్ట్‌లో పాల్గొంటాను. దాని వలన బయటి నుంచి నాకు ఆర్డర్లు వస్తున్నాయి.
- వర్మీ హాచరీ నిర్మాణం కోరకు ప్లాన్ చేస్తున్నాను.

| ఎకరానికి వాడిన సేంద్రీయ ఎరువుల వివరాలు | ఎకరానికి అయిన ఖర్చు | రాబడి వివరాలు |
|---|---|---|
| పొలం తయారీ | 4000 | |
| వితనాలు (30 కె.జీ) | 600 | |
| పచ్చిరొట్ట ఎరువులు | 500 | |
| సేంద్రీయ / జీవన ఎరువులు | రైతు శిక్షణా కేంద్రం వారి ఆధ్వర్యంలో100 శాతం సబ్సిడీ వాడకం జరిగినది. | |
| పురుగు మందులు | సొంతంగా తయారీ | |
| కలుపుతీత 2 సార్లు | 3000 | |
| వరి కోతలు | 3000 | |
| కుప్పలు వేయడం | 3000 | |
| నూర్పిడి | 2000 | |
| ఇతర ఖర్చులు | 2000 | |
| దిగుబడి | | 20 క్వింటాళ్ళు |
| ప్రోసెసింగ్ ఖర్చులు | 2000 | |
| (ధాన్యం చేయుట, బ్యాగింగ్ మొ॥) | | |
| మొత్తం ఖర్చు | 20,000 | |
| మొత్తం ఆదాయం | | 1200 కె.జీ × 50 = 60000 |
| నికర ఆదాయం | | 60,000-20,000 = 40,000 |

పురుగు మందులను సహజ పద్ధతిలో తయారు చేసుకుంటున్న ఆ రైతు అభినందనీయం, ఇతర రైతులకు ఆదర్శం కూడా. గత 5 సంవత్సరాల నుండి సేంద్రీయ వ్యవసాయం లో ఉంటూ వరి పంటనే కాకుండా ఇతర పంటలను సైతం సేంద్రీయ పద్ధతిలో పండిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ నాణ్యమైన ఉత్పత్తులను పండించి అధిక లాభాన్ని పొందుతున్నారు.

**రైతు చిరునామ :** జాలాది శ్రీనివాసరావు, గ్రా॥ మాచవరం, మం॥.-జి॥.మెదక్, ఫోన్ : 9959199175



# గుంటూరు జిల్లాలో 'వెబ్ కాస్టింగ్' - ఓ నివేదిక

ఎ.ఎం.శ్రీలత, పి.డి., ఆత్మ, గుంటూరు.

తరతరాలుగా మానవుడు మేధస్సుకు పదును పెడుతూ వ్యవసాయంలోనే కాక పశుపోషణ, ఉద్యాన పంటల సాగు, మత్స్య పరిశ్రమ, కోళ్ల పరిశ్రమలలో పలు ప్రయోగాలు చేస్తూ నేటి వ్యవసాయానికి బాటలు వేసారు. మారుతున్న జీవన విధానాలు, వ్యవసాయ అవసరాలకనుగుణంగా వ్యవసాయంలో పరిశోధనలు జరుగుతున్నాయి. పలువురు రైతు శాస్త్రవేత్తలు తమ వంతుగా పలు ప్రయోగాలు చేస్తూ... ఫలితాలను సాధిస్తున్నారు! మరి వ్యవసాయంలోనే కాక అనుబంధ పరిశ్రమలలో కనుగొన్న నూతన ఆవిష్కరణలు రైతులకు త్వరితగతిని అందించడానికి భారత ప్రభుత్వం సంయుక్తంగా "కృషివసంత్"ని జాతీయ పత్తి పరిశోధనా స్థానం నాగపూర్ (మహారాష్ట్ర)లో ఫిబ్రవరి 9 నుండి 13 వరకు 5 రోజులు నిర్వహించినారు.



ఆత్మ, గుంటూరు జిల్లా ద్వారా 120 మంది రైతులు 'కృషివసంత్' వేడుకలో పాల్గొనుటకు పంపించారు. అంతేగాక, ప్రభుత్వ ఆదేశాలనుసారం దాదాపుగా రెండు వేల మంది రైతులు గుంటూరు నుండి 'కృషివసంత్' వేడుకకు ప్రత్యక్షంగా వీక్షించే వేలు కల్పించింది. బహుశా ఇదే మొదటి సారునుకుంటా ఓ వ్యవసాయ కార్యక్రమాన్ని ఇలా ప్రత్యక్షంగా చూపించడం!

వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించారు. ఈ ప్రసారాలు జరిగినన్ని రోజులు ప్రతీరోజు ఇద్దరు శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరై ప్రసారమౌతున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. అంతే కాక "రైతు-శాస్త్రవేత్తల



చర్చాగోష్టి"ని కూడా నిర్వహించగా రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు! ముఖ్యంగా మిరపలో వైరస్ గురించి ఎక్కువగా అడిగారు. లాంఫారంలో నిర్వహిస్తున్న ప్రదర్శనా క్షేత్రాలను కూడా రైతులు ఆసక్తిగా సందర్శించారు. రోజుకొక శాఖ తరపున అధికారులు కూడా పాల్గొని వారి శాఖల కార్యక్రమాలు, సబ్సిడీ వివరాలు తెలియజేశారు ! 'వెబ్‌కాస్టింగ్' ప్రసారం మధ్యలో 'ఇంటర్‌నెట్' నుండి 'డౌన్‌లోడ్' చేసుకున్న వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రసారం చేయడం ద్వారా రైతులకు ఎంతో ఆసక్తిని కలిగించగలిగాం! చివరిరోజున అమరావతి జీవన ప్రయోగశాల నుండి విచ్చేసిన డా.త్రిమూర్తులు జీవన ఎరువుల గురించి 'పవర్‌పాయింట్' ద్వారా వివరించారు. రైతులు ఆసక్తిగా విన్నారు.

పాల్గొన్న రైతులకు ఆత్మ ద్వారా ఉదయం అల్పాహారం, టీ, భోజనం, రెండు సార్లు టీ, బిస్కట్స్ అందించి ప్రయాణ ఖర్చు నిమిత్తం మనిషికి రూ. 50/- ల చొప్పున ఇచ్చారు. అంబుజ సిమెంట్స్ ఫౌండేషన్ వారు చివరి రోజున 50 మంది రైతులను తీసుకువచ్చారు.

ఎరువుల వాడకంపై తయారుచేసిన కరపత్రాలని డా.ఇ.నారాయణ, ఏ.డి.ఆర్., లాం ఫారం వారి ద్వారా విడుదల చేసి రైతులకు అందించారు.

'కృషివసంత్' ప్రత్యక్ష ప్రసారం ద్వారా నాగపూరు వెళ్ళని రైతులకు చూపించడం అనేది ఓ చక్కని అనుభవంగా రైతులకు, ఆత్మ సిబ్బందికి మిగిల్చింది. ఈ అవకాశమిచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు!

# యాంత్రీకరణ ద్వారా "శ్రీ" వరి సాగు

– టి.వి. నాగపద్మిని, సహాయ వ్యవసాయ సంచాలకులు, రైతుశిక్షణా కేంద్రం, చిత్తూరు.

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చూస్తే వరి పంట సాగులో పెట్టుబడులు బాగా పెరిగి, పంట గిట్టుబాటు కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూలీల ఖర్చు నారుపోసే దగ్గరి నుండి కోత కోసేవరకు అధికంగా ఉంటుంది. సరయిన సమయంలో కూలీలు దొరకక నారు ముదిరిపోయి, ఆలస్యంగా నాటడం వల్ల దిగుబడి తగ్గడం వంటివి చూస్తున్నాం. సకాలంలో నీటివసతి లేక పోవడం కూడా సమస్యే. వీటిని అధిగమించడానికి శ్రీవరి పద్ధతిని స్వల్పంగా మార్పు చేసి యాంత్రీకరణ ద్వారా రైతులలోకి తీసుకెళ్ళేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

యాంత్రీకరణ ద్వారా శ్రీవరిసాగు పద్ధతిలో లాభాలు :

- ఎకరానికి 15 నుండి 18 కిలోల వరకు విత్తనం ఆదా అవుతుంది.
- కూలీల సమస్యను అధిగమించవచ్చును.
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేయవచ్చు. రోజుకి 5 నుండి 6 ఎకరాలు నాట్లు వేయవచ్చు.
- ఆలస్యంగా వర్షాలు పడిన పరిస్థితుల్లో సకాలంలో నాట్లు వేసుకునే అవకాశం.
- 14 నుండి 15 రోజులు లేతనారు వాడడం వల్ల పిలకలు బాగా వచ్చి దిగుబడి బాగా పెరుగుతుంది.

ప్లాస్టిక్ ట్రేలో నారు పెంచడం :

యంత్రం ద్వారా నాటడానికి నారును ట్రేలలో పెంచుకోవాలి. ఈ ట్రేలలో విత్తనాన్ని సీడింగ్ మిషన్ ద్వారా విత్తుకోవాలి. ఒకొక్క ట్రేకి 160–180 గ్రాముల విత్తనం సరిపోతుంది. ఈ యాంత్రీకరణ వరిసాగులో మొదటగా 12–15 కిలోల విత్తనాన్ని తీసుకుని ఉప్పు ద్రావణంలో కలిపి విత్తనంలో ఉన్న తప్ప, తాలు తీసేసిన తర్వాత మంచినీటిలో శుభ్రపరిచి 24 గంటలు నీటిలో నానబెట్టాలి. 24 గంటల తర్వాత నానబెట్టిన ధాన్యాన్ని మండెకట్టి 24 గంటలు ఉంచడం జరుగుతుంది. దీనివలన విత్తనం త్వరగా మొలకెత్తడానికి వీలుంటుంది. తర్వాత నల్లరేగడి మట్టిని ఎంచుకుని దానిలో ఉన్న రాళ్ళు, పుల్లలు తీసేసి మట్టిని మెత్తగా యంత్రంతో తయారు చేయడం జరుగుతుంది. తర్వాత విత్తే యంత్రంలో మట్టిని, విత్తనాలను ట్రేలలో నింపడం జరుగుతుంది. విత్తే యంత్రం గంటకు 600 నుండి 700 వరకు ట్రేలను నింపుతుంది.



ఒక ఎకరం పొలం నాట్లు వేయడానికి 80 ట్రేలు అవసరం. ట్రేలలో విత్తనం నింపిన తర్వాత పొలంలో ఎత్తయిన ప్రదేశంలోఉంచి గడ్డిని ట్రేలపై కప్పి నీటిని చల్లడం చేయాలి. ఈ విధంగా 5 రోజులు చేసిన తర్వాత గడ్డిని తీసి ట్రేలకు నీరు పెట్టడం జరుగుతుంది. ట్రేలలో నారు ఎదగడానికి 15 రోజుల వ్యవధి కావాలి.

పొలం తయారీ – నాట్లు వేయుట :

- 15–17 రోజుల నారును వరినాటు యంత్రంతో పొలంలో నాటాలి.
- ప్రధానపొలాన్ని రోటవేటర్ సహాయంతో 2 సార్లు దమ్ముచేసి లెవలర్‌తో బాగా చదును చేయాలి.
- దమ్ముచేసిన పొలంలో నాట్లు వేసేముందు పొలంలో 1 సెం.మీ. వరకు నీరుండేటట్లు చూసుకోవాలి.
- యంత్రం ద్వారా వరుసల మధ్య 30 సెం.మీ. ఉండేటట్లు వరుసలలో మొక్కకి, మొక్కట మధ్య 12–15 సెం.మీ. దూరం ఉండేలా నాటుకోవాలి.

కలుపు యాజమాన్యం : నాటిన 20 రోజులకు, తదుపరి 10 రోజుల వ్యవధిలో 2 నుండి 3 సార్లు వరుసల మధ్య వీడర్ నడిపి కలుపు నివారించుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల మొక్క వేర్లకు బాగా గాలి తగిలి సమృద్ధిగా ఎదగడానికి దోహదం చేస్తుంది. చేను చెడిపోదు. మొక్కలు పిలకలు పెట్టి దిగుబడి పెరగడానికి దోహదపడుతుంది. పైరు పూత దశకు వచ్చే వరకు నీటిని పలచగా పెడుతూ పూత దశలో 5 సెం.మీ. నీటిని పొలంలో ఉంచాలి.

యంత్రాలతో శ్రీవరిసాగు చేయడం వల్ల పంట మీద పెట్టుబడి పెట్టడం తగ్గి, నీరు ఆదా అయ్యి, సకాలంలో వ్యవసాయపనులు పూర్తి కావడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు.

**యాంత్రీకరణ ద్వారా వరిసాగులో ఆదాయ, వ్యయ వివరాలు :**

| వివరాలు | నాట్లు వేసే పద్ధతి (రూ.లలో) | యాంత్రీకరణ శ్రీవరి (రూ.లలో) |
|---|---|---|
| విత్తన మోతాదు | 600 | 300 |
| నారుమడి పెంపకం | 500 | 300 |
| పొలం తయారీ | 2500 | 2750 |
| విత్తుట / నాటు ఖర్చు | 2250 | 3000 |
| కలుపు యాజమాన్యం | 1200 | 1500 |
| ఎరువుల యాజమాన్యం | 3500 | 3500 |
| నీటి యాజమాన్యం | 600 | 800 |
| సస్యరక్షణ | 2000 | 1500 |
| కోత నూర్పిడి | 3000 | 3000 |
| మొత్తం సాగు ఖర్చు | 16150 | 16650 |
| దిగుబడి ఎకరానికి (బస్తాలు) | 28 | 31 |
| రేటు ఒక బస్తాకి | 1000 | 1000 |
| మొత్తం రాబడి / ఎకరానికి | 28000 | 31000 |
| నికర రాబడి / ఎకరానికి | 11850 | 14350 |
| నాట్లు పద్ధతి కన్నా పెరిగిన రాబడి (రూ.లలో) | - | 2,500 |

# నువ్వుల పంటలో ఎరువుల, నీటి యాజమాన్యం

బి.వి.నాగేంద్రప్రసాద్, వ్యవసాయాధికారి, రైతుశిక్షణా కేంద్రం, నంద్యాల, కర్నూలు.

ఖరీఫ్ పంటలు ఆలస్యంగా వేసిన పరిస్థితులలో రెండవ పంటగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో విత్తుకొని, అతి తక్కువ సమయంలో, తక్కువ వనరులతో అధిక నికర లాభాన్ని ఆర్జించేందుకు నువ్వుల పంట ఉపకరిస్తుంది. ఖరీఫ్, రబీలో వర్షాధారంగా పండించిన దాని కంటే రబీ లేదా వేసవిలో ఆరు తడి పంటగా వేసినపుడు చీడపీడలు బెడద తక్కువగా ఉండి, విత్తన నాణ్యత పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు.

**ఎరువులు :** ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 24 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్, 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేయాలి. నత్రజని సగభాగం, భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలోవేసి బాగా కలియదున్నాలి. మిగతా సగభాగం నత్రజని ఎరువును విత్తిన నెల రోజులకు కలుపుతీసిన తర్వాత వేయాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వాడినపుడు అదనంగా కాల్షియం, గంధకం లభించి గింజ బాగా నిండటానికి, నూనెశాతం పెరగడానికి ఉపయోగపడతాయి.

**నీటియాజమాన్యం (రబీ/వేసవి) :** విత్తిన వెంటనే తడినివ్వాలి. పూత, కాయ అభివృద్ధి, గింజ కట్టే దశల్లో తడులు తప్పనిసరిగా ఇవ్వాలి. ఈ దశల్లో తడులు ఇచ్చినప్పుడు 40-50 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయి. విత్తిన తర్వాత 35-40 రోజుల నుండి 65-70 రోజుల వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

# పద సాగు విజ్ఞానం-47

- ఎం.వి. శ్రీకాంత్, వ్యవసాయాధికారి, రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు.

**అడ్డం ఆధారాలు :**

1. పశుసంవర్థక, మత్స్యరంగాలలో జరుగుతున్న అభివృద్ధి, వివిధ కార్యక్రమాల విషయాలను తెలియజేసే ఓ తెలుగు మాసపత్రిక పేరు (4)

4. లగామ్ - తారక్ - క్లించర్ - ఈ మూడింటిలో బిస్‌పైరిబాక్ సోడియా కలుపుమందు 'వ్యాపార నామాన్ని' గుర్తించండి.... (3)

6. 'మహా టి.వి.లో 'రైతన్న' పేరుతో వ్యవసాయదారుల కార్యక్రమం ప్రసారమవుతుంది. వారానికి 2 రోజులు సాయంత్రం 5.30-6.00 గంటల మధ్య వస్తుంది. రెండు రోజుల్లో ఒకరోజు మంగళవారమయితే మరోరోజు ఏ వారమొస్తుంది? సోమవారం - బుధవారం - శుక్రవారం.... వీటిలో గుర్తించండి.... (4)

7. (ఫోటో-1) వరిలో వీటిని గమనించారా?'క్రికెట్స్' అంటారు.... ఇంతకూ ఇది మిత్రపురుగా? లేక శత్రుపురుగా?.... (5)

9. (ఫోటో-2) వరిలో ఈ తెగులును గుర్తించండి. నివారణకు 'ఈ' మందును లీటరు నీటికి 2 మి.లీ. ల చొప్పున కలిపి పిచికారీ చేయాలట. మందు పేరు?

12. రాగి విత్తనాలకు నిర్ధారించిన 'కనీస మొలకశాతం' ఎంత? అక్షరాలు వద్దు... అంకెలు చాలు... (2)

13. వరిలో ఎకరానికి కోళ్ళ ఎరువును 1.5 టన్నుల వరకు వేయవచ్చని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. అయితే బాగా చివికిన తర్వాతే వేయాలి. పొలంలో వేయడానికి ముందు కనీసం 'ఎన్ని నెలలు' బాగా చివికిన తర్వాతనే వాడాలని సూచిస్తున్నారు? ... (2)

14. (ఫోటో-3) పచ్చిరొట్టగా ఉపయోగపడే ఈ మొక్కను గుర్తించండి. (5)

16. (ఫోటో-4) గలిజేరు.. నానబాలు - ఉత్తరేణి... ఈ మూడింటిలో కనిపించే కలుపుమొక్క పేరును గుర్తించండి... (4)

17. ఐక్యరాజ్యసమితి 2016 సంవత్సరాన్ని 'ఈ పంటల' సంవత్సరంగా ప్రకటించింది. పప్పుధాన్యాలు - నూనెగింజలు - పూలతోటలు - వీటిలో గుర్తించండి. (5)

**నిలువు ఆధారాలు :**

1. కదిరి 7 బోల్డ్, కదిరి 8 బోల్డ్, భీమ... ఇవన్నీ వేరుశనగ రకాలు. వీటిని ఏ రకంగా అమ్మడానికి సాగుచేస్తారు?(5)

2. నా వద్ద 150కేజీల 'కాల్షియం అమ్మోనియం నైట్రేట్' (సిఎఎన్) ఎరువుండే ఒక మూటను పొరుగింటి రాజన్నకు ఇచ్చాను. ఇక నా వద్ద ఎంత ఎరువు మిగులుందో మీకు తెలుసు.. అయితే అందులో లభించే 'నత్రజని' ఎన్ని కిలోలు? (5)

3. (ఫోటో-5) మా టి.వి.లో ప్రతివారం వచ్చే వ్యవసాయదారుల కార్యక్రమం 'భూమిపుత్ర.... ఇక్కడ ఉండాల్సిన 'వారం' పేరును రాయండి... (4)

5. ఎం.టి.యు 1075... దోమపోటును, ఎండాకు తెగులును తట్టుకొనే వరిరకము. తెలుగులో దీని పేరు? ....(5)

8. ఆక్సిమెయిన్ అనేది ఈ మూడింటిలో ఏ కలుపుమందు వ్యాపారనామాన్ని సూచిస్తుంది. ఇమజితాఫిర్ - ఆక్సిఫ్లోరోఫెన్


- ఆక్సాడయార్జెల్.. (6)

10. మినుము, పెసరలో విత్తిన 15-20 రోజుల మధ్య 'ఇమజితాఫర్' కలుపు మందును ఎకరానికి ఎన్ని మిల్లీ లీటర్లు ఉండాలి? 100-250-400 అంకెల్లో రాయండి. (3)

11. వేరుశనగలో విత్తిన 20 రోజుల దశలో 'ఇమజితాఫిర్' కలుపు మందును ఎకరానికి ఎన్ని మిల్లీలు వాడాలి?.... (5)

15. (ఫోటో-6) ఆముదాన్ని ఆశించే ఈ రెక్కల పురుగు ఈవిధంగా గుడ్లను పెడుతుంది. తప్పా? ఒప్పా? (2)

(జవాబులు వచ్చే సంచికలో)





# మొక్కజొన్న సాగులో మెళకువలు

తనూజరాజు, సి, బి. నీతి, ఎస్. పావని, డి.సహజ, మండల వ్యవసాయ అధికారులు, మహబూబ్‌నగర్ జిల్లా.

మొక్కజొన్న పంటను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాధారంగాను, సాగునీటిక్రింద ఖరీఫ్, రబీ కాలంలో పండించటం జరుగుతుంది. మొక్కజొన్న ఆహారపంటగానే కాకుండా దాణా రూపంలోను పశువులకు మేతగాను, వివిధ పరిశ్రమలలో ముడిసరుకుగాను, పేలల పంటగాను, కాయగూర రకంగాను సాగు చేస్తున్నారు.



**నేలలు :**

- ముురుగునీరు పోయే లోతైన ఎర్ర గరప,మధ్యస్థ నల్లనేలలు బాగా అనుకూలం.
- నేలలో తేమను బట్టి ఉంచే గుణం ఉండాలి.
- నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్కజొన్న సరిగ్గా రాదు.
- నేల ఉదజని సూచిక 6.5 నుండి 7.5 మధ్య ఉండాలి.

**విత్తే సమయం :**

- జూన్ 15 నుండి జులై లోగా విత్తాలి.
- వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రిడ్ రకాలు ఆగస్ట్ మొదటివారం వరకు విత్తుకోవాలి.

**అనువైన రకాలు:**

- దీర్ఘకాలిక రకాలు: (100-120) రోజులు

  డిఎచ్ఎం - 113, 900 ఎం గోల్డ్, బయో - 9861, ప్రో-311, 30బి07
- మధ్యకాలిక రకాలు: (90-100 రోజులు)

  డిఎచ్ఎం - 111, 117, 119, కెహెచ్ - 510, బయో-9657, కెఎం - 9541, ఎంసిహెచ్-2
- స్వల్పకాలిక రకాలు: (వీటి కాలపరిమితి 90 రోజుల కంటే తక్కువ)

  డిఎచ్ఎం-115, ప్రకాశ్ కెహెచ్ - 5991, జెకెఎంఎచ్-1701, డికెసి-7074ఆర్, ఎంఎంఎచ్ - 1701, డికెసి - 7074 ఆర్, ఎంఎంఎచ్- 133, 3342

**ప్రత్యేకరకాలు :**

- తీపిమొక్కజొన్న (స్వీట్ కార్న్) : మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా స్వీట్ కార్న్ రకాలు, సుగర్-75, బ్రైట్‌జీన్ సంకర రకాలు.

**పాప్‌కార్న్ (పేలాల) రకాలు:**

- అంబర్ పాప్‌కార్న్, పియర్ల్ పాప్‌కార్న్, విఎల్ పాప్‌కార్న్ రకాలు, బిపిసిహెచ్-6 సంకర రకం.

**బేబికార్న్ రకాలు:**

- విఎల్-42, హిమ్ - 123, 128, 129 మాధురి, ప్రకాశ్, విఎల్ - 78, విఎల్ బేబికార్న్ - 1,

**విత్తే విధానం :**

- ఎకరాకు సంకర రకాలైతే 7-8 కిలోల విత్తనం వాడి 60 సెం.మీ. ఎడంగా బోదెలు చేసి సాళ్లలో 20 సెం.మీ. ఎడంగా విత్తాలి.
- ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు ఉంటాయి.
- ట్రాక్టర్‌తో అంతరకృషి చేసే ప్రాంతాల్లో 75×20 సెం.మీ. ఎడంగా (ఎకరాకు 26,666 మొక్కలు) విత్తాలి.

- విత్తేముందు కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ లేదా థైరమ్ ఎం.45 చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.
- ఎకరాకు స్వీట్ కార్న్ అయితే 5 కిలోలు, బేబికార్న్ అయితే 10 కిలోల విత్తనం వాడాలి. బేబికార్న్ మాత్రం 4×20 సెం.మీ. ఎడంగా విత్తాలి.

**ఎరువుల వాడకం:**

- ఖరీఫ్ పంటకు ఎకరాకు 72-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి.
- నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి పంట విత్తేటప్పుడు, పైరు మోకాలు ఎత్తు పెరిగిన దశ, పూతదశల్లో నేలలో తేమ చూసుకొని వేయాలి.
- మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను పంట విత్తేటప్పుడే వేయాలి.
- జింకు లోపమున్న నేలల్లో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- పైరుపై జింకు లోపం గమనిస్తే జింకు సల్ఫేట్ (20గ్రా) పిచికారీ చేయాలి.

**కలుపు నివారణ :**

- పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి.
- మొక్కజొన్నను ఏకపంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800-1200 గ్రా. అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2-3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపు నిర్మూలించవచ్చు.
- తర్వాత 30-35 రోజులకు సాళ్ల మధ్య దంతి/గుంటక తోలి మొక్కల మొదళ్లపైకి మట్టిని ఎగదోయాలి.
- వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2, 4-డి సోడియం సాల్ట్‌తో పిచికారి చేయాలి.

**నీటితడులు :**

- వర్షాధారంగా సాగుచేసినా పూతదశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్నచోట నీరు తడిస్తే మంచి దిగుబడి వస్తుంది.
- పూతదశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.
- పైరు తొలిదశలో పొలంలో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలి.

**సస్యరక్షణ :**

- పైరు తొలిదశలో ఆశించే మొవ్వ తొల్చే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10-12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ. /లీటరు) లేదా కోరాజెన్ (0.3 మిలీ/లీ) పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25-30 రోజుల దశలో ఆకుసుడుల్లో వేయాలి.
- ఆకు మాడు తెగులు నివారణకు మాంకోజెబ్ (2.5 గ్రా/లీ) ను వారం, పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- పొడతెగులు లక్షణాలు గమనించిన ప్రాంతాల్లో మొక్క దిగువనున్న 2-3 ఆకులు తుంచివేసి ప్రోపికొనజోల్ (1 మి.లీ./లీ) పిచికారీ చేయాలి.
- మొక్క ఎండు, కాండం మసికుళ్లు తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంటమార్పిడి, వేసవిలో లోతు దుక్కులు, పూతదశ, తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా చూడటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

## వర్మీకల్చర్ వలన లాభాలు

– కె.మంజుశ్రీ, వ్యవసాయాధికారి, భూ సంరక్షణ, చిత్తూరు జిల్లా.

పనికిరాని సేంద్రీయ పదార్థాలను వానపాముల పెంపకంతో సారవంతమైన ఎరువుగా తయారుచేసే విధానాన్ని వర్మీకల్చరు (వానపాముల ఎరువు తయారీ) అంటారు. వానపాములతో కొద్దిపాటి సమయాన్ని వెచ్చించి, చౌకగా లభించే పదార్థంతో మన పొలాలను సారవంతం చేసుకొనవచ్చును.

వానపాములు నేలలో ఉండే మట్టిని తిరగదోడి నేలను గుల్ల బారేటట్లు చేస్తాయి. వానపాములు విసర్జించే వ్యర్థపదార్థాల ద్వారా వర్మికాస్టింగ్స్ (వర్మీ గుళికలు) తయారవుతాయి. ఈ వర్మీ గుళికలలో ఐదుపాళ్ళ నత్రజని, ఏడింతల భాస్వరం, పదకొండుపాళ్ళు మెగ్నీషియం, ఉపయోగపడే సూక్ష్మజీవులు ఎక్కువగా ఉంటాయి.

మట్టిలోని సేంద్రీయ వ్యర్థపదార్థాలను వానపాములు ఆహారంగా ఉపయోగించుకొని నేలను పోషక పదార్థాలతో సారవంతం చేస్తాయి.



నేలను సారవంతం చేసే సూక్ష్మజీవుల పెరుగుదలకు తోడ్పడతాయి. నేలలో గాలి ఆడునట్లు చేస్తాయి. నేలను గుల్లబారునట్లు చేస్తాయి. భూమిని నీటి పరిగ్రహణ శక్తి పెంచుతాయి.

మొక్కలకు ఉపయోగపడే విటమిన్లు, హార్మోన్లు, ఎంజైములు, యాంటి బయోటిక్కులను ఉత్పత్తి చేసి మొక్కల రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. నేలలో నీరు నిలువ ఉండకుండా ఉపయోగపడుతుంది.

## నేల సూర్యరశ్మీకరణ (సాయిల్ సోలరైజేషన్).

– వి. హరిత, వ్యవసాయాధికారి, రైతుశిక్షణాకేంద్రం, చిత్తూరు జిల్లా.

సూర్యరశ్మిని ఉపయోగించుకొని ఈ విధానం ద్వారా నేలలో ఉండే శిలీంధ్రాలు, పురుగులు, నులిపురుగులు (నెమటోడ్స్), కలుపు విత్తనాలను బాగా తగ్గించవచ్చు.

మండు వేసవిలో నేల సూర్యరశ్మీకరణ పద్ధతిని చేపట్టవచ్చు. ఏప్రిల్, మే, జూన్ నెలలు ఈ పద్ధతికి అనువైనవి. ఈ సమయంలో భూములు ఖాళీగా ఉంటాయి. పొలాల్లో పంటలు ఉన్నప్పుడు, తగినంత ఉష్ణోగ్రత లేనపుడు ఈ పద్ధతి సాధ్యంకాదు. పొలానికి నీరు పెట్టడానికి రెండు మూడు రోజుల ముందు భూమిని బాగా దున్నాలి. తగినంత నీరు పెట్టాలి. నేల బాగా తడిపి పూర్తి తేమ ఉండేట్లు చూడాలి. 24 గంటల తర్వాత 0.2 మిల్లీ మీటర్ల మందం (200 మైక్రాన్స్) కలిగిన పాలిథీన్‌షీట్‌ను పలుచగా నీరున్న నేలపై కప్పి అన్ని పక్కలా మూసివేయాలి. 4 నుండి 6 వారాల పాటు ఈ విధంగా పాలిథీన్ షీట్ ఉంచాలి. దీనివల్ల నేల ఉష్ణోగ్రత 60 డిగ్రీల సెల్సియస్ పైగా పెరిగి రోగకారకాలు నశిస్తాయి. ఈ పద్ధతి వల్ల తుంగజాతి మొక్కలు తప్ప మిగిలిన రకాల కలుపు మొక్కలు నశిస్తాయి. పిథియం (నారుకుళ్ళు కలిగించే శిలీంధ్రం) ఫైటఫ్తోరా, ఫ్యూజేరియం, స్క్లరోషియం, రైజోక్టోనియా వంటి హానికలిగించే శిలీంధ్రాలు, నులిపురుగులు నశిస్తాయి. ఈ పద్ధతి కూరగాయ పంటల్లో చాలా అనువైనది.

# అక్షరసేద్యం - 44

## (మూడు అంచెల వ్యవసాయ 'క్విజ్')

**ఎం.వి.శ్రీకాంత్**, వ్యవసాయాధికారి, రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు

### మొదటి అంచె : (10 ప్రశ్నలు)

**1 నుంచి 3 ప్రశ్నల గడులలోని అక్షరాలను అటూ ఇటూ మారిస్తే ఓ చక్కని వ్యవసాయ వాక్యం తయారవుతుంది.**

**1.**

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| నీ | వ | ని | డి | పు | యం | ర్ష | ల్వ | చే | టి | ని |
| | | | | | ని | | | చే | | |

**2.**

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కం | పం | వే | చె | స | ట | యం | గా | జ్జ | డి | ను |
| | | | | చె | | | | | | |

**3.**


| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| టి | ను | ఏ | యం | టు | నీ | చే | ట | కుం | ల | ర్చా | డి |
| | | | | ల | | | | | | | |

**4.** రైతులకు ఈ జీవి చాలా మేలు చేస్తుంది. దీనికి 'జీవనాగలి' అనే బిరుదు కూడా ఉన్నది. ఇంతకూ మనం ఏ జీవి గురించి మాట్లాడుతున్నాం...

| | | | |
|---|---|---|---|
| | | | |

**5.** శ్రీలక్ష్మి-శ్రీశైల-వకుళ ...ఇవన్నీ చిరుధాన్యాపు పంటల విత్తన రకాలు. వీటిలో జొన్న రకం ఏది ?

| | | |
|---|---|---|
| | | |



6. ట్రైడిమార్ఫ్ 80%ఇ.సి...ఇదోక తెగులు మందు...దీని వ్యాపార నామాన్ని ఈ మూడింటిలో గుర్తించండి...కెరాథేన్ - కాలిక్సిన్ - థయోవిట్

7. (ఫోటో-1) ఇక్కడున్న కలుపు మందు వ్యాపార నామాన్ని చదవండి..'లగామ్'అని ఉన్నది... ఈ మూడింటిలో దేనికి సంబంధించిందో గుర్తించండి.. పెండిమిథాలిన్ - ఆక్సీఫ్లోరోఫెన్ - ఇమజితాఫిర్

8. (ఫోటో-2) వరిలో ఈ పురుగును ఎప్పుడైనా గమనించారా? ఇంతకూ ఇది మిత్రపురుగా లేక శత్రుపురుగా ?

9. (ఫోటో-3) వరికి నష్టించే ఈ పురుగు పేరు?

10. (ఫోటో-4) వరిలో ఈ లక్షణాన్ని గమనించండి...దానికి కారణం పక్కనున్న పురుగే మరి...దానిపేరు...

**రెండవ అంచె :** రంగు గడులలోని అక్షరాలను కింది '14' ఖాళీ గడులలో నింపండి.

ఈ అక్షరాల సాయంతో కింది ప్రశ్నలకు వాటి పక్కనున్న గడులను జవాబులతో నింపండి. 14 అక్షరాలు మిగలకుండా నింపండి.

1. ఈ అక్షరాలలో ఉదర స్వభావం గల ఓ పురుగు మందు యొక్క వ్యాపార నామాన్ని వెతకండి...

2. కార్శీ చెరకు తోటలో తెల్ల ఆకులకు కారణం 'ఈ' పోషక లోపము

3. పురుగుమందు డబ్బాపై విషతీవ్రత ప్రభావం చూపే రంగు గుర్తు ఉంటుంది.. పైన 'డేంజర్' పదం ఉన్నది...దాని కింద ఏ రంగు ఉండాలి ?

4. వేరుశనగ పంటనాశించే ఓ శత్రుపురుగు...

**మూడవ అంచె :** (రెండవ అంచె సమాధానాల గడులలోని చుక్కలున్న '10' గడుల్లోని అక్షరాల నుంచి '7' అక్షరాలతో కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.)

1. పంట పొలాలకు ఇది పోయే సౌకర్యం ఉండాలి...

2. ఇందులో దాగిన ఓ సుగంధ ద్రవ్యపు పంట....

(జవాబులు వచ్చే సంచికలో...)

# పాలకు అధిక ధర పొందాలంటే...!

డా. సి.ఎచ్.రమేశ్, హైదరాబాద్. సెల్ : 9966208899



ప్రస్తుతం పాల ధరను పాలలోని వెన్న, ఎంత ఎక్కువగా ఉంటే, రేటు కూడా అంత ఎక్కువగా పొందే అవకాశాలుంటాయి. కాబట్టి రైతులు అధిక పాలను ఉత్పత్తి చేయడం పట్ల ఎలాగైతే శ్రద్ధ చూపిస్తారో, అలాగే పాలల్లో వెన్న శాతం పెంచుకునే మార్గాల పట్ల అవగాహనను పెంపొందించుకుని ఆచరించాలి. అప్పుడే వారు ఉత్పత్తి చేసే పాలకు అధిక రేటు పొంది, పాడిద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతారు.

పాలల్లో వెన్న శాతం హెచ్చుతగ్గులు పాడి పశువుల జాతి, వయస్సు, ఈతల సంఖ్య, పాడికాలం, మేపు, ఆరోగ్యం, వాతావరణం, పాలు పితికే ప్రక్రియ మొదలగు అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల రైతులు పశుజాతి, మేపు, ఆరోగ్యం, యాజమాన్య పద్ధతుల ఆచరణ, పాలు పితికే విధానం మొదలగు వాటిపై శ్రద్ధ వహించాల్సి ఉంటుంది.

పాలల్లో వెన్నశాతం పెరగాలంటే ప్రస్తుతం అనుసరిస్తున్న పాడి పశువుల మేపు పద్ధతుల్లో కొన్ని మార్పులు చేయడం అవసరం. పశువులకు అందించే మేపులో 1/3 వంతు ఎండుగడ్డి ఉండాలి. ఈ ఎండుగడ్డిని కూడా అప్పుడప్పుడు కాకుండా, పాడి పశువు ముందు కనీసం 9-10 గంటలపాటు ఉంచి, ఎక్కువ సమయం నమిలే పరిస్థితి కల్పించాలి. పశుగ్రాసాల్లో మూడవ వంతు పప్పుజాతి పశుగ్రాసాలుండాలి. పచ్చి మేతను అంగుళం సైజులో చాప్ కట్టర్‌తో ముక్కలు చేసి పశువులకు అందించాలి. అదే విధంగా సమీకృత దాణాను రోజుకు 2 సార్లు కాకుండా, 4-5 సార్లు కొద్ది కొద్దిగా తాగే నీటితో కలపకుండా తడిపి ఇవ్వాలి. పచ్చిగడ్డి, ఎండుగడ్డిని పాలు పితికే 1-2 గంటలు అడ్వాన్స్‌గా అందించి, పాలు పితికే ముందు దాణా ఇవ్వడం శ్రేయస్కరం. ఎండుగడ్డి ఎక్కువగా అందించాల్సిన పరిస్థితుల్లో బైపాస్ ప్రోటీన్ అధికంగా ఉండే పత్తి చెక్కను రాత్రి నాన బెట్టి, ఉదయం పశువులకందించాలి. విటమిన్ ఎ, కాపర్, కోబాల్ట్, ఇనుము, మొదలగు ఖనిజ లవణాలు ఉన్న మిశ్రమాన్ని ప్రతి రోజు వాడాలి.

పశువులు ఆరోగ్యంగా ఉంటేనే, పితికిన పాలల్లో వెన్న శాతం బాగుంటుంది. అనారోగ్యంగా ఉన్న సందర్భాల్లో, ఎద సమయంలో, 3-4 కి.మీ. దూరం నడిచి అలసిపోయిన సమయాల్లో, దూడ మరణించినప్పుడు ఉత్పత్తి అయ్యే పాలల్లో వెన్న శాతం తగ్గుతుంది. కాబట్టి రైతులు పాడి పశువుల ఆరోగ్య సంరక్షణ విషయంలో శ్రద్ధ వహిస్తుండాలి.

పాలలో వెన్న శాతంపై వాతావరణంలో ఉష్ణోగ్రత ప్రభావం కూడా ఉంటుంది. ఉష్ణోగ్రత 10 డిగ్రీల ఫారన్ హీట్ చొప్పున పెరిగితే, 0.1-0.2% చొప్పున వెన్న శాతం తగ్గుతుంది. ఈ కారణం వల్లనే వేసవిలో కంటే చలికాలంలో ఉత్పత్తి అయ్యే పాలల్లో వెన్న శాతం అధికంగా ఉండడం గమనిస్తాం. కాబట్టి పశువులు అధిక ఉష్ణోగ్రతకు గురికాకుండా అనుకూలంగా ఉండే పాకల్ని ఏర్పాటు చేయడం, శరీరంపై నీళ్ళు చిలకరిస్తుండటం, తాగేనీళ్ళను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచడం మొదలగు వాటిపై శ్రద్ధ కనబరచాలి.

పాలు పితికే సమయంలో రైతాంగం స్వల్ప మార్పులు గమనించి, ఆచరిస్తే పాలల్లో వెన్నశాతం ఎక్కువగా పొందగలుగుతారు. పాలు పితికే సమయంలో పాడి పశువు బెదరకుండా చూడాలి. ప్రతిరోజు ఒకే వ్యక్తి పాలు పితకాలి. చివరి పాలధారలను దూడలకు వదలకుండా తామే పితికి తీసుకోవాలి.

పాలల్లో వెన్నశాతం పెరగాలంటే.. పైన పేర్కొన్న ఆహారంతోపాటు ప్రతిరోజు కొలిన్ 20-50 గ్రా.లు లేదా వంటసోడా 100 గ్రా.లు లేదా బైపాస్ ఫ్యాట్ అందించవచ్చు.

పాలల్లో వెన్న శాతంతో పాటు, ఉత్పత్తి చేసే పాలు పరిశుభ్రంగా, స్వచ్ఛంగా, తాజాగా ఉంటే కూడా మంచి ధర లభిస్తుంది. నాణ్యమైన పాలల్లో బ్యాక్టీరియా శాతం తక్కువగా ఉంటున్నందున, పాలు ఎక్కువకాలం నిలువ ఉంటాయి. తాజాగా ఉంటాయి. ఇలాంటి పాలను వినియోగదార్లు ఎక్కువ ధర చెల్లించి కొనేందుకు ముందుకు వస్తారు. కావున పాడి పశువుల ఆరోగ్యం, పాకల శుభ్రత, పాలు పితికే వ్యక్తి ఆరోగ్యం, పాలు పితికే సమయంలో వాడే పాత్రలు, నీరు మొదలగు విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన పాల ఉత్పత్తి వీలవుతుంది. తద్వారా పాల ఉత్పత్తిదారులకు మంచి ఆదాయం లభించడంతో పాటు, ఎంతో మంది వినియోగదారుల కుటుంబాల్ని అనారోగ్యం బారిన పడకుండా రక్షించిన వారవుతారు. పరిశుభ్రమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తి వల్ల పాలు, పాల పదార్థాల ఎగుమతి అవకాశాలు మెరుగై, రైతాంగం భవిష్యత్తులో చక్కటి ధర ఆర్జించగలుగుతుంది.

# రైతులప్రశ్నలు - శాస్త్రవేత్తల సమాధానాలు

శాస్త్రవేత్తలసలహాలకు ఉచిత ఫోన్ నెం :
1100 & 1800 425 1110
తెలంగాణకు : మొబైల్ ద్వారా 1800 425 1110,
ఆంధ్రప్రదేశ్ కు : మొబైల్ ద్వారా 1800 425 4440
నంబర్లకు ఉ.10 గం.నుండి సా.5 గం.వరకు
సంప్రదించవచ్చును.


డా.ఎ.ప్రతాప్ కుమార్ రెడ్డి, డా.పి.స్వర్ణ డా.ఎస్.హేమలత,
డా. వై. సునీత, పృథ్వీచంద్రా రెడ్డి, ఫార్మర్స్ కాల్ సెంటర్ (పరిష్కారం), ఆచార్య ఎన్.జి.రంగా
వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్.




**1. రాజు, రఘునాథపల్లి గ్రా.।,మం.।, వరంగల్ జిల్లా.**

**ప్ర. జీలుగ ఎప్పుడు వేసుకోవాలి, ఎప్పుడు కలియదున్నాలి వివరాలు తెలపండి ?**

జ. తొలకరి వర్షాల సమయంలో ఎకరానికి 8-12 కిలోల విత్తనాన్ని వెదజల్లి పూత దశలో (45-60 రోజులకు), 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి భూమిలో కలియదున్నాలి.

❖ నేలలో కలియదున్నిన తరువాత చివకడానికి 3 వారాల వ్యవధి ఇవ్వాలి.

❖ పైరు నాటే ముందు పొలంలో నీటిని బయటకు తీసి కొత్త నీటిని పెట్టాలి. ఇలా చేయడం ద్వారా పచ్చి రొట్ట కుళ్ళేప్పుడు వెలువడే విష పదార్థాల వలన పంటకు హాని కలుగదు.

**2. రవిప్రసాద్, పాముల పల్లె గ్రా., అశ్వాపురం మం॥, ఖమ్మం జిల్లా.**

**ప్ర. కందిలో రైజోబియంను విత్తనానికి ఎలా పట్టించాలో తెలపండి ?**

జ. కొత్తగా కందిని వేసేటప్పుడు, విత్తనానికి రైజోబియంను పట్టించడం వలన వేరు బొడిపె ద్వారా గాలిలోని నత్రజని స్థిరీకరించబడుతుంది.

❖ ముందుగా 100 మి.లీ.నీటిలో 10గ్రా పంచదారను లేక బెల్లంను లేదా గంజిపొడిని కలిపి 10 నిమిషాల పాటు వేడిచేసి చల్లార్చుకోవాలి.

❖ ఈ ద్రావణాన్ని 10 కిలోల విత్తనం పై చిలకరించి దానికి 200 గ్రా రైజోబియం కల్చర్ ను కలిపి 10 నిమిషాల పాటు ఆరనిచ్చి చల్లని వేళలో (పొద్దున లేక సాయంత్రం) వెంటనే పొలంలో విత్తుకోవాలి.

**3. శారద, మణికొండ గ్రా.।,రాజేంద్రనగర్ మం.। రంగారెడ్డి జిల్లా.**

**ప్ర. ఒకసారి వేసిన హైబ్రిడ్ విత్తనాన్ని మళ్ళీ విత్తనంగా ఉపయోగించుకోవచ్చా ?**

జ. రైతు తన హైబ్రిడ్ పైరు నుండి సేకరించిన విత్తనాలు విత్తుకోవడానికి పనికిరావు. ఆశించిన దిగుబడులు రావు.

❖ హైబ్రిడ్ రకాల విత్తనాలను (సంకర రకాలు) తప్పని సరిగా ప్రతి సంవత్సరం ఆయా రకాలను రూపొందించిన వారి నుండి సేకరించవలసి వస్తుంది.

**4. వెంకట్ రావు, మానూరు గ్రా.।,మం.।, మెదక్ జిల్లా.**

**ప్ర. సోయా చిక్కుడు విత్తుకునే సమయం, ఎరువుల యాజమాన్యం గురించి వివరాలు తెలపండి ?**

జ. వర్షాధార పంటగా, సోయాచిక్కుడును ఖరీఫ్‌లో జూన్ 15 నుండి జూలై 15 వరకు విత్తుకోవచ్చును.

❖ ఎకరాకు 12 కిలోల నత్రజని. 24.కి భాస్వరం, 16కి పొటాష్ నిచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేయాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే గంధకం కూడా లభ్యమవుతుంది.

**5. రాజు, నారయణ్‌ఖేడ్ గ్రా.।,మం.।, మెదక్ జిల్లా.**

**ప్ర. ఉల్లి నాటి 10 రోజులు అయ్యింది కలుపు నివారణ తెలపండి ?**

జ. నాటిన 15-20 రోజులకు పొలంలో అన్ని రకాల కలుపు మొక్కలు ఉన్నట్లయితే ఆక్సిఫ్లోర్ ఫెన్ 100 మి.లీ, క్విజాలాఫాప్ ఇథైల్ 400 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**6. కవిత, నెక్కొండ గ్రా.।,మం.।, వరంగల్ జిల్లా.**

**ప్ర. మొక్కజొన్న, మిరప అంతర పంటలుగా ఉన్నప్పుడు కలుపు నివారణ తెలపండి ?**

జ. పెండిమిథాలిన్ (స్టాంప్, పెండిగార్డ్, పెండిమిన్, పెండిస్టార్) లేదా అలాక్లోర్ (లాసో, అలాటాప్) అనే మందును ఎకరాకు 1.0 నుండి 1.25 లీటర్లు అనగా లీటరునీటికి 5-6 మి.లీ చొప్పున కలిపి విత్తిన 24 నుండి48 గంటలలోపు తేమ గల నేలపై పిచికారీ చేయాలి.

**7. మధు, తాడూరు గ్రా.।,మం.।, మహబూబ్‌నగర్ జిల్లా.**

**ప్ర. బెండలో తెల్లదోమ నివారణ తెలపండి ?**

జ. బెండలో తెల్లదోమ, పూతకు ముందు చిన్న, పెద్దపురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు రంగులోకి మారతాయి.

❖ పొలంలో అక్కడక్కడ పసుపు రంగు డబ్బాలకు గ్రీజుగాని, ఆముదంగాని పూసి తెల్ల దోమలను ఆకర్షింపచేసి నాశనం చేయాలి.

❖ నివారణకు ట్రైజోఫాస్ 2 మి.లీలేదా థయోమిథాక్సామ్ 0.3గ్రా లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా+వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి 10రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

8. కమలాకర్, చిట్టమూరు గ్రా.।,మం.। నెల్లూరు జిల్లా.

ప్ర. వరిలో ముదురు నారు వేసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వివరాలు తెలపండి ?

జ. ఎకరాకు వేయవలసిన నత్రజని మూడు దఫాలుగా కాకుండా రెండు దఫాలుగా 50%దమ్ములో మిగతా 50% చిరుపొట్టదశలో వేసుకోవాలి.

9. వేణుగోపాల్, రాజమండ్రి గ్రా.।,మం.। తూర్పుగోదావరి జిల్లా.

ప్ర. ఉల్లిలో ఎరువుల యాజమాన్యం గురించి వివరాలు తెలపండి ?

జ. ఉల్లి పంటకు సిఫారసు మేరకు ఎరువులను వేయాలి.

❖ ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువులను దుక్కిలో వేసుకోవాలి.

❖ 130-175 కిలోల యూరియా, 150-200కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఆఖరు దుక్కిలో), 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి.

❖ నత్రజని, పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా, నాటినపుడు, 30 రోజుల పిదప వేసుకుంటే గడ్డ బాగా వూరుతుంది.

❖ వేరుశనగ పిండి లేదా ఆముదం పిండి వేసి మట్టి ఎగదోయడం వల్ల కూడా ఎక్కువ దిగుబడి వస్తుంది.

10. నారాయణ, గిద్దలూరు గ్రా.।,మం.।, ప్రకాశం జిల్లా.

ప్ర. మిరపలో నారు కుళ్ళిపోతుంది నివారణ తెలపండి ?

జ. లేత మొక్కల కాండం మెత్తబడి నారు గుంపులుగా చనిపోతుంది.

❖ నారు కుళ్ళు కనిపించిన వెంటనే నీటి తడులు ఆపి వేయాలి.

❖ ఎత్తు నారు మళ్ళు వేయాలి. వత్తుగా విత్తకూడదు.

❖ నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెటలాక్సిల్ 3 గ్రా.లీటరు నీటికి చొప్పున కలిపి నారుమడి నేల తడపాలి.

❖ ట్రైకోడెర్మా విరిడి, పశువుల ఎరువు, వేప పిండి (2:90:8) కలిపిన మిశ్రమాన్ని నారుమడికి తయారు చేసిన పొడి మట్టితో కలిపి ఎత్తైన నారుమడి చేయాలి.

11. వెంకట్‌రావు, చోడవరం గ్రా.।,మం.। విశాఖపట్నం జిల్లా.

ప్ర. బీరలో బూడిద తెగులు నివారణ తెలపండి ?

జ. ఆకుల పై భాగాన ముందుగా తెలుపు లేదా బూడిద రంగులో చిన్న మచ్చలు ఏర్పడి తర్వాత తెల్లని పొడివంటి (బూడిద) పదార్థం ఏర్పడుతుంది.

❖ ఆకులు పండుబారి ఎండిపోతాయి. లేత ఆకుల కన్నా దాదాపు 20 రోజుల వయసున్న ఆకుల పై ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

❖ 1 మి.లీ.ట్రైడిమార్ఫ్ లేదా డైనోకాప్ లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలి.

12. ప్రసాద్, కలరయానగూడెం గ్రా.।, లింగపాలెం మం.।, పశ్చిమగోదావరి జిల్లా.

ప్ర. చామగడ్డలో ఎరువుల యాజమాన్యం గురించి వివరాలు తెలపండి ?

జ. చామగడ్డలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 150 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ చివరి దుక్కిలో వేయాలి.

❖ నత్రజని ఎరువును 105 కిలోలు యూరియా రూపంలోను 32 కిలోల పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలోను (54 కిలోలు), దుంప మొలకెత్తిన 30,60,90 రోజులలో వేయాలి.

❖ ఎరువు వేసి మట్టి కప్పి తేలికపాటి తడులివ్వాలి.

13. సత్యనారాయణ, పెద్దకూరపాడు గ్రా.।,మం.।, గుంటూరు జిల్లా.

ప్ర. నిమ్మలో పచ్చ పురుగు ఆశించింది నివారణ తెలపండి?

జ. జూలై నుండి ఫిబ్రవరి వరకు ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

❖ ప్రారంభ దశలో గుడ్ల నుంచి వెలువడిన వెంటనే లేత ఆకు చిగుర్ల పై ఆశించి నష్టం కలిగిస్తాయి తర్వాత గొంగళి పురుగులు ముదురు ఆకు పచ్చగా మారి నిద్రావస్థను చేరే వరకు లేత ఆకులను తింటూ రంధ్రాలు ఏర్పరుస్తాయి.

❖ నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ.మోనోక్రోటోఫాస్ లేదా 1 మి.లీ.డైక్లోరోవాస్ లేదా 1 గ్రా.బీటి ఫార్ములేషన్ (హాల్ట్)ను కలిపి పురుగులు చిన్నగా ఉన్నప్పుడే పిచికారీ చేయాలి.

14. గంగాధర్, పరమటికోన గ్రా.।, చిన్నమండెం మం.।, కడప జిల్లా.

ప్ర. టమాటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరాలు తెలపండి ?

జ. ఎకరానికి 6-8 టన్నుల పశువుల ఎరువుతో పాటు 150 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చివరి దుక్కిలో వేయాలి. 120 కిలోల యూరియా 3 సమపాళ్ళుగా 30,45,60 రోజున పై పాటుగా వేసి బోదెలు ఎగదోయాలి.

❖ నాటిన 30-45 రోజులకు లీటను నీటికి 5 గ్రా.జింక్ సల్ఫేట్ పిచికారీ చేసినట్లయితే 20 శాతం దిగుబడి పెరుగుతుంది.




# దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా ఆగస్టు 2014లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

## ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 040-27031431, 27031432, 27031433

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 01.08.2014<br>శుక్రవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | పత్తిసాగు<br>యాజమాన్యం | డా.వి.చెన్నారెడ్డి<br>ప్రధాన శాస్త్రవేత్త,<br>(పత్తి) | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం<br>లాం, గుంటూరు - 522 034<br>ఫోన్: 9989625207<br>pscottonangrau@gmail.com |
| 06.08.2014<br>బుధవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | మెట్ట పంటలలో<br>ఉద్యాన పంటల సాగు | డా. ఎ.కిరణ్ కుమార్<br>శాస్త్రవేత్త (ఉద్యాన) | పండ్ల పరిశోధనా స్థానం<br>సంగారెడ్డి, మెదక్ జిల్లా<br>ఫోన్: 9440108930<br>adapakirankumar@gmail.com |
| 08.08.2014<br>శుక్రవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | ఖరీఫ్ నూనెగింజల పంటలో<br>అధిక దిగుబడికి<br>సూచనలు | డా. ఎం.వి.నగేష్ కుమార్<br>ప్రధానశాస్త్రవేత్త<br>(నూనెగింజలు) | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం<br>పాలెం, మహబూబ్‌నగర్ జిల్లా-509 215<br>ఫోన్ : 8008404874<br>psoil_seed@gmail.com |
| 13.08.2014<br>బుధవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | గేదేల పెంపకంలో<br>మెళకువలు | డా. సి.ఎచ్.వెంకటేశయ్య<br>అసోసియేట్ ప్రొఫెసర్<br>&హెడ్ | ఎన్.టి.ఆర్. పశువైద్య కళాశాల,<br>గన్నవరం, కృష్ణా జిల్లా<br>ఫోన్ : 9951373366<br>seshuchappidi@yahoo.com |
| 15.08.2014<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6-7 గంటల వరకు | శీతాకాలంలో<br>దూడల పెంపకంలో<br>తీసుకోవలసిన జాగ్రత్తలు | డా.ఎం.కిషన్ కుమార్<br>ప్రొఫెసర్ | ఐ.ఎల్.ఎఫ్.సి. పశువైద్య కళాశాల,<br>కోరుట్ల, కరీంనగర్<br>ఫోన్ : 9848066708<br>drkishan9@yahoo.com |
| 20.08.2014<br>బుధవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | వరి సాగులో<br>మెళకువలు | డా.వై.సూర్యనారాయణ<br>ప్రధాన శాస్త్రవేత్త<br>(వరి) | వ్యవసాయ పరిశోధనా స్థానం<br>నెల్లూరు - 524 004<br>ఫోన్ : 9989625214<br>surya_vijetha@yahoo.co.in |
| 22.08.2014<br>శుక్రవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | మిరప సాగులో<br>మెళకువలు | డా.ఎల్.నారం నాయుడు<br>ప్రధాన శాస్త్రవేత్త<br>& హెడ్ | ఉద్యాన పరిశోధనా స్థానం<br>లాం, గుంటూరు - 522 034<br>ఫోన్: 9440845195<br>naramnaidu@gmail.com |
| 27.08.2014<br>బుధవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | గొర్రెలలో వచ్చే<br>వ్యాధులు - నివారణ | డా.ఎస్.అయోధ్య<br>అసోసియెట్ ప్రొఫెసర్ | పశువైద్య కళాశాల - టి.వి.సి.సి<br>రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30<br>ఫోన్ : 9490003032<br>sayodhya6@gmail.com |
| 29.08.2014<br>శుక్రవారం<br>సాయంత్రం<br>5.30-6.00 గంటలకు | ఖరీఫ్ పంటల సరళి<br>ప్రత్యామ్నాయాలు | డా.డి.రాజిరెడ్డి<br>డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ | ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం<br>రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.<br>ఫోన్: 9989625220 |

విజయగాథ

# డ్రమ్‌సీడర్‌తో వరి నాటిన రైతు విజయగాథ

గుర్ల మండలం నడుపూరు గ్రామంలో గుంపిన రామారావు పొలంలో ఖరీఫ్-2013లో జాతీయ ఆహార భద్రతా పథకం కింద డ్రమ్ సీడర్‌తో వరి విత్తించటం జరిగింది. ఈ పద్ధతివలన సాగు ఖర్చు తగ్గటమే కాకుండా, దిగుబడి కూడా పెరిగింది. ఈ పద్ధతిలో రైతు అనుభవాలు ఆయన మాటలలో...



గుంపిన రామారావు అను నేను గత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అధికారి, వారి సిబ్బంది సూచనల మేరకు డ్రమ్‌సీడర్‌తో నేరుగా వరి విత్తే విధానం గురించి తెలుసుకున్నాను. వారి సలహాల మేరకు ముందుగా నా పొలంలో మట్టి నమూనాలు వారి



సహాయంతో సేకరించి, మట్టి పరీక్షకై పంపించాను.

ముందుగా పచ్చిరొట్ట ఎరువు అయిన కట్టెజనుము విత్తనాలను ఎకరానికి 12 కిలోలు వెదజల్లాను. అది బాగా పెరిగిన తరువాత 45 రోజుల వయసులో బాగా పొలంలో కలియదున్నాను. ఆఖరిదమ్ములో ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 20 కిలోల పొటాష్ కలిపి బాగా దమ్ము పట్టించాను. పొలం అంతా బాగా చదును చేయించాను.

10 కిలోల విత్తనాన్ని 80 గ్రాముల సూడోమోనాస్‌తో కలిపి విత్తనశుద్ధి చేసి 24 గంటలు విత్తనాన్ని నీటిలో నానబెట్టి, తరువాత 24 గంటలు మండెకట్టి, చిన్న మొలక వచ్చిన విత్తనాన్ని డ్రమ్‌సీడర్‌లో పోసి బాగా చదును చేసిన పొలంలో డ్రమ్‌సీడర్‌తో వేశాను. ఈ పద్ధతివలన నారుపోసే ఖర్చు, ఊడుపుకు అయ్యే ఖర్చు బాగా తగ్గింది. తదుపరి విత్తిన 3వ రోజు పైరజొసల్ఫ్యూర్యాన్ ఇథైల్ 10 డబ్ల్యు.పి. అనే గడ్డి మందును 80 గ్రా/ఎకరానికి చొప్పున పిచికారీ చేయించాను. దీని వలన కలుపు బాగా అదుపులో ఉండడమే కాకుండా కూలీల ఖర్చు కూడా బాగా తగ్గినది.

విత్తిన 25 రోజులకు 25 కిలోల యూరియా, 45 రోజులకు 25 కిలోల యూరియా, చిరుపొట్ట దశలో 25 కిలోల యూరియా + 20కిలోల పొటాష్ కలిపి వేయించాను. ఈ విధంగా ఎరువులు వాడటంవలన, విత్తనశుద్ధి చేయటం వలన చీడపీడలు చాలావరకు అదుపులో ఉన్నాయి, పైరు కూడా ఆరోగ్యకరముగా ఉంది.

ఈవిధంగా డ్రమ్‌సీడర్‌తో ఊడవడం భూసారపరీక్షలను అనుసరించి ఎరువులు వాడటంవలన ఎరువుల ఖర్చు తగ్గటమే కాకుండా సమయం కూడా ఆదా అయింది, దిగుబడి కూడా సాధారణ పద్ధతికన్నా పెరిగింది.

| సాధారణ పద్ధతిలో అయ్యే ఖర్చు | | | |
|---|---|---|---|
| 1. | విత్తనఖర్చు (30 కిలోలు) | రూ. | 600/- |
| 2. | నారుమడి ఖర్చు | రూ. | 500/- |
| 3. | దమ్ము , పొలం తయారీ | రూ. | 2000/- |
| 4. | నారుతీత, ఉడుపు | రూ. | 1800/- |
| 5. | కలుపు నివారణ | రూ. | 1600/- |
| 6. | ఎరువుల ఖర్చు | రూ. | 2800/- |
| 7. | సస్యరక్షణ ఖర్చు | రూ. | 1000/- |
| 8. | కోత మరియు నూర్పిడి | రూ. | 5000/- |
| | మొత్తం | రూ. | 15,300/- |
| 9. | దిగుబడి ఎకరానికి | 20.80 క్వింటాళ్ళు | |
| 10. | క్వింటాలు ధర | రూ. | 1300/- |
| 11. | మొత్తం లభించిన ధర | రూ. | 27040/- |
| 12. | నికర ఆదాయం | రూ. | 11740/- |

| డ్రమ్‌సీడర్ పద్ధతిలో అయ్యే ఖర్చు | | | |
|---|---|---|---|
| 1. | విత్తనఖర్చు (10 కిలోలు) | రూ. | 200/- |
| 2. | నారుమడి ఖర్చు | రూ. | ---- |
| 3. | దమ్ము , పొలం తయారీ | రూ. | 2500/- |
| 4. | విత్తుటకు (డ్రమ్‌సీడర్‌తో) | రూ. | 600/- |
| 5. | కలుపు నివారణ | రూ. | 800/- |
| 6. | ఎరువుల ఖర్చు | రూ. | 1900/- |
| 7. | సస్యరక్షణ ఖర్చు | రూ. | 500/- |
| 8. | కోత, నూర్పిడి | రూ. | 5000/- |
| | మొత్తము | రూ. | 11,500/- |
| 9. | దిగుబడి ఎకరానికి | 23.20 క్వింటాళ్ళు | |
| 10. | క్వింటాలు ధర | రూ. | 1300/- |
| 11. | మొత్తం లభించిన ధర | రూ. | 30160/-/- |
| 12. | నికర ఆదాయం | రూ. | 18740/- |

ఈ డ్రమ్‌సీడర్ పద్ధతిద్వారా నాకు సాగు ఖర్చు సుమారు రూ.3700/- తగ్గటమే కాకుండా సుమారు 3.00 క్వింటాళ్లు దిగుబడి అధికంగా వచ్చింది.నాకు సాధారణ పద్ధతిలో కన్నా ఈ పద్ధతిలో సుమారు ఎకరానికి రూ.6800/- అధికంగా ఆదాయం పొందాను. ఈ పద్ధతివలన నారుమడి వేయనవసరం లేనందున సమయం కూడా బాగా ఆదా అవుతున్నందున ఈ పద్ధతి నాకు చాలా సంతృప్తికరంగా ఉన్నది. రానున్న ఖరీఫ్ సీజన్‌లో నేను 3 ఎకరాలలో ఈ పద్ధతి సాగు చేయాలని నిర్ణయించుకున్నాను.

# భూసార పరీక్షల ఆవశ్యకత

– వి.భారతి, వ్యవసాయాధికారి, రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు జిల్లా.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులను సాధించాలంటే మనకున్న సహజ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలి. సహజంగా భూమిలో లభించే పోషక పదార్థాలను వినియోగించుకుంటూ ఎరువులపై వృథా ఖర్చును తగ్గించుకోవాలి. అలాగే భూమిలోని సమస్యలను తెలుసుకొని సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక లాభాలను పొందవచ్చు. కావున రైతులకు భూసార పరీక్షలు సరైన మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయి.

మట్టి నమూనాలను సేకరించాల్సిన సమయం విధానం : పొలాల్లో పంటలు లేకుండా ఖాళీగా ఉండే సమయం మట్టి నమూనాల సేకరణకు అనువైనది. సంవత్సరానికి ఒకే పంట పండించే భూముల్లో ఫిబ్రవరి నుండి మే మాసం మధ్యకాలంలో, రెండు పంటలు పండించే భూముల్లో మే మాసంలో నమూనాలు సేకరించాలి.

**మట్టి నమూనాలను సేకరించేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- మట్టి నమూనా పొలంలోని మట్టి లక్షణాలకు ప్రాతినిధ్యం కలది గాను, ప్రతిబింబించేదిగాను ఉండాలి.
- నేలలో తేడాలుంటే మాత్రం సారవంతకమైన చోట, నిస్సారవంతమైన చోట నమూనాలను విడివిడిగా సేకరించాలి.
- పొలం గట్ల వెంబడి, కాలి బాటల్లో పశువుల ఎరువులున్న ప్రదేశాల నుంచి నమూనాలను సేకరించకూడదు.
- పైరు పెరుగుతున్న సమయంలో నమూనా సేకరించవలసి వస్తే వరుసల మధ్య ఖాళీలనుంచి నమూనాలను తీయాలి.
- పైరుకు నీరు పెట్టిన వెంటనే గానీ, నీరు నిలిచి ఉన్నప్పుడుకాని నమూనాలను తీయకూడదు.
- నేలకు ఎరువులు వేసిన 45 రోజుల లోపు నమూనాలను సేకరించకూడదు.



- సమస్యాత్మక (చౌడు) భూముల్లో నమూనాలను విడిగా సేకరించాలి. వాటిని మామూలు నమూనాలతో కలుపరాదు.

**మట్టి నమూనాలను సేకరించే పద్ధతి :** ఒక యూనిట్ (5 ఎకరాలు) విస్తీర్ణంలో నమూనా సేకరణ చేయడానికి 10-15 చోట్ల మట్టిని సేకరించాలి. దీనికోసం నైలపై భాగంలోని చెత్తను తొలగించి, నాగలి సాలు లోతును (15 సెం.మీ.) 'V' ఆకారపు గుంటను తీయాలి.గుంట అంచులనుంచి సుమారు వేలి కణుపు మందం (2.5 సెం.మీ.) మట్టిని గుంట అడుగుభాగం వరకు ఉన్న మట్టిని దోకుడు పారతో సేకరించాలి. ఈ విధంగా అన్నిచోట్ల నుంచి సేకరించిన మట్టిని అంతా కలిపి శుభ్రంగా ఉన్న గోనె సంచి మీదగానీ, పాలిథీన్ సంచి మీద గానీ పోయాలి. ఈ గోనె సంచి ఎరువులకుగాని, క్రిమిసంహారక మందులకుగాని వాడినదై ఉండకూడదు. ఇలా వేసిన మట్టిని మెత్తగా పెడ్డలు లేకుండా చిదిమి కలియబెట్టి నాలుగు సమ పద్ధతిలో మట్టి ఒక అరకిలో వచ్చే వరకు వేయాలి.

సాధారణ పంటలకు నాగలి సాలు లోతు వరకు నమూనా సేకరించాల్సి ఉండగా వాణిజ్య పంటలైన పత్తి, చెరకు, మిరప, మొదలైన వాటికి ఒక అడుగునుంచి రెండు అడుగుల వరకు నమూనాను తీయాలి. పండ్లతోటల్లో నమూనాలను ఒకటినుంచి ఆరు అడుగుల వరకు ప్రతి అడుగుకు ఒక నమూనా ఉండే విధంగా సేకరించాలి. చౌడు భూముల్లో 15సెం.మీ. లోతులోను, 15-30 సెం.మీ. లోతునోను ఉండేటట్లుగా రెండు నమూనాలను సేకరించాలి.



ఈ మట్టిని గుడ్డ / ప్లాస్టిక్ సంచిలో వేసి రైతు పూర్తి వివరాలతో అనగా రైతు పేరు, గ్రామం, సర్వేనెంబరు, వేసినపంట, వేయదలచిన పంట వివరాలతో సమీపంలోని భూసార పరీక్షాకేంద్రంలో అందజేయాలి.

ఈ విధంగా సేకరించిన నమూనా ద్వారా భూసారపరీక్ష కేంద్రంలో వివిధ అంశాల గురించి, ప్రధానంగా నేలరంగు, స్వభావం, ఆమ్లక్షార గుణం, లవణ పరిమాణ సూచిక, సేంద్రియ కర్బనం, లభ్య భాస్వరం, లభ్యపొటాష్ స్థాయిల విశ్లేషణ జరుగుతుంది.

**నేలరంగు, స్వభావం :** సాధారణంగా నేలలు ఎరుపు, నలుపు మధ్య రకంగాను ఉంటాయి. కాని భూమిలో కారుచౌడు సమస్య అధికంగా ఉన్నప్పుడు బూడిద రంగుగా ఉంటాయి. నేల స్వభావాన్ని బట్టి తేలిక నేలలు, మధ్యరకం నేలలు లేక బరువు నేలలుగా వర్గీకరిస్తారు. నేల స్వభావాన్ని అనుసరించి ఈ నేలలో వేయదగిన పంటలను సూచిస్తారు.

**ఉదజని సూచిక :** నేలలోని పోషకాల లభ్యత ఉదజని సూచికపై ఆధారపడి ఉంటుంది. ఉదజని సూచిక 6.0 కన్నా తక్కువగా ఉన్నప్పుడు భూమిలో ఆమ్లత్వం ఎక్కువగా ఉంటుంది. దీనిని సరిదిద్దడానికి సున్నం ఏ మోతాదులో వాడాలో సిఫార్సు చేస్తారు. అలాగే ఉదజని సూచిక 9.0 కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు భూమిలో క్షారత్వం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితి సరిచేయడానికి అవసరమయ్యే జిప్సం మోతాదును ఉదజని సూచిక ఆధారంగానే సిఫార్సు చేస్తారు. ఏఏ పోషక లోపాలు రావడానికి అవకాశం ఉందో గుర్తించి ఆమేరకు తగిన సిఫార్సులు అందచేస్తారు.

**లవణ సూచిక :** పైర్ల పెరుగుదల చాలా వరకు ఈ లవణ సూచికపైన ఆధారపడి ఉంటుంది. లవణసూచిక 4.0 కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు చాలా పైర్లకు ఈ భూములు అనుకూలంగా ఉండవు. పాలచౌడు నేలలుగా మారతాయి. లవణ సూచికను బట్టి నేలలకు సరైన యాజమాన్య పద్ధతులను సూచిస్తారు.

**సేంద్రియ కర్బనం :** నమూనానలోని సేంద్రియ కర్బనస్థాయిని బట్టి ఆ నేలలకు అవసరమయ్యే సేంద్రియ ఎరువులను సిఫార్సు చేస్తారు. అంతేకాక సేంద్రియ కర్బనస్థాయి కొంతవరకు నేలలోని నత్రజని లభ్యతను తెలియజేస్తుంది. నత్రజని సిఫార్సులోకూడా ఈ విశ్లేషణ ఉపయోగపడుతుంది. ఈ రాష్ట్రంలోని దాదాపు అన్ని నేలలు తక్కువ స్థాయిలో సేంద్రియ కర్బనం కలిగి వున్నాయి.

**లభ్య భాస్వరం :** నమూనాలోని లభ్య భాస్వరం, హెక్టారుకు లెక్కకట్టినపుడు 20 కిలోల కన్నా తక్కువగా ఉన్నపుడు అల్పస్థాయిగాను, 25-50 కిలోల వరకు మధ్య స్థాయిగాను నిర్ణయిస్తారు. తీసుకోవల్సిన పంటకు సిఫార్సు చేసిన భాస్వరం స్థాయిని అనుసరించి కొరవడిన భాస్వరం లెక్కగట్టి పంటకు ఎరువుల ద్వారా అందించవలసిన భాస్వరాన్ని సిఫార్సు చేస్తారు.

**లభ్య పొటాష్ :** భూమిలో లభ్యపొటాష్ స్థాయి హెక్టారుకు 150 కిలోల కన్నా తక్కువగా ఉన్నప్పుడు అల్పస్థాయిగాను, 150-300 కిలోల వరకు ఉన్నప్పుడు లభ్యపొటాష్ తక్కువగా ఉన్నప్పుడు సాధారణ సిఫార్సు కంటే 1/3 వంతు ఎక్కువగా వేయాలి. లభ్యపొటాష్ ఎక్కువగా ఉన్నప్పుడు సిఫార్సుకంటే 1/3 వంతు తక్కువ వేయాలి. మధ్యస్థంగా ఉన్నప్పుడు సిఫార్సును పాటించాలి.

# సస్యరక్షణ రసాయనాలు - ఎరువుల తయారీ

తనూజరాజు, సి, బి. నీతి, డి.సహజ, ఎస్. పావని, మండల వ్యవసాయ అధికారులు, మహబూబ్‌నగర్ జిల్లా.

రసాయన పురుగు మందులు ఎక్కువ మోతాదులో, విచక్షణారహితంగా వాడడంవల్ల పర్యావరణ కాలుష్యం, పర్యావరణ అసమతుల్యత, పురుగుమందుల అవశేషాలు మొదలగు ప్రభావాలే కాకుండా పంటలకు అయ్యే ఖర్చు ఎక్కువై రైతుల ఆత్మహత్యలకు దారితీస్తాయి.


అందువల్ల మన పొలం, ఇంటిదగ్గరే జీవనంబంధిత రసాయనాలు తయారు చేసుకోవడంవల్ల ఖర్చు తగ్గించడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడుకోగలుగుతాం.

## 1. ఆవుపేడ, మూత్ర కషాయం లేదా పంచగవ్యం :

- మొదటగా 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవు మూత్రం మిశ్రమాన్ని 5 లీటర్ల నీటిలో కలిపి నాలుగు రోజుల వరకు మూతపెట్టి ఒక బకెట్‌లో అలాగే ఉంచాలి.
- ఆ తర్వాత దానిని వడపోసి 100 గ్రా. లైమ్ (సున్నం) పొడరును కలపాలి.
- పై మిశ్రమానికి 80 లీ.నీటిని కలిపితే ఒక ఎకరాకు సరిపడా ద్రావణం తయారవుతుంది.
- ఈ ద్రావణానికి పచ్చపురుగు, లద్దెపురుగు గుడ్లను నాశనం చేసే శక్తి ఉంటుంది. పంటలకు వచ్చే కొన్ని వ్యాధుల బారినుండి కూడా కాపాడుతుంది.

## 2. పొగాకు - డికాక్షన్ :

- ఒక కిలో పొగాకు పొడిని 10 లీటర్ల నీటిలో కలిపి అరగంటసేపు వేడి చేయాలి.
- ఆ తర్వాత చల్లార్చి మస్లిన్ బట్ట గుండా వడపోయాలి.
- వడపోయగా వచ్చిన ద్రావణాన్ని 80 నుండి 100 లీటర్ల వరకు పలుచగా చేసుకోవచ్చు.
- పై ద్రావణాన్ని పంటల్లో పిచికారీ చేయడంవల్ల రసం పీల్చే పురుగుల బారినుండి కాపాడవచ్చు.
- కాని పొగాకు ద్రావణాన్ని ఒకసారి మాత్రమే పిచికారీ చేయాలి. ఎక్కువగా పిచికారీ చేస్తే ఆ ద్రావణం మిత్రపురుగులను కూడా నాశనం చేయవచ్చు.





## 3. వేప విత్తన కషాయ ద్రావణం (5%)

- మొదటగా 500 గ్రా ఎండిన వేప గింజలను ఏరి మెత్తగా నూరి పొడిగా చేసుకోవాలి.
- ఆ తర్వాత 50 గ్రా. పొడిని ఒక మస్లిన్ బట్టలో తీసుకొని 400-500 మి.లీ. నీటిలో ఒక రాత్రి మొత్తం నానబెట్టాలి.
- మరుసటిరోజు మస్లిన్ బట్టను సరిగా పిండి, వచ్చిన కషాయాన్ని మరికొన్ని నీళ్ళు కలిపి ఒక లీటరు దాకా ఉండేలా చేసుకోవాలి.
- ఆ తరువాత 2 గ్రా. సబ్బు పొడిని కలిపితే మనకు 5% వేప విత్తన కషాయ ద్రావణం తయారవుతుంది.
- ఈ మోతాదులో పంటలో పిచికారీ చేస్తే లద్దెపురుగు, పచ్చపురుగు, ఆకుముడత పురుగు, నామాల పురుగు, రసం పీల్చే పురుగులను అరికడుతుంది.

## 4. ప్రాకృతిక జీవసారం :

- కూరగాయల పంటల్లో ఆడపువ్వుల శాతం, కాయల పరిమాణం పెరగడానికి అలాగే పూలమొక్కలకు ఇది చక్కని ఔషధం. పరిమాణాన్ని బట్టి 5 నుంచి 10 కొబ్బరి కాయలు తీసుకొని లోపలున్న కొబ్బరిని రుబ్బి, ముద్దగా చేసి, దీనికి 5 లీటర్ల ఆవు మజ్జిగ కలిపి 5 రోజులు




పులియబెట్టి, ఆ ద్రావణాన్ని వడగట్టి లీటరు ద్రావణానికి 10 లీ . నీరు కలిపి మొక్కలమీద పిచికారీ చేయాలి.

**5. అగ్నిబాణం లేదా అగ్ని అస్త్ర కషాయం :**

❖ దీనిని అన్ని పంటల్లో, అన్నిరకాల పాకే, ఎగిరే పురుగులవల్ల కలిగే నష్టాన్ని అతి తక్కువ ఖర్చుతో నిర్మూలించవచ్చు.

❖ 10 లీటర్ల గోమూత్రాన్ని ఒక కుండలో పోసి పొయ్యిమీద పెట్టి అందులో వరుసగా కిలో ముద్దగా చేసిన పొగాకు÷అరకిలో వెల్లుల్లి ముద్ద + 5 కిలోల వేప ఆకు ముద్ద + అరకిలో పచ్చి మిరపకాయల ముద్ద వేసి కర్రతో కలపాలి. మూతపెట్టి రెండు, మూడు పొంగులొచ్చేదాకా ఉడకబెట్టాలి.

❖ తర్వాత మూత ఉంచి రెండురోజులు చల్లార్చి మగ్గడానికి వదలేయాలి. తర్వాత పలుచటి గుడ్డద్వారా వడగట్టి మూత ఉన్న కుండలోనో, ప్లాస్టిక్ డబ్బాలోనో మూడు నెలలపాటు నిల్వ ఉంచుకోవచ్చు. అవసరమైనప్పుడు 100 లీటర్ల నీటిలో 3 లీటర్ల అగ్ని అస్త్రం కషాయం కలిపి పంటలపై పిచికారీ చేసుకోవాలి.

**6. క్రిమినాశక పంచబాణ (ఆముదం) కషాయం :**

❖ ఈ ద్రావణం చల్లితే పంటలకు పురుగులు పట్టవు, ఆకులను తినలేవు.

❖ ఒక కిలో ఆవుపేడ + 10 లీ. నీళ్లు + 1 లీ. గోమూత్రం + 250 గ్రా. తురిమిన బెల్లాన్ని బాగా కలిపి, కలిపిన మిశ్రమాన్ని 24 గంటలు పులియబెట్టిన తర్వాత వడబోయాలి.

❖ ఇలా తయారైన ఒక లీటరు కషాయంలో 10 లీటర్ల నీటిని కలిపి పంటపై (ఎకరాకు 50 నుండి 70 లీటర్ల చొప్పున) పిచికారీ చేయాలి.

**7. మొక్కల పోషక పంచబాణ (ఆముదం) కషాయం**
:

❖ ఎండిపోతున్నట్టుగా కనిపించే మొక్కలు, చెట్లు తిరిగి కొత్త చిగుర్లు వేయడానికి ఈ కషాయాన్ని వాడవచ్చు.

❖ ఒక కిలో ఆవుపేడ + ఒక లీటరు గోమూత్రం కలిపి, దానికి రెండొంతులు నీరు, 100 గ్రా. తురిమిన బెల్లం కూడా కలిపి ఒక కుండలో పోసి, మూతబెట్టి, పదిరోజులు మురగనివ్వాలి. తర్వాత ఈ మిశ్రమంలో 20 వంతుల నీళ్లు కలిపి కుండలో, డ్రమ్ములో నిల్వ చేసుకోవాలి. మొక్కలు, పాదులకైతే వాటి మొదలు చుట్టూ పైపైనే ఉన్న వేర్ల చుట్టూ అర అంగుళం లోతు, అంగుళం వెడల్పుగా తవ్వి ఈ కషాయాన్ని పోసి మట్టి కప్పాలి. సుమారు 10-15 రోజుల్లో మొక్క/చెట్టులో కొత్తదనం కనిపిస్తుంది.

**8. అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి మిశ్రమం :**

❖ మొదటగా 18 గ్రా వెల్లుల్లిని తీసుకొని, పై పొరను వేరుచేసి మెత్తగా నూరుకోవాలి.

❖ ఆ తర్వాత 9 గ్రా పచ్చిమిర్చిని + 9 గ్రా అల్లంను కలిపి మెత్తగా నూరాలి.

❖ పై మిశ్రమాలను ఒక లీటరు నీటిలో కలపాలి. ఆ తర్వాత ఒక బట్టద్వారా మిశ్రమాన్ని వడపోయాలి.

❖ 500 మి.లీ. వడపోయగా వచ్చిన ద్రావణానికి 100 గ్రా.సబ్బు పొడిని కలిపి పంటల్లో పిచికారీ చేయాలి.

❖ ఇలా పిచికారి చేయడంవల్ల పేనుబంక, దీపపు పురుగు, పిండి పురుగు, తెల్ల దోమలను నివారించుకోవచ్చు.

# ఇజ్రాయిల్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం

## వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు.

హైదరాబాద్, జూలై 8 : ఇజ్రాయిల్‌ను మోడల్‌గా తీసుకుని రాష్ట్రంలో వ్యవసాయాన్ని అభివృద్ధిచేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రపంచంలోనే తక్కువ వర్షపాతంతో తక్కువ సేద్యపు నీటి వసతితో వ్యవసాయ రంగంలో అత్యధిక దిగుబడులు పొందుతున్న దేశంగా ఇజ్రాయిల్ పేరు పొందిందని, అదే మోడల్‌తో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ప్రతినిధి బృందంతో కలిసి ప్రత్తిపాటి పుల్లారావు ఎ.పి. సచివాలయం 'జె'బ్లాక్ 8 వ అంతస్తులో అగ్రికల్చర్‌మినిష్టర్ చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్‌ను మోడల్ గా తీసుకుని రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇజ్రాయిల్ ప్రతినిధులతో సమావేశం అయినట్టు తెలిపారు. రైతులు, నిరుద్యోగ యువతకు వ్యవసాయం, పాడి పశువుల పెంపకం పట్ల ఆసక్తి కలిగించేందుకు పలు చర్యలు తీసుకుంటునట్టు చెప్పారు. ఇజ్రాయిల్ దేశం అనుసరించే పద్ధతులను క్షుణంగా అధ్యయనం చేయడానికి అధికారుల బృందంతో కలిసి ఆ దేశంలో పర్యటించనున్నట్టు చెప్పారు.


ఇజ్రాయిల్ దేశ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ యహెల్‌విలాన్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ అనేక సాంకేతిక అంశాలతో తమ దేశం వ్యవసావయ రంగంలో ఇతర దేశాలకన్నా చాలా ముందుకు వెళ్ళినట్టు తెలిపారు తెలంగాణ రాష్ట్రానికి సాంకేతిక సహకారం అందించనున్నట్టు చెప్పారు. తక్కువ వసతులతో ఎక్కువ దిగుబడి అనే నినాదంతో వ్యవసాయంలో ఇజ్రాయిల్ ముందున్నట్టు ఆయన తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, గ్రీన్‌హౌస్ పద్ధతుల్లో తమ దేశం ముందుందని అన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం తమ పర్యటర ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్ కు చెందిన వాణిజ్య సంస్థల ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. రాష్ట్రవ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ చంద్రపునేత, వ్యవసాయశాఖ కమీషనర్ కె.మధుసూదనరావు మొ॥అధికారులు పాల్గోన్నారు.


## రాష్ట్రంలో నిషేధింపబడిన క్రిమి సంహారక మందుల జాబితా

ఈ దిగువ పేర్కొనబడిన క్రిమి సంహారక మందులు రాష్ట్రంలోని పురుగు మందుల పరీక్షా కేంద్రాలలో నాసిరకంగా నమోదు అయ్యాయి. అందువలన కింద సూచించిన తయారీ కంపెనీల బ్యాచ్ నెంబర్లు గల క్రిమి సంహారక మందులు నిల్వ చేయడం, అమ్మడం నిషేధించాం. రైతులు ఈ విషయాలను గమనించాలి.


| క్రమ సంఖ్య | కంపెనీ పేరు | నాసిరకంగా గుర్తించబడిన పురుగుమందు పేరు | బ్యాచ్ నెం. |
|---|---|---|---|
| 1. | మెగామణి ఆర్గానిక్ లిమిటెడ్, అంక్లేశ్వర్, బరుచ్, గుజరాత్ | అసిటామిప్రిడ్ 20 శాతం ఎస్.పి. (ట్రేడ్ నేమ్-అవార్డ్) | 13/డి.యమ్/34 |
| 2. | కోరమాండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ | ఫిప్రోనిల్ 5 శాతం ఎస్.సి. (ట్రేడ్ నేమ్-హెక్సానెయిల్) | 13042917 |
| 3. | కోరమాండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ | ఎసిఫేట్ 75 శాతం ఎస్.పి. | 13061512 |
| 4. | నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్, గుంటూరు జిల్లా | ఎసిఫేట్ 75 శాతం ఎస్.పి | ఇ. పి. ఇ 1305133 ఎస్2282ఎ |
| 5. | యునైటెడ్ ఫాస్పరస్ లిమిటెడ్, అంక్లేశ్వర్ | మోనోక్రోటోఫస్ 36 శాతం ఎస్.ఎల్. (ట్రేడ్ నేమ్-ఫోస్కిల్) | హెచ్.కె.జె.పి.కెఎల్ 3605 |
| 6. | నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్, హైదరాబాద్ | మోనోక్రోటోఫస్ 36శాతం ఎస్.ఎల్. (ట్రేడ్ నేమ్-మోనోక్రాన్) | ఇ.యమ్.ఎన్ 1307038 |
| 7. | క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ప్రై. లిమిటెడ్ | ఫిప్రోనిల్ 5 శాతం ఎస్.సి. (ట్రేడ్ నేమ్-క్రిజెన్ట్-ఎస్.సి.) | ఎన్-200/57 |
| 8. | రాజ్‌శ్రీ షుగర్ & కెమికల్స్ లిమిటెడ్ | స్యుడోనోమస్ ఫ్లోరిసెన్స్ 5 శాతం డబ్ల్యూ.పి. | 01/06 |
| 9. | క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రై.లిమిటెడ్ | కాప్టన్ 70 శాతం + హెక్సాకోనజాల్ 5 శాతర్ డబ్ల్యూ.పి.(ట్రేడ్ నేమ్-కిక్) | కె.ఆర్.ఇ/జె.కె - 38 |

**VYAVASAYA PADIPANTALU** - A Telugu Monthly Journal of Department of Agriculture - RNI Regn. No. APTEL / 2012 / 47334 - AUGUST 2014
Postal Licence No. : HSE/531/2012-2014 REGISTERED Ref. No.LF/PCI/M-5/299-AP - Published on 05-08-2014




# వ్యవసాయ యంత్ర పరికరాలను
# వాడి సాగు ఖర్చు తగ్గిద్దాం







Printed & Published by K. Madhusudhana Rao, I.A.S., Commissioner and Director of Agriculture,
Government of Andhra Pradesh, Basheer Bagh, Hyderabad - 500 001.